thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 269 కరీంనగర్ శనివారం, 6 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## తీర్పుల వివరాలన్నీ వెల్లడించాలి

న్యూఢిల్లీ : న్యాయస్థానాలు ఇచ్చే తీర్పుల విషయంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాల హైకోర్టులు తమతమ వెబ్‌సైట్లలో ఒక డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేసి, అందులో తీర్పుల వివరాలను వెల్లడించాలని ఆదేశించింది. ఈ ఏడాది జనవరి 31 తర్వాత రిజర్వ్ చేసిన తీర్పులు, వెల్లడించిన తీర్పులు, అప్‌లోడ్ చేసిన తేదీలతో సహా డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఝార?ండ్ హైకోర్టు సహా పలు హైకోర్టులు సివిల్, క్రిమినల్ కేసుల్లో తుది వాదనలు పూర్తయిన తర్వాత కూడా ఏళ్ల తరబడి తీర్పులు ఇవ్వకపోవడాన్ని ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలోనే తీర్పుల వివరాలన్నీ ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేసింది.





# బెంగాల్‌పై కన్నేసిన కమలదళం

# మోడీ నయా స్ట్రాటజీ..!

## ఎన్నికలపై నేతలకు దిశానిర్దేశం!

వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలపై బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. వచ్చే సంవత్సరం తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రాజకీయంగా, సంఖ్యా పరంగా కూడా ఈ మూడు రాష్ట్రాలు.. ఉత్తరప్రదేశ్ తర్వాత స్థానంలో ఉన్నాయి. దీంతో ఈ మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఆయా రాష్ట్రాల్లోని అధికార పార్టీలకు.. జాతీయ పార్టీలుగా ఉన్న కాంగ్రెస్, బీజేపీకి కూడా ప్రాణప్రదంగా మారాయి. ఇక, ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. ఒక్క కేరళలో మాత్రమే కమ్యూనిస్టు ప్రభావం ఉంది. ఈ నేపథ్యంలో తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌ను బీజేపీ కీలకంగా భావిస్తోంది. తరచుగా ఆయా రాష్ట్రాలపై వ్యూహాలు మారుస్తూ .. రాజకీయంగా దూకుడు పెంచే విధంగా వ్యవహరిస్తోంది. తాజాగా ప్రధాన మంత్రినరేంద్ర మోడీ పశ్చిమ బెంగాల్ పై దృష్టి పెట్టా రు. ఆ రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలతో ఆయన భేటీ అయ్యారు. వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లో పార్టీ విజయ తీరాలను చేరుకునేందుకు ఇప్పటి నుంచే వ్యూహాత్మకంగా వ్యవహరించాలని ఆయన వారికి దిశానిర్దేశం చేశారు. ఏ చిన్న అవకాశాన్నీ వదులుకోవద్దని తేల్చి చెప్పారు. ముఖ్యంగా 2011లో కేవలం ముగ్గురితో మొదలైన ప్రస్థానం.. 2021 నాటికి 63కు చేరుకుంద న్నారు. ఇదే పరంపర కొనసాగాలని ప్రధాని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా బెంగాల్ అధికార పక్ష(టీఎంసీ) నేతల ట్రాప్‌లో చిక్కుకోవద్దని సూచించారు. కాగా.. ప్రస్తుతం ఈ రాష్ట్రంలో ఓటర్ల సమగ్ర రివిజన్ జరుగుతోంది. దీనికి కూడా బీజేపీ నాయకులు సహకరించా లని తెలిపారు. అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చడంతోపాటు.. రోహింగ్యా ముస్లింలు సహా.. ఇతర దేశాల నుంచి వచ్చిన చొరబాటు దార్లను జాబితాల నుంచితొలగించేలా బీజేపీ ఎంపీలు చర్యలు తీసుకోవాలని ప్రధాని ఆదేశించారు. ఓటు బ్యాంకు పెంచుకునేందుకు ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆంక్షలున్నప్పటికీ.. భారత్‌కు ఇంధన సరఫరా కొనసాగిస్తాం: పుతిన్



భారత పర్యటనలో ఉన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. అనంతరం సంయుక్త మీడియా సమావేశంలో పుతిన్ మాట్లాడుతూ.. అమెరికా లాంటి దేశాల నుంచి వాణిజ్య ఒత్తిడులు ఎదురైతున్నప్పటికీ .. భారత్‌- రష్యా మధ్య ఇంధన సరఫరా కొనసాగుతుందని స్పష్టం చేశారు. పశ్చిమ దేశాల నుంచి వస్తున్న ఒత్తిడుల కారణంగా కొంతకాలంగా చమురు దిగుమతులను భారత్ తగ్గించినప్పటికీ.. ఆ దేశాభివ ృద్ధికి సహకరించడం కోసం సరఫరాను పెంచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గతేడాది భారత్‌-రష్యా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 12 శాతం పెరిగి.. రికార్డు సృష్టించిందని రష్యా అధ్యక్షుడు అన్నారు. ఈ ఏడాది కూడా ఇదే స్థాయిలో పెరుగుదల ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణ సహకారాన్ని కూడా మరింత విస్తరిస్తామని తెలిపారు. రష్యా దృష్టి పెట్టాల్సిన కీలక సవాళ్ల గురించి మోదీ తనతో చర్చించారని.. భారత్‌- యురేషియా ఆర్థిక సంఘం మధ్య స్వేచ్ఛా వాణిజ్య మండలాన్ని సృష్టించడం వంటి వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. అంతే కాకుండా భారత్‌-రష్యా క్రమంగా చెల్లింపుల కోసం తమ జాతీయ కరెన్సీలను ఉపయోగించే దిశగా కదులుతున్నాయని.. దాదాపు 96 శాతం వాణిజ్య చెల్లింపులు జాతీయ కరెన్సీలలోనే జరుగుతున్నాయన్నారు.

**ఉగ్రవాదంపై పోరుకు కలిసి నడుస్తాం: ప్రధాని మోదీ...** మీడియా సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై పోరుకు భారత్‌-రష్యా కలిసి నడుస్తాయన్నారు. ఇటీవల పహల్గాంలో జరిగిన దాడికి, గతేడాది రష్యా రాజధాని మాస్కోలోని క్రాకస్ సిటీ కాన్సర్ట్ హాల్‌లో జరిగిన దాడికి మూల కారణం ఉగ్రవాదమేనని అన్నారు. మానవత్వ విలువలపై చేస్తున్న ఈ ప్రత్యక్ష దాడులకు వ్యతిరేకంగా ఉగ్రవాదంపై పోరుకు ఇరుదేశాలు ఏకమైనట్లు తెలిపారు.

భారత్, రష్యా, యూఎన్, జీ20, బ్రిక్స్ వేదికలు సన్నిహిత సహకారాన్ని కలిగి ఉన్నాయని.. ఈ వేదికలన్నింటిలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సహకారాన్ని కొనసాగిస్తామన్నారు.

## బీఆర్ఎస్ పాలనలో గ్రామాలన్నీ ఆర్థిక వ్యవస్థలుగా వర్ధిల్లాయి: కేసీఆర్



బీఆర్ఎస్ పాలనలో గ్రామాలన్నీ ఆర్థిక వ్యవస్థలుగా వర్ధిల్లాయని మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు అన్నారు. శుక్రవారం గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాల నూతన సర్పంచులు, వార్డు మెంబర్లను కేసీఆర్ తన ఫాం హౌస్‌కు ఆహ్వానించారు. గ్రామస్థుల మద్దతుతో ఎన్నికైన సర్పంచులను శాలువాలతో సత్కరించి వారికి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా తన వద్దకు వచ్చిన గ్రామస్థులను గుర్తుపట్టి పేరు పేరునా పలకరించి, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో వాతావరణం, మౌలిక వసతుల అందుబాటు, పండుతున్న పంటల పరిస్థితి గురించి పేరు పేరునా అడిగి తెలుసుకున్నారు.

## తెలంగాణ అభివృద్ధిలో రైజింగ్ గ్లోబల్ సమిట్ కీలకపాత్ర: సోనియాగాంధీ



హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధిలో రైజింగ్ గ్లోబల్ సమిట్ కీలక పాత్ర పోషించనుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సోనియాగాంధీ సందేశం పంపిం చారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, ప్రణాళికల్లో భాగస్వాములు కావాలనుకునే వారికి ఈ సదస్సు వేదికగా నిలుస్తుం దన్నారు. అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ వ్యవసాయాభివృద్ధి ప్రాజెక్టుల కు సమ ప్రాధాన్యం ఇచ్చేలా మూడంచెల వ్యూహంతో తెలంగాణ ముందుకు సాగుతోందని సోనియా తన సందేశంలో పేర్కొన్నారు. తెలంగాణలోని మానవ, సహజ వనరులు, ప్రజల వ్యాపార, సాంకేతిక నైపుణ్యాలు, అంతర్జాతీయ ప్రతిభ అభివృద్ధికి సమ్మిట్ మరింత తోడ్పడుతుందని పేర్కొన్నారు.

ఈ నెల 8, 9వ తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ నిర్వహించనున్నందుకు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోనియాగాంధీ అభినందనలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం చేస్తున్న కృషి విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. సదస్సులో పాల్గొనున్న వారందరికి శుభాకాంక్షలు తెలిపారు.



# తెలంగాణ అభివృద్ధి కోసం ఎవరితోనైనా కొట్లాడుతా..

# ఢిల్లీనైనా ఢీ కొడుతా!

## ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్

నర్సంపేట : తెలంగాణ అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా. ఎవరితోనైనా కొట్లాడుతా.. ఢిల్లీనైనా ఢీ కొడుతా! నిధులు తీసుకొస్తా. అడగాడనికి వెనుకాడను. రాకపోతే కొట్లాడటానికి అసలే భయపడను. రాష్ట్రానికి కావలసిన నిధులు, రావలసిన అనుమతుల కోసం ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రుల వద్దకు వెళ్లి అడగడం ముఖ్యమంత్రిగా నా బాధ్యత. ఒకటికి వంద సార్లు తిరుగుతా. నాకు ఓపిక ఉంది. వయసుంది. విషయాన్ని వివరించే కనీస పరిజ్ఞానం నాకుంది. మీ ఆశీర్వాదం ఇలాగే ఉండాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి అన్నారు. కాకతీయ కాలం నుంచి ప్రపంచానికి పోరాట పంథాను చాటిచెప్పిన వరంగల్ గడ్డ, సమ్మక్క - సారలమ్మ, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, కృష్ణమాచార్యులు, కాళోజీ నారాయణ రావు, పీవీ నర్సింహరావు నుంచి తెలంగాణ మలిదశ ఉద్యమానికి నాయకత్వం వహించిన ప్రొ జయశంకర్ ప్రజా ప్రభుత్వానికి స్ఫూర్తిగా నిలుస్తారు. వారి స్ఫూర్తిగానే ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలు కార్యక్రమాల్లో భాగంగా వరంగల్ జిల్లా నర్సంపేటలో రూ. 532.24 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. "నిరుపేదలు, దళిత, గిరిజన, ఆదివాసీ, మైనారిటీ పిల్లలు చదువుకుంటేనే భవిష్యత్తు ఉంటుంది. అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన చదువులు అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. తాతముత్తాల కాలం పది తరాలుగా వృత్తులు చేసుకుంటూ వచ్చినా బతుకులు మారలేదు. చదువొక్కటే మన బతుకుల్లో మార్పు తీసుకొస్తుంది. నిలబెడుతుంది. ప్రపంచంతో పోటీ పడేలా చేస్తుంది. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అనేక సామాజిక అంశాలను పరిగణలోకి తీసుకుని.. ఒకవైపు రైతులు, మరోవైపు మహిళలు, ఇంకోవైపు యువత కోసం కార్యక్రమాలు చేపట్టింది. యువత కోసం ఉద్యోగ నియాకాలు చేపట్టాం. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది లోపే 61 వేల ఉద్యోగాలిచ్చాం. ఇంకా 40 వేల ఉద్యోగాలిచ్చే ప్రక్రియ మొదలవుతుంది. అభివృద్ధి పథంలో సాగాలంటే ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యునికేషన్ అత్యంత కీలకమని, ఆయా రంగాల్లో లక్ష్యాలను సాధించడానికి ఈ నెల 8, 9, తేదీల్లో ప్రపంచ స్థాయిలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నాం. హైదరాబాద్‌తో సమంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలి. పక్క రాష్ట్రాల్లో నాలుగైదు విమానాశ్రయాలుంటే, తెలంగాణలో ఒక్కటి మాత్రమే ఉంది. పదేండ్లలో వీటి గురించి పట్టించుకోలేదు. కనీసం రోడ్లు వేయలేదు. డిసెంబర్ ఆఖరునాటికి భూ సేకరణ పూర్తి చేసి మార్చి 31 లోపు వరంగల్ విమానాశ్రయ పనులు ప్రారంభిస్తాం. హైదరాబాద్ తరహాలోనే వరంగల్‌కు ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎయిర్ పోర్టు పూర్తి చేస్తాం. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన సమ్మక్క - సారలమ్మ మందిరం అద్భుతంగా నిర్మాణవుతోందని, అదే తరహాలో వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం. తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం.. రాష్ట్రంలో ప్రతి మారుమూల తండాకు రోడ్డు కనెక్టివిటీ ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్రంలో ఏ గ్రామానికీ రోడ్డు లేదన్న మాట వినదలచుకోలేదని అన్నారు. రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో 20 వేల కోట్లు వెచ్చించి రోడ్లు నిర్మిస్తున్నాం.

ప్రతి గూడెం నుంచి మండల కేంద్రానికి, ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు వరుసలు, జిల్లా కేంద్రం నుంచి రాజధానికి నాలుగు వరుసల రోడ్లు వేస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో మహిళాభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాం. ఉచిత బస్సు సౌకర్యం, సంఘాలకు వడ్డీ లేని రుణాలు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఉత్పత్తుల విక్రయానికి శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్, బస్సులకు యజమాను లుగా.. ఇలా అనేక పథకాలు అమలు చేస్తున్నాం. ఇంటి ఆడబిడ్డకు చీరె పెట్టడం ఒక సంప్రదాయం. ఇంట్లో సొంత సోదరుడి తరహాలో ప్రతి ఏటా సారె పండుగ చేసుకోవాలని గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది ఆడబిడ్డలకు చీర అందిస్తున్నాం. రాష్ట్రంలో 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఆడబిడ్డకు చీరె చేరాలి. రాష్ట్రంలో ఏ ఒక్క ఆడబిడ్డ కూడా నాకు చీర రాలేదని అనొద్దు. గ్రామీణ ప్రాంతాల్లో పూర్తయ్యాక, మార్చిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణ, మున్సిపాలిటీల్లో చీరె అందజేస్తాం. ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తోంది. రాష్ట్రంలో 1.10 కోట్ల రేషన్ కార్డులు ఉండగా, 3.10 కోట్ల మంది బిడ్డలకు సన్నబియ్యం ఇస్తున్నాం. ప్రభుత్వంపై 13 వేల కోట్ల రూపాయల భారం అవుతున్నా పేదవారి ఆకలి తీర్చాలని, వారు కడుపునిండా భోజనం చేయాలని సన్నబియ్యం ఇస్తున్నాం. పేదవారి ఆత్మగౌరవం పెరగాలన్న లక్ష్యంతో వారికి ఇందిరమ్మ ఇండ్లు ఉండాలని, ఆర్థికంగా భారమైనప్పటికీ ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల పనులు మొదలయ్యాయి..." అని సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.




# ఇందిరమ్మ ఇళ్లపై కీలక నిర్ణయం..!

హైదరాబాద్ : రాష్ట్రంలో మూడు లక్షల ఇందిరమ్మ ఇళు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. త్వరలో లక్ష ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధం అవుతాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మూడు లక్షల ఇళ్లకు గృహప్రవేశం పూర్తి అవుతుందని వివరించారు. వచ్చే ఏప్రిల్ నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం అవుతుందని చెప్పుకొచ్చారు. ఇవాళ(శుక్రవారం) తెలంగాణ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

**ప్రణాళికలు చేస్తున్నాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి...** కోర్ అర్బన్ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం కూడా ప్రణాళిక సిద్ధమైందని వెల్లడించారు. గ్రౌండ్ ప్లస్ ఫోర్ బిల్డింగ్ నిర్మించి పేదలకు ఇచ్చే ప్రణాళికలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. త్వరలో అర్బన్ ప్రణాళిక ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఓ ఆర్ ఆర్‌కు ఆనుకుని నలువైపులా ఉన్న స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఒక్కో చోట 10వేల ఇళు నిర్మించి నో ప్రాఫిట్, నో లాస్ కింద మధ్యతరగతి ప్రజలకు ఇస్తామని వివరించారు. గ్లోబల్ సమ్మిట్‌లో ప్రణాళికలు ప్రకటిస్తామని పేర్కొన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

**కేసీఆర్ ప్రభుత్వంలో హౌసింగ్ శాఖ నిర్వీర్యం..** గత కేసీఆర్ ప్రభుత్వం హౌసింగ్ శాఖను నిర్వీర్యం చేసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ శాఖను తిరిగి తాము బలోపేతం చేశామని వివరించారు. గతంలో నిర్మించి మధ్యలో వదిలేసిన ఇళ్లకు కూడా ఇందిరమ్మ పథకం వర్తింపజేయాలని తాము ఆలోచిస్తున్నామని చెప్పుకొచ్చారు.

రూరల్‌లో, అర్బన్‌లో ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు కూడా త్వరలో శుభవార్త చెబుతామని పేర్కొన్నారు. ఒక విడతలోనే ఇళ్లు ఇచ్చి తాము చేతులు దులుపుకోమని చెప్పుకొచ్చారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

**కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారు..** హిల్ట్‌పాలసీపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. హిల్ట్ పాలసీపై కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ అధికారంలోకి వస్తే హిల్ట్ పాలసీ రద్దు చేస్తామని అంటున్నారని... నోటికొచ్చినట్లుగా కేటీఆర్ మాట్లాడటం సరికాదని హితవు పలికారు. బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ అని.. వారి హయాంలో ఇష్టం వచ్చినట్లుగా చేశారని ఫైర్ అయ్యారు. తమ ప్రభుత్వం చాలా వినూత్న నిర్ణయాలు తీసుకుంటుందని.. కేసీఆర్ హయాంలో లాగా తాము చేయమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.




హైదరాబాద్: ఎన్నికల్లో ఫైట్ చేయడం, గెలవడం తన రక్తంలోనే ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని హిమాయత్‌నగర్, నారాయణగూడలో రూ. 1.40కోట్లతో చేపట్టనున్న డ్రైనేజీ, రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అనర్హత వేటు అంశంపై దానం స్పందించారు. “రాజీనామా ప్రస్తావన ఇంకా రాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. నాకు ఎన్నికలు కొత్త కాదు.. ఇప్పటికి 11 సార్లు కొట్లాడిన చరిత్ర ఉంది. అనర్హత అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. నా వాదనలు వినిపిస్తాను. రేవంత్‌రెడ్డి మరో పదేళ్లు సీఎంగా కొనసాగితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుంది. రైజింగ్ తెలంగాణ కోసం తలపెట్టిన గ్లోబల్ సమ్మిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తుంది” అని దానం నాగేందర్ అన్నారు.



# శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

హైదరాబాద్: ఇండిగో విమానాల రాకపోకలను నిలిపేయడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం 92 విమానాలు రద్దు చేసినట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఇందులో శంషాబాద్‌కు రావాల్సినవి 43, ఇక్కడి నుంచి వెళ్లాల్సినవి 49 ఉన్నాయి. ముందుగా బుక్ చేసుకున్న సర్వీసుల రద్దుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్‌ఇన్ అయిన తర్వాత రద్దు సమాచారం ఇవ్వడంపై నిరసన తెలిపారు. మరోవైపు విశాఖ నుంచి 8 ఇండిగో విమాన సర్వీసులు రద్దు చేశారు. వీటిలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్‌కు వెళ్లాల్సినవి ఉన్నాయి.

**ఏపీ మంత్రి పార్థసారథి జోక్యంతో అయ్యప్ప భక్తులకు ప్రత్యేక విమానం...** ఏపీ మంత్రి పార్థసారథి జోక్యంతో శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేక విమాన సదుపాయాన్ని కల్పించారు. అంతకుముందు విజయవాడ వెళ్లేందుకు శంషాబాద్‌లో ఇండిగో విమానం కోసం పార్థసారథి వేచి ఉన్నారు. అయ్యప్ప భక్తులు ప్రయాణించే విమానం ఆలస్యంపై అడిగి తెలుసుకున్నారు. వారి ఆందోళనను గమనించి స్వయంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌తో మాట్లాడారు. శబరిమలకు విమాన సర్వీసు ఏర్పాటు చేయించారు. విజయవాడకు వెళ్లాల్సిన విమానం మిస్ కావడంతో మంత్రి పార్థసారథి రోడ్డు మార్గంలో బయలుదేరారు. తమకోసం శ్రమపడి ప్రయాణ సదుపాయం కల్పించిన ఆయనకు అయ్యప్ప భక్తులు ధన్యవాదాలు తెలిపారు.




కంటోన్మెంట్: నగరంలోని శామీర్‌పేటలో కారులో భారీగా హవాలా నగదు లభ్యమైంది. టైర్లు, సీట్ల కింద రూ.4 కోట్ల నగదును పోలీసులు గుర్తించారు. హవాలా మార్గంలో తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బోయిన్‌పల్లి క్రైమ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. హవాలా డబ్బు కేసులో 2024లో ఓ వ్యక్తి పరారయ్యాడు. ఇవాళ ఆ వ్యక్తి భారీ మొత్తంలో నగదుతో నిజామాబాద్ నుంచి వస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో తనిఖీలు నిర్వహించిన పోలీసులు శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకొని, డబ్బును స్వాధీనం చేసుకున్నారు.

# హిల్ట్ పాలసీ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు




హైదరాబాద్, డిసెంబరు5 : హిల్ట్ పాలసీపై తెలంగాణ హైకోర్టులో ఇవాళ(శుక్రవారం) విచారణ జరిగింది. హిల్ట్ పాలసీపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పిటిషన్లు దాఖలు చేశారు. 9,292 ఎకరాల భూ కేటాయింపుల విషయంలో రూపొందించిన జీఓ నిబంధనలకు విరుద్ధంగా ఉందని తెలిపారు.

దీనిపై సీబీఐ లేదా ఈడీ దర్యాప్తు చేయించాలని పిటిషనర్ సూచించారు. ఈ విషయంపై సీబీఐ లేదా ఈడీతో దర్యాప్తు చేయించాలని సూచించారు. ఇప్పటివరకు ఉన్న రికార్డులను సీజ్ చేసి ఫోరెన్సిక్ ఆడిట్ చేయించాలని కోరారు.

ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది హైకోర్టు. వెంటనే రిప్లై ఫైల్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 29వ తేదీకు వాయిదా వేసింది హై కోర్టు.

# హైకోర్టుకు హాజరై క్షమాపణ చెప్పిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్: హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలంగాణ హైకోర్టుకు హాజరై క్షమాపణ చెప్పారు. బతుకమ్మకుంట కేసు విచారణలో భాగంగా ఆయన హాజరయ్యారు. ఈ కేసులో హైడ్రాపై ఎ.సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈక్రమంలో న్యాయస్థానం ఆదేశాలతో రంగనాథ్ కోర్టుకు వచ్చారు.

**అసలేం జరిగిందంటే..** హైదరాబాద్ బతుకమ్మకుంట పరిధిలోని ప్రైవేటు స్థలానికి సంబంధించి యథాతథస్థితిని కొనసాగించాలని జూన్ 12న ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలంటూ ఎ.సుధాకర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అక్టోబరు 31న విచారించిన హైకోర్టు.. కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో నవంబరు 27న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలంటూ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయితే బాచుపల్లిలో అత్యవసర పనులు ఉన్నందున హాజరుకాలేకపోతున్నానని.. మినహాయింపు కోరుతూ రంగనాథ్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ బి.ఆర్.మధుసూదన్‌రావులతో కూడిన ధర్మాసనం నవంబర్ 27న విచారణ చేపట్టింది.

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది స్వరూప్ ఊరిళ్ల వాదనలు వినిపిస్తూ తప్పనిసరి అధికారిక విధులతోపాటు, తన హాజరుతో కోర్టును ఇబ్బంది పెట్టరాదన్న కారణంగా మినహాయింపు కోరుతున్నారనగా ధర్మాసనం తీవ్రంగా స్పందిస్తూ ఆయన కోర్టు పట్ల చూపిన దయకు అభినందనలు తెలియజేస్తున్నామని వ్యాఖ్యానించింది. కోర్టు తలచుకుంటే ధిక్కరణను ఎదుర్కొంటున్న కమిషనర్‌ను ఉదయం నుంచి సాయంత్రం వరకు కోర్టులో నిలబెట్టగలదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించింది. హాజరు మినహాయింపునకు నిరాకరిస్తూ కమిషనర్ దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేసింది. ఈక్రమంలో శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా హైకోర్టు ఎదుట హాజరై క్షమాపణలు చెప్పారు.



# హిడ్మా ఎన్‌కౌంటర్‌కు దేవ్‌జీ కారణం కాదు: మావోయిస్టులు

చర్ల: దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మీడియా ప్రతినిధి వికల్ప్ పేరిట మావోయిస్టులు మరో లేఖ విడుదల చేశారు. నవంబర్ 27 నాటి లేఖ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చికిత్స కోసం ఓ కలప వ్యాపారి ద్వారా హిడ్మా విజయవాడ వెళ్లారని వికల్ప్ అందులో పేర్కొన్నారు. నిరాయుధుడైన హిడ్మా సహా ఆరుగురిని పోలీసులు హత్య చేశారని ఆరోపించారు. ఎన్‌కౌంటర్‌లో హిడ్మా చనిపోయాడని కట్టుకథ ప్రచారం చేశారన్నారు. ఆయన హత్యకు కలప వ్యాపారి, బిల్డర్, ఐటీడీఏ కాంట్రాక్టరే కారణమని పేర్కొన్నారు.

హిడ్మా, శంకర్ ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మనీశ్ కుంజాం, సోని చేసిన తప్పుడు ఆరోపణలను ఖండించారు. “అరెస్టైన వారిలో కామ్రేడ్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి లేరు. పోలీసులతో వారిద్దరూ ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోలేదు. హిడ్మా ఎన్‌కౌంటర్‌కు దేవ్‌జీ కారణమని మాజీ ఎమ్మెల్యే మనీశ్ కుంజా ఆరోపించడం కుట్రే. విజయవాడలో అరెస్టైన కామ్రేడ్లకు న్యాయ సహాయం అందించాలి. ప్రజాపక్ష న్యాయవాదులు, హక్కుల కార్యకర్తలు వారికి సహాయం చేయాలి” అని లేఖలో వికల్ప్ కోరారు.



# పవన్‌పై అప్పటి పరిస్థితుల మేరకు వ్యాఖ్యలు చేశా

ఉండవల్లి: చంద్రబాబు విజన్‌కి తగ్గట్టు అమరావతి ఫ్యూచరిస్టిక్ క్యాపిటల్‌గా అభివృద్ధి చెందుతోందని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించేందుకు ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. “పవన్ కల్యాణ్‌పై అప్పటి పరిస్థితుల మేరకు వ్యాఖ్యలు చేశా.. ఇప్పుడు చంద్రబాబును ఆహ్వానించడానికి వచ్చా. రెండు రాష్ట్రాలు కలిసి ఉండాలి.. అదే స్నేహం కొనసాగాలి. చంద్రబాబు విజన్ 2020 అభివృద్ధికి ప్రతిరూపం హైదరాబాద్” అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.

# ఐబొమ్మ రవికి బిగ్ షాక్.. మరోసారి కస్టడీకి కోర్టు అనుమతి

హైదరాబాద్, డిసెంబరు5 : ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి కేసుపై నాంపల్లి కోర్టులో ఇవాళ(శుక్రవారం) విచారణ జరిగింది. నిందితుడు రవిని మూడోసారి కస్టడీకి అనుమతి ఇవ్వాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే మరో నాలుగు కేసుల్లో కస్టడీ కోరుతూ పోలీసులు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. మూడు కేసుల్లో మూడు రోజుల పాటు కస్టడీకి అనుమతించింది నాంపల్లి కోర్టు. ఒక్కో కేసుకు ఒక్కో రోజు కస్టడీ అనుమతి ఇచ్చింది న్యాయస్థానం. అయితే, నాలుగు కేసుల్లో ఒక కేసు కస్టడీ తిరస్కరణకు గురైంది. పోలీసుల వాదనలతో ఏకీభవించి ఐబొమ్మ రవిని కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఇప్పటికే రెండుసార్లు ఆయనను కస్టడీకి తీసుకొని విచారించారు సైబర్ క్రైమ్ పోలీసులు. మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇచ్చింది నాంపల్లి కోర్టు. ఈ క్రమంలోనే శనివారం, సోమవారం, మంగళవారం ఐబొమ్మ రవిని కస్టడీ విచారణ చేయనున్నారు పోలీసులు. ఈ నేపథ్యంలోనే రవి బెయిల్‌పై సోమవారం వాదనలను మరోసారి విననుంది నాంపల్లి కోర్టు.




# గుడ్ న్యూస్ చెప్పిన ఆర్‌బీఐ.. వడ్డీ రేట్లపై మరో 0.25 శాతం కోత


ముంబయి: ఈ ఏడాది ఇప్పటికే వడ్డీ రేట్లపై ట్రిపుల్ బొనాంజా ప్రకటించిన ఆర్‌బీఐ.. మరోసారి గుడ్‌న్యూస్ చెప్పింది. కీలక వడ్డీరేట్లను మరో 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. దీంతో రెపో రేటు 5.25 శాతానికి దిగొచ్చింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. రూపాయి పతనం కొనసాగుతున్నప్పటికీ ద్రవ్యోల్బణం కనిష్ఠ స్థాయికి పడిపోవడం, వృద్ధి రేటు పెరగడంతో రేట్ల కోత చేపట్టినట్లు మల్హోత్రా వెల్లడించారు. వడ్డీ రేట్లను తగ్గించడంతో గృహ, వాహన రుణ గ్రహీతలకు మరికొంత ఉపశమనం లభించినట్లయ్యింది. కాగా.. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ఏడాదిలో ఇప్పటివరకు రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది.

**ఆర్‌బీఐ గవర్నర్ ప్రసంగంలో కీలక అంశాలివే..** జీఎస్టీ హేతుబద్ధీకరణతో కొనుగోళ్లు పెరగడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 8.2శాతం వృద్ధి నమోదైంది. దీంతో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గానూ వృద్ధి రేటు అంచనాలను 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచుతున్నాం. ద్రవ్యోల్బణం కూడా తగ్గుముఖం పట్టింది. అందువల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాలను 2.6శాతం నుంచి 2 శాతానికి తగ్గిస్తున్నాం. రూ.1 లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీస్‌ల విక్రయాల కోసం ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్‌ను నిర్వహించాలని నిర్ణయించాం.

విదేశీ మారక నిల్వలు 686 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఇవి ఉపయోగపడతాయి.

# తెలంగాణ ఆర్థర్ కాటన్ అలీ నవాజ్ జంగ్ బహదూర్

## తెలంగాణ నీటిపారుదల పితామహుడు అలీ నవాజ్ జంగ్ బహదూర్ - డిసెంబర్ 6... అలీ నవాజ్ జంగ్ వర్ధంతి




తెలంగాణ ఆర్థర్ కాటన్‌గా, తెలంగాణ నీటిపారుదల పితామహుడిగానూ, అభివర్ణించ బడిన నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ తెలంగాణ గర్వించదగిన హైదరాబాదుకు చెందిన గొప్ప ఇంజనీరు. ఆయన 1877, జూలై 11న హైదరాబాదు లోని ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1949 డిసెంబరు 6న హైదరాబాదులో మరణించారు. సెయింట్ జాన్ గ్రామర్ స్కూల్, నైజాం కళాశాలల్లో చదువు కున్నారు. మంచి మార్కులతో చదువులో ప్రతిభ కనబరిచారు. పలు ఉపకార వేతనాలను పొందారు. ఆయన ప్రతిభను గుర్తించిన ఆరో నిజాం ఆయనను చదువుకోవడం లండన్ పంపారు. ఆయన ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని తిరిగి వచ్చారు. నిజాం సంస్థానంలో పబ్లిక్ వర్క్స్ శాఖలో ఉద్యోగంలో చేరారు. చీఫ్ ఇంజినరింగ్ సెక్రెటరీ స్థాయికి చేరుకున్నారు. నిజాం ప్రభువు ప్రోత్సాహంతో తన హయంలో ఎన్నో ఇంజనీరింగ్ నిర్మాణాలు చేపట్టారు. ప్రతి పనినీ గమనిస్తూ దగ్గరుండి నిర్మాణాలను త్వరితగతిన పూర్తయ్యేలా చేశారు. ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల, ఉస్మానియా ఆసుపత్రి, యునానీ దవాఖాతా నిర్మాణంలో ఆయన ఇంజనీరింగ్ ప్రతిభ బహిర్గతం అవుతుంది. నాటి హైదరాబాద్ రాజ్యంలో అనేక నీటిపారుదల ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, నిర్మింప చేశారు. తెలంగాణ ప్రాంతంలో గోదావరి, మంజీరా నదులపై పలు సాగునీటి ప్రాజెక్టులు, డ్యాములు, హైదరాబాద్, చారిత్రక కట్టణం నిర్మాణాలను ఆయనే డిజైన్ చేశారని చరిత్రకారులు చెపుతారు. ప్రభుత్వాలపై భారం పడకుండా దీర్ఘకాలం రైతులకు ప్రజలకు ఉపయోగకరంగా తక్కువ ఖర్చు, నాణ్యతతో కూడిన సాగునీటి ప్రాజెక్టులు నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ నిర్మించారు. తెలంగాణ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ గౌరవార్థం తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా 2014, జూలై 10న జి.ఓ. నంబరు 18 జారీచేసి, అలీ నవాజ్ జంగ్ బహదూర్ జన్మదినాన్ని తెలంగాణ ఇంజనీర్ల దినోత్సవంగా ప్రకటించి ప్రతి సంవత్సరం అధికారికంగా ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఏడాదికి లక్షల మంది ఇంజనీర్లు తయారవు తున్నారు. ఆయా విభాగాల్లో శిక్షణ ఇవ్వడానికి పలు యూనివర్సిటీలు సేవలు అందిస్తున్నాయి. తల్లి దండ్రులు తమ పిల్లలు... వైద్యుడు, ఇంజనీరు కావాలని ఆకాంక్షిస్తున్నారు. ఇంతటి ప్రాచుర్యం కలిగిన ఈ విద్య కోసం పోటీ పడి చదువు తున్నారు. ఇంజనీరింగ్ సీట్ల కోసం విద్యార్థులు అహో రాత్రులు కష్టపడు తున్నారు. ఇంజనీరింగ్ విద్య పూర్తికాక ముందే నేడు స్వ, విదేశీ కంపెనీల క్యాంపస్ ఎంపికల పేరుతో ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నారు. వేల నుంచి లక్షల వరకు వేతనాల చెల్లిస్తున్నారు. గతంలో ఎంతో ఆదరణ చూరగొన్న సివిల్ ఇంజనీరింగ్ ప్రభుత్వ రంగంలో అవినీతిలో కూరుకు పోయిందనే ఆరోపణలున్నాయి. ఇదే ప్రయివేటు సెక్టార్‌లో ప్రతిభతో కూడిన కాసుల గల గలల కొలమానంగా మారింది. ప్రభుత్వ ఆధీనంలో అభివృద్ధిలో భాగంగా వేసిన రోడ్లు, కట్టిన భవనాలు, నిర్మించిన చెరువులు, ప్రాజెక్టులు, వేసిన పైపులైన్లు కూలి పోవడం, తెగి పోవడం, పగిలి పోవడం గమనిస్తూనే ఉన్నాం. కారణాలు ఏమైనప్పటికీ నాణ్యతకు ప్రతిభ తోడు కాక పోవడమే అని నిపుణులు అంటున్నారు. నాణ్యతకు రాజకీయం, అవినీతి అడ్డుగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇంజనీరింగ్ రంగంలో రాణించి, తెలంగాణ ఆర్థర్ కాటన్‌గా, తెలంగాణ నీటిపారుదల పితామహుడిగా పేరెన్నిక గన్న నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ పుట్టిన రోజున జరుపుకునే తెలంగాణ ఇంజనీర్స్ డే సందర్భంగా సృజనాత్మకమైన వృత్తి నైపుణ్యాలతో పరిమితమైన వనరుల తోనే నాణ్యమైన పనులు నిర్వహించి మోక్ష గుండం విశ్వేశ్వరయ్య, సర్ ఆర్థర్ కాటన్, నవాజ్ జంగ్ బహదూర్ వలే ప్రజల మదిలో చిరకాలం నిలిచి పోయేందుకు ప్రతీ ఇంజనీర్ కృషి చేయాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పలు ప్రత్యేకతల సమాహారం “గైడ్” చిత్రరాజం

## డిసెంబరు 6న... 60 ఏళ్ళ క్రితం విడుదలైన సినిమా




హిందీ చలన చిత్ర రంగంలో తనదయిన ముద్ర వేసుకున్న అలనాటి మేటి చిత్ర రాజం గైడ్. ప్రఖ్యాత ఆంగ్ల భారత రచయిత మాల్గుడి డేస్ సృష్టి కర్త అర్. కె. నారాయణ్ అద్భుత రచన గైడ్. ఈ చిత్రం పలు విశేషాల సమాహారం. అయితే ...దేవానంద్ నటించిన “హం దొనో”, చిత్రం 1962 బెర్లిన్ చలన చిత్రోత్సవానికి, భారత దేశ అధికారిక చిత్రంగా ఎంపికకాగా, బెర్లిన్లో దేవానంద్ అమెరికా దర్శకుడు టాడ్ డేనియల్ ను కలిసే అవకాశం కలగడం, టాడ్, పెర్ల్ ఎస్ బక్ ఆహ్వానం పై అమెరికా వెళ్లి వారితో ఒప్పందం కుదుర్చుకుని, గైడ్ చిత్రంలో నటించటానికి అంగీకరించడం యాదృచ్ఛికంగా జరిగాయి. గైడ్ చిత్రానికి ఆంగ్ల చిత్రానికి టాడ్ చిత్రానువాదం నోబెల్ సాహిత్య బహుమతి గ్రహీత పెర్ల్ ఎస్ బక్ చేశాడు. స్ట్రాట్టన్ ఇంటర్నేషనల్ పతాకం కింద, టాడ్ డేనియల్ నిర్మాత, దర్శకత్వ బాధ్యతలు నిర్వహించాడు. ఒకే సారి ఆంగ్ల, హిందీ చిత్రాల చిత్రీకరణ సాంకేతిక కారణాలవలన సాధ్యం కాకపోవటంతో, తొలుత ఆంగ్ల చిత్రాన్ని చిత్రీకరించారు. ఈ కారణంగా హిందీ చిత్రం ఆలస్యం వలన అప్పటి దాక దర్శకత్వం వహించిన చేతన్ ఆనంద్, తన సొంత చిత్రం హకీకత్ నిర్వహణ బాధ్యతను నిర్వహించటానికై, గైడ్ దర్శకత్వ బాధ్యత నుంచి తప్పుకున్నాడు. విజయ ఆనంద్ గైడ్ దర్శకత్వం స్వీకరించాడు. తొలుత ఆంగ్ల చిత్రాన్ని చిత్రీకరించారు. అది విడుదల కాగా, చిత్రానువాదం ఆశించిన స్థాయిలో లేక, ఆంగ్ల ప్రేక్షకులను చిత్రం ఆకట్టుకో వడంలో విఫలమయింది. చిత్రంలో నాయకుడు ఒక వివాహితతో అక్రమ సంబంధం ఏర్పరచుకొని, ఆమెను మోసం చేసి జైల్ కు వెళ్తాడు. చివరకు ఒక సాధువుగా మారి, ఎడారిలో నిరాహార దీక్ష చేసి మరణిస్తాడు. ఎప్పుడూ అందంగా కనిపించే దేవ్ చిత్రంలో అందవిహీనంగా కనిపించటాన్ని విమర్శలకు హేతు వైంది. నాయకుడు వివాహేతర సంబంధం పెట్టుకోవడం భారతీయ చిత్రాలకు అనుగుణంగా ఉండ లేక పోయింది. చిత్రం కొనటానికి పంపిణీదారులెవరూ ముందుకు రాలేదు. హిందీలో ఆనంద్ గైడ్ దర్శకత్వ బాధ్యత స్వీకరించి, ఆంగ్ల చిత్రానువాదం కాకుండా, భారతీయ ప్రేక్షకులకు నచ్చే విధంగా కొత్త చిత్రానువాదం తయారు చేశాడు. గైడ్ చిత్రాన్ని హిందీలో తీద్దామని అనుకుని వహీదా రెహమాన్ ను నాయికగా ఉండాలని ముందు సత్యజిత్ రే, అనంతరం దేవానంద్ కోరారట. అయితే చిత్రం చిత్రీకరణ హక్కులను దేవానంద్ రచయిత ఆర్కె నారాయణ్ నుంచి ముందు పొందారు. అలా దేవానంద్, వహీదా కాంబినేషన్లో రూపు దిద్దుకున్న చిత్రం బాక్స్ ఆఫీస్ వద్ద విజయ దుందుభి మోగించింది. ఊహించని డబ్బును సమ కూర్చింది. మనసును పూర్తిగా లగ్నం చేసి దర్శకత్వం వహించిన విజయ్ ఆనంద్ కృషి సఫలీకృతం కాగలిగింది. అచ్చంగా దేవానంద్, వహీదా రెహమాన్ ల నట జీవితంలో గైడ్ ఒక అణి ముత్యమే అయింది. విజయానంద్ సందర్భోచిత చిత్రానువాదం, దర్శకత్వం, కథలో వైవిధ్యం, ఎస్.డి.బర్మన్ సంగీతం, వహీద నృత్యాలు, దేవానంద్ నటనా కౌశల్యం ప్రేక్షకుల మనో ఫల కాలపై చెరగని ముద్ర వేశాయి. ప్రేక్షకుల అనూహ్య ఆదరణ ద్వారా చిత్రం అనుకోని విధంగా కలెక్షన్లు సాధించింది. సంగీత దర్శకత్వం మినహా, మిగతా అన్ని శాఖలలోను ఫిల్మ్ ఫేర్ ఉత్తమ బహుమతులను 7 శాఖలలో గెల్చుకొని, అపూర్వ కళాఖండ చిత్రరాజమై నిలచింది. విదేశీ చిత్రాల కోవలో, ఆస్కార్ చిత్రోత్సవానికి భారత దేశ అధికార చిత్రంగా ఎంపికయ్యింది. టైమ్ మ్యాగజైన్ దాని ఉత్తమ బాలీవుడ్ క్లాసిక్స్ జాబితాలో 4 స్థానంలో ఉంది. విడుదలయిన 42 ఏళ్ల తర్వాత, 2007 లో కేన్స్ చిత్రోత్సవంలో ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సుదీర్ఘ సమయానంతరం దూరదర్శన్ లో ఈ చిత్రం ప్రదర్శిత మైనపుడు చాలా మంది ఇళ్లలో టీవీలకే అంకితం అయినారంటే ఎంత గొప్పగా తీసారో స్పష్టం అవుతుంది.

“ఆజ్ ఫిర్ జీన్ కి తమన్నా హై”
‘దిన్ ధల్ జాయే”, “గాతా రహే మేరా దిల్”
“క్యా సే క్యా హెూ గయా”, “పియా తోస్ నైనా లాగే రే”
“తేరే మేరే సాప్నే”, “వహన్ కౌన్ హై తేరా”,
“హి రామ్ హమారే రామ్‌చంద్ర”
“అల్లాహ్ మేఘ్ దే పానీ దే” అన్ని పాటలూ ఆణిముత్యాలే.

1965 డిసెంబర్ 6 న సినిమా విడుదల కాగా, అంతకు ముందు ఢిల్లిలో ఈ చిత్రం ప్రివ్యూ ప్రదర్శనకు , ప్రధాన మంత్రి మినహాయించి భారత ప్రభుత్వ మంత్రులంతా చిత్రాన్ని ఆసాంతం, ఆసక్తిగా చూశారు. డిస్ట్రిబ్యూటర్లు ఆసక్తి చూపక పోయినా, గైడ్ చిత్రం గురించి ముందే జరిగిన విస్తృత ప్రచారం వల్ల ప్రేక్షకులు మళ్ళీ మళ్ళీ చూసి కలెక్షన్లు సాధించేలా చేశారు.. అయినా గైడ్ చిత్రం విడుదల అయ్యాక రచయిత ఆర్కె నారాయణ్ చూసి అసంతృప్తి వ్యక్తం చేయడం కొస మెరుపు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ఓవర్సీస్ మొబిలిటీ బిల్: ప్రవాసీల హక్కులు కాపాడాలి



ప్రవాసీ భారతీయుల హక్కులు, భద్రత, సంక్షేమం వంటి అత్యంత కీలకమైన అంశాలను ప్రభావితం చేసే ఓవర్సీస్ మొబిలిటీ (విదేశీ వలస) బిల్%-%2025 రూపకల్పన దశలో ఉన్న పరిస్థితుల్లో, ప్రవాసుల స్వరాన్ని నిజంగా ప్రతిబింబించేలా ఈ చట్టం ఉండాలని తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యుడు చెన్నమనేని శ్రీనివాసరావుతో కూడిన ప్రతినిధి బృందం ఢిల్లీలో గురువారం తెలంగాణకు చెందిన ఏడుగురు పార్లమెంటు సభ్యులను కలిసి వినతిపత్రాలు సమర్పించింది. నాలుగు దశాబ్దాలుగా అమలులో ఉన్న ఎమిగ్రేషన్ యాక్ట్%-%1983 స్థానంలో కేంద్ర ప్రభుత్వం సమగ్ర మార్పులు ప్రతిపాదిస్తున్న సందర్భంలో, విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్లే లక్షలాది మంది వలస కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగు పడేలా, వారి హక్కులు రక్షితంగా ఉండేలా బిల్లు వుండాలని ప్రతినిధులు స్పష్టం చేశారు. భారతీయ వలస కార్మికులు విదేశాల్లో గౌరవంగా, భద్రతతో, శ్రమ విలువ కనుగుణంగా జీవించే అవకాశాలను ప్రభుత్వం మరింత బలోపేతం చేయాలని కోరారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, బీజేపీ ఎంపీ డీకే అరుణ, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కెఆర్ సురేష్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, సురేష్ షెట్కార్, డా. కడియం కావ్య, గడ్డం వంశీక్రిష్ణ, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీ మధు యాష్కీ లతో జరిగిన చర్చల్లో బిల్లు రూపకల్పనలో తొలగింప బడిన అనేక రక్షణా నిబంధనలను వారు స్పష్టంగా ప్రస్తావించారు. 2021 ముసాయిదాలో ఉన్న అనేక హామీలు, రక్షణలు ప్రస్తుత ప్రతిపాదనలో లేవని, అధికారం కేంద్రీకృతమయ్యే విధానం వలస కార్మికులపై దోపిడీ ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉందని భీంరెడ్డి, శ్రీనివాసరావులు వివరించారు. వలస కార్మికులు నేరుగా కోర్టులను ఆశ్రయించే హక్కు తొలగించడం, మహిళలు%-%పిల్లల రక్షణలకు ప్రత్యేక నిబంధనలను ‘సున్నిత వర్గాలు’ అంటూ అస్పష్టమైన శీర్షికలో విలీనం చేయడం, రిక్రూట్మెంట్ ఏజెన్సీలు వసూలు చేసే ఫీజుల వివరాలను వెల్లడించే నిబంధన తొలగించడంతో రుణబానిసత్వం పెరుగే ప్రమాదం, విదేశాలకు పంపించిన అనంతరం ఏజెన్సీల బాధ్యతను పరిమితం చేయడం, విదేశాలనుంచి తిరిగివచ్చిన వారికి ఉండే పునరేకీకరణ వ్యవస్థ బలహీనపడటం, ఆరు నెలల లోపు డిపోర్ట్ అయిన వారిని ‘రిటర్నీలు’గా పరిగణించక పోవడం వంటి అంశాలు ప్రవాసుల హక్కులను గణనీయంగా బలహీన పరుస్తాయని వారు గుర్తుచేశారు. ‘ఎమిగ్రంట్’, ‘ఓవర్సీస్ ఎంప్లాయ్‌మెంట్’, ‘లేబర్’ వంటి కీలక పదాల నిర్వచనాల్లో విద్యార్థులు, ఆధారితులు, డిజిటల్ కార్మికులు వంటి వర్గాలను బయటకు నెట్టడం, మానవ అక్రమ రవాణాకు స్పష్టమైన నిర్వచనం లేకపోవడం, కేంద్రీకృత పాలనా విధానంలో రాష్ట్రాలకు, కార్మిక సంఘాలకు, హక్కుల సంస్థలకు ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం వల్ల సమస్యల పరిష్కారం దూరమవుతుందనే ఆందోళనలు ప్రతిపాదించారు. ముఖ్యంగా ప్రతిపాదిత ‘ఓవర్సీస్ మొబిలిటీ %Ꭰ% వెల్ఫేర్ కౌన్సిల్’లో వలస కార్మికులను విదేశాలకు పంపే రాష్ట్రాలకు చోటు లేకపోవడం తీవ్రమైన లోపమని పేర్కొన్నారు. ఎమిగ్రేషన్ చెక్‌పోస్టులు రద్దు చేసినప్పటికీ ప్రత్యామ్నాయ నియంత్రణ వ్యవస్థ లేకపోవడం, ప్రయాణానికి ముందు శిక్షణా ప్రమాణాలు, విదేశాలలో అందించాల్సిన సహాయక సేవలు స్పష్టంగా లేకపోవడం, ఇంటిగ్రేటెడ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ హక్కుల కంటే పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం, 24/7 హెల్ప్‌లైన్‌లు, విమానాశ్రయం%-%ఎంబసీ సహాయం తప్పనిసరి అంశాలుగా ప్రతిపాదించక పోవడం, శిక్షలు కేవలం రిక్రూట్మెంట్ ఏజెంట్లపైనే ఉండటం, విదేశీ యజమాన్యాలపై చర్యలేమీ లేకపోవడం, అక్రమ ఆన్‌లైన్ రిక్రూట్మెంట్, ట్రాఫికింగ్ నియంత్రణకు ప్రత్యేక నిబంధనలు లేకపోవడం, విధించే జరిమానాల్లో బాధితులకు పరిహారాన్ని కేటాయించక పోవడం వంటి అంశాలు కూడా వారి ప్రాతినిధ్యం వహించిన కోరల్లో భాగమయ్యాయి. ఇవన్నీ కలిపి చూస్తే బిల్లులో ప్రవాసీ కార్మికుల సంక్షేమం బలపడటానికి కాకుండా బలహీన పడే అవకాశం ఎక్కువగా ఉందని వారు ఎంపీల దృష్టికి తీసుకెళ్లారు. విదేశాల్లో భారతీయుల భద్రత, గౌరవం, జీవనోపాధి, రక్షణ వ్యవస్థలపై ఎటువంటి సందిగ్ధత లేకుండా చట్టం రూపొందించాలంటే ప్రస్తుత బిల్లును లోతుగా అధ్యయనం చేసి అవసరమైన సవరణలు చేయడం అత్యంత అవసరమని ప్రతినిధి బృందం స్పష్టం చేసింది. వలస కార్మికుల హక్కులను కాపాడుతూ, దోపిడీని అరికట్టుతూ, రాష్ట్రాల సహకారంతో సమన్వయపూర్వక వ్యవస్థను ఏర్పాటు చేసే విధంగా బిల్లు రూపుదిద్దుకోవాలని వారు కోరారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# జెయింట్ కందహార్.. నిజంగానే వున్నారా.. వెలుగులోకి వచ్చిన ఫోటోలు!



జెయింట్ కందహార్.. గత కొన్ని దశాబ్దాలుగా ఎక్కువగా వినిపిస్తున్న పేరు జెయింట్ కందహార్. ఎక్కువగా గుహలో ఉంటాయని , నరమాంస భక్షకులు అని ఎప్పటినుంచో వార్తలు వెలువడుతున్న విషయం తెలిసిందే. ఎర్రటి జుట్టు.. భారీ దేహం.. 12 అడుగుల ఎత్తు కలిగి.. మానవ రూపాన్ని కలిగిన జీవిగా వీటిని పరిగణిస్తారు. ముఖ్యంగా ఆఫ్ఘనిస్తాన్ పర్వతాలలో అమెరికా సైనిక సిబ్బంది వీటిని ఎదుర్కొంది అని అప్పట్లో కథనాలు కూడా వెలువడ్డాయి. అంతేకాదు వీటి గురించి బయట సమాజానికి తెలిస్తే ప్రజలు భయాందోళనలకు గురవుతారని.. ఆ కారణంగానే అమెరికా సైనిక సిబ్బంది వీటి గురించి ఎక్కడ అధికారికంగా ప్రస్తావించలేదు అని కూడా అప్పట్లో వార్తలు వినిపించాయి.. అయితే నిజంగానే ఈ జెయింట్ కందహార్ లు ఉన్నాయా ? లేక కల్పిత కథలా? అనే విషయం మాత్రం ఎప్పటికప్పుడు మిస్టరీగానే మిగిలిపోతోంది. దీనికి తోడు ఇప్పుడు మరొకసారి ఈ జెయింట్ కందహార్ కు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పుడు వైరల్ అవుతున్న ఈ ఫోటోలను బట్టి చూస్తే ఇవి కూడా నిజం కాదు అని స్పష్టం అవుతుంది. ఇదిలా ఉండగా మరోవైపు ఈ జెయింట్ కందహార్ గురించి ఒక స్టోరీ ఎప్పటికప్పుడు వినిపిస్తూ ఉంటుంది. విషయంలోకి వెళ్తే.. ఒక ఫేమస్ అమెరికన్ రేడియో షో అయిన ‘ కోస్ట్ టు కోస్ట్’ హోస్ట్ స్టీవెన్ క్వెల్ ఏం చెప్పారంటే..” 2002 లో అమెరికా ఆర్మీ గ్రూపు సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టింది. అందులో భాగంగానే ఆఫ్గనిస్తాన్ పర్వతాలలో సెర్చ్ ఆపరేషన్ చేస్తుండగా.. ఆ ఆర్మీ బృందం సడన్ గా కనిపించకుండా పోయింది. చాలా రోజులవుతున్నా.. ఈ కనిపించకుండా పోయిన గ్రూప్ నుంచి ఎటువంటి సమాచారం లభించలేదు. దీంతో యుఎస్ ఆర్మీ అధికారులు ఈ గ్రూపు పై ఏదో అటాక్ జరిగిందని భావించి.. ఈ గ్రూపును కనిపెట్టడానికి ఒక స్పెషల్ టాస్క్ ఫోర్సును పంపించింది. ఈ స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఆఫ్ఘనిస్తాన్ పర్వతాలలో తప్పిపోయిన బృందం గురించి వెతుకుతూ ఉండగా అక్కడ వారికి ఒక అనుకోని దృశ్యం ఆశ్చర్యానికి గురిచేసిందట. అక్కడ తప్పిపోయిన బృందం శరీర కళేబరాలు, వారి ఆయుధాలు చెల్లాచెదురుగా పడి ఉండడం చూసి స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారట. అయితే ఆ బృందం గుహ లోపలికి వెళ్లడానికి ప్రయత్నం చేయగా.. సుమారుగా 12 నుండి 15 అడుగుల మానవ శరీరం కలిగిన ఒక జీవి బయటకు రావడం చూసి విస్తుపోయారట. ఈ జీవి రెండు వరుసల పళ్ళను కలిగి ఉండి, ఒక్కొక్క చేతికి 6 వేళ్లను కలిగి ఉండడమే కాకుండా ఎర్రటి జుట్టు, భారీ ధృడ శరీరాన్ని కలిగి ఉందట. అంతేకాదు ఇది మనుషుల చర్మాన్ని తన శరీరంపై కప్పుకున్నట్లు కూడా వారు గుర్తించారు. ఈ జీవి వీరిని చూడగానే వీరిపై దాడి చేసే ప్రయత్నం చేయగా.. 30 సెకండ్ల పాటు జీవి తలపై టాస్క్ ఫోర్స్ తమ ఆయుధాలను ఉపయోగించి కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మరణించినట్లు సమాచారం. ఇకపోతే ఒక హెలికాప్టర్ సహాయంతో ఈ బృందం అమెరికాకు ఈ జీవిని తరలించారట. అయితే ఇలాంటివి ఉన్నట్లు బయట ప్రపంచానికి తెలిస్తే ప్రజలు భయాందోళనకు గురవుతారని.. ఆ కారణంగానే ఈ విషయం గురించి ఎక్కడా చెప్పకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ.. టాస్క్ ఫోర్స్ తో ప్రత్యేకంగా సంతకాలు కూడా ఆ ప్రభుత్వం తీసుకున్నట్లు” సమాచారం. అయితే ఈ విషయాలు 2016లో ఒక ఆర్మీ వ్యక్తి బయటపెట్టారు. అప్పట్నుంచి దీనికి సంబంధించిన ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంది. అయితే దీనిపై నిజా నిజాలు బయటకు రాలేదు. పైగా ఎవరూ కూడా ఈ జెయింట్ కందహారు ఉన్నట్లు ఎక్కడ అధికారికంగా ప్రస్తావించలేదు. కానీ ఇది మాత్రం ఒక కల్పిత కథగానే మిగిలిపోవడం జరిగింది. ఇలాంటి సమయంలో తాజాగా ఇప్పుడు మరొకసారి గుహ నుండి జెయింట్ కందహార్ బయటకు వస్తున్నట్లు కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తుండడంతో ప్రజలు దీని గురించి తెలుసుకోవడానికి ఆసక్తి కనుబరుస్తున్నారు. ఇకపోతే చివరిగా.. పూర్తి పరిశోధన తర్వాత తేలింది ఏమిటంటే ఇది కేవలం కల్పితం మాత్రమే.. ఇందులో ఎలాంటి నిజం లేదు. కాకపోతే సోషల్ మీడియాలో ఇలాంటి వార్తలు వస్తే మాత్రం వీటి గురించి తెలుసుకోవాలనే తపన అందరిలో ఉంటుంది. అయితే ఇది కేవలం అధునాతన టెక్నాలజీతో రూపొందించిన కల్పితం మాత్రమే.

చురకలు

# సంపాదకీయం

## జర్మనీలో ఉద్యోగాలు..

### భారత విద్యార్థుల రాత మారనుందా..?

ప్రపంచం మారుతోంది.., అవకాశాలు కొత్త రూపం దాలుస్తున్నాయి. అమెరికా తలుపులు కాస్త మూసుకుంటున్న వేళ, యూరప్‌లోని జర్మనీ మాత్రం భారతీయ యువతకు బంగారు తలుపులు తెరిచింది. నైపుణ్యం ఉన్నవారికి ఇది కేవలం ఉద్యోగం కాదు, భవిష్యత్తును మలిచే అవకాశం. జర్మనీ ప్రస్తుతం ఒక విప్లవాత్మక మార్పు దశలో ఉంది. పారిశ్రామిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద సవాలుగా మారింది. ఇంజినీరింగ్, ఐటీ, ఆరోగ్య సంరక్షణ, గ్రీన్ ఎనర్జీ వంటి కీలక రంగాల్లో శ్రామిక శక్తి తగ్గిపోవడంతో, జర్మన్ ప్రభుత్వం తన ఇమ్మిగ్రేషన్ విధానాలను పూర్తిగా మారుస్తుంది. వీసా నిబంధనలను సులభతరం చేయడం, యూరోపియన్ యూనియన్ బ్లూ కార్డ్ కనీస జీతం అవసరాలను తగ్గించడం, కొత్తగా ఆపర్చునిటీ కార్డ్ ప్రవేశపెట్టడం వంటి చర్యలు ఈ మార్పులో భాగం చేయనున్నాయి.

**అమెరికా ఆశలను జర్మనీ తీర్చబోతోందా?...** ప్రస్తుతం అమెరికాలో భారతీయులకు ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లుతున్న వేళ, జర్మనీ ఒక ఆశాకిరణంగా కనిపిస్తోంది. ముఖ్యంగా TU9 యూనివర్సిటీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, పునరుత్పాదక శక్తి వంటి అత్యంత డిమాండ్ ఉన్న రంగాల్లో ప్రత్యేక కోర్సులను అందిస్తున్నాయి. మెకానికల్, ఆటోమోటివ్, ఎలక్ట్రికల్, మెకట్రానిక్స్, సివిల్ ఇంజినీరింగ్ వంటి విభాగాలు జర్మనీ పారిశ్రామిక భవిష్యత్తుకు వెన్నెముకగా నిలుస్తున్నాయి. జర్మనీలో ప్రస్తుతం దాదాపు 6 లక్షల ఉద్యోగాలలో ఉద్యోగుల కొరత కనిపిస్తోంది. ఇది తాత్కాలికమైన కొరత కాదు, వృత్తిపరమైన నిర్మాణంలో జరుగుతున్న నిర్మాణాత్మక పరివర్తనకు సంకేతం. ముందస్తు ఉద్యోగ ఆఫర్ లేకుండానే విదేశీ నిపుణులు జర్మనీకి వచ్చి పని వెతుక్కోవడానికి అవకాశం కల్పించే ఆపర్చునిటీ కార్డ్, ఈ మార్పులో కీలక పాత్ర పోషిస్తోంది.

**అగ్నశ్రేణి యూనివర్సిటీల ఆఫర్లు..** అదే సమయంలో అనేక అగ్రశ్రేణి జర్మన్ యూనివర్సిటీలు దాదాపు జీరో ట్యూషన్ ఫీజుతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. ఇది భారతీయ విద్యార్థులకు ఆర్థికంగా భారీ ప్రయోజనకరంగా మారింది. స్టెమ్ రంగాల్లో శిక్షణ పొందిన యువతకు జర్మనీయే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అత్యుత్తమ కెరీర్ మార్గాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ పరిణామం ఒక సాధారణ ఉద్యోగావకాశం కంటే ఎక్కువ. ఇది భారతీయ యువతకు గ్లోబల్ స్థాయిలో తమ ప్రతిభను నిరూపించుకునే వేదికగా మారబోతోంది.

జర్మనీ తీసుకున్న ఈ సంస్కరణలు, భవిష్యత్తులో దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, భారతీయుల కెరీర్ ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించబోతున్నాయి.

**అరుదైన అవకాశం..** భారతీయ యువతకు ఇది ఒక అరుదైన అవకాశం. నైపుణ్యం, కృషి, పట్టుదలతో ముందుకు సాగితే జర్మనీ మాత్రమే కాదు.. ప్రపంచం మొత్తం వారి ప్రతిభను గుర్తిస్తుంది. ఈ మార్పు కేవలం జర్మనీకి శ్రామిక శక్తి అందించడమే కాదు, భారతదేశానికి కూడా గ్లోబల్ స్థాయిలో ప్రతిష్టను తీసుకురానుంది. జర్మనీ తీసుకున్న ఈ నిర్ణయాలు కేవలం ఆర్థిక అవసరాలకే పరిమితం కావు. ఇది ఒక సామాజిక మార్పు కూడా. వలస వచ్చిన నైపుణ్యవంతుల ద్వారా జర్మన్ సమాజం మరింత వైవిధ్యభరితంగా, అంతర్జాతీయంగా మారనుంది. భారతీయ యువతకు ఇది ఒక ద్వంద్వ ప్రయోజనం – ఒకవైపు కెరీర్‌లో స్థిరత్వం, మరోవైపు ప్రపంచ స్థాయి అనుభవం.

**బ్రెయిన్ డ్రెయిన్ కాబోతుందా?...** భారతదేశం నుంచి వెళ్లే ప్రతిభావంతుల సంఖ్య పెరగడం వల్ల 'బ్రెయిన్ డ్రెయిన్' అనే ఆందోళన సహజమే. కానీ దీన్ని ఒక అవకాశంగా కూడా చూడవచ్చు. విదేశాల్లో ప్రతిభను నిరూపించిన యువత, భవిష్యత్తులో తిరిగి స్వదేశానికి వచ్చి తమ అనుభవాన్ని పంచుకుంటే, అది దేశ అభివృద్ధికి మరింత తోడ్పడుతుంది. జర్మనీ తెరిచిన ఈ తలుపులు, భారతీయ యువతకు గ్లోబల్ వేదికపై కొత్త అధ్యాయాన్ని రాయించే అవకాశం కల్పిస్తున్నాయి.

# సమ సమాజ స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్ - డిసెంబర్ 6 బాబా సాహెబ్ వర్ధంతి



భారత దేశంలో బడుగు బలహీన వర్గాలకు ఇతర అగ్రవర్ణాలతో సమానంగా అన్ని హక్కులు. పోరాడే అవకాశాలు కల్పించిన ఈ తరం మహనీయుడు సామాన్యులకు నిత్యం చిరస్మరణీయుడైన బి ఆర్ అంబేద్కర్ జన్మదినం, వర్ధంతిని ఎఒక్క రోజుకో పరిమితం చేసుకోవడం కాకుండా ప్రతి రోజు గుర్తుంచుకోవాల్సిన పవిత్రం దినాలు. ఈ నాడు మనం స్వేచ్ఛగా స్వతంత్రంగా ఆలోచించుకోవాడానికి అనువైన పరిస్థితులు కల్పించిన గొప్పతనం కూడా ఆయనదే. రాజ్యాంగంలోని ప్రతి విభాగ రచనలో మిగతా వారి కృషితో పాటు, అంబేద్కర్ ముందుచూపు కనబడుతుంది. ఆయన జీవితంలోని కొన్ని ముఖ్య ఘట్టాలను ఈరోజు మననం చేసికోవడం అంటే మన స్ఫూర్తిదాత జీవితాన్ని మనకు స్ఫూర్తి కలగాలని కోరుకోవడమే తప్ప ఆయనకు మనం చేసేది ఏమి లేదు. భారత రాజ్యాంగ నిర్మాత, విద్యాధికుడు, తత్వవేత్త సంపాదకుడు, విప్లవకారుడు, దార్శనికుడు, చరిత్ర కారుడు, ప్రాసంగికుడు, రచయిత, దళిత జన బాంధవుడు, అర్థ శాస్త్రజ్ఞుడు, స్వతంత్ర భారత తొలి న్యాయ శాఖ అమాత్యులు, న్యాయవాది, బౌద్ధ ధర్మ పునరుద్ధారకుడు, భారతరత్న డాక్టర్ భీమ్ రావు రాంజీ అంబేద్కర్ బహుముఖ ప్రజ్ఞాశాలి.. 1881 ఏప్రిల్ 14న నాటి సెంట్రల్ ప్రావిన్సెస్ లో సైనిక స్థావరం ఐన మూమ్ ఊరిలో రాంజీ మలోజి సాక్పాల్, భీమాబాయి దంపతులకు 14వ, చివరి సంతానంగా జన్మించిన భీమ్ రావు, క్రమశిక్షణతో పెరిగి ప్రతిదినం రామాయణ భారత, తుకారాం, మోరోపంత్ ల గీతాలు గానం చేసేవారు. ఆధునిక మహారాష్ట్రలో రత్నగిరి జిల్లాలో అంబావడే పట్టణంలో ఆయన కుటుంబం జీవించినందున, మరాఠీ నేపథ్యాన్ని కలిగి ఉన్నారు. వారి కుటుంబం శాకాహారం తీసుకునేది. మొహర్లు అస్పృశులుగా, పరిగణింపబడిన కాలంలో, బాల్యం నుండి అంటరాని తనాన్ని ఎదుర్కొని, ఎన్నో అవమానాలకు గురైనారు. 1996లో ప్రాథమిక విద్య, ఏలిఫిస్టన్ హైస్కూల్ లో 1907లో ఎస్ ఎస్ ఎల్ సీ పూర్తి చేశారు 1908లో 16వ ఏటనే రమా బాయ్ తో వివాహం జరిగింది. బరోడా మహారాజు షాయాజీ గాయేక్వాడ్ ద్వారా 25 రూపాయల విద్యార్థి వేతనంతో 1912లో ఏలిఫిస్టన్ కళాశాలలో బిఏ ఉత్తీర్ణులు అయినారు. 1913లో రాజుగారి ఆర్థిక సాయంతో కొలంబియా యూనివర్సిటీలో చేరారు. 2015 లో – ఎం. ఏ, పీహెచ్ డీ సాధించారు. 17 లో తిరిగి వచ్చి మహారాజు మిలిటరీ కార్య దర్శిగా పనిచేశారు. కొల్హాపూర్ మహా రాజు సాహు మహారాజ్ సహాయంతో, "మూక్ నాయక్" పక్ష పత్రిక కు సంపాదకత్వం వహించారు సాహూ మహారాజ్ సాయంతో 1920లో విదేశీ చదువులకు పయనమయ్యారు. 22 లో బారిస్టర్ ఎట్ లాకు ఆహ్వానం అందింది. 27 మార్చి 20న మహద్ చెరువు నీరు స్వీకరించి పోరాటం జరిపారు. 27లో "బహిష్కృత భారతి"" మరాఠీ పక్ష పత్రిక ప్రారంభించారు. 27 డిసెంబర్ 25న "మనుస్మృతి"ని దహనం చేశారు. 1930లో నాగపూర్ ప్రసిద్ధ ఉపన్యాసం గావించారు. 30 నవంబర్ 12న మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. 2వ సమావేశంలో దళితులకు ప్రత్యేక నియోజకవర్గాల కేటాయింపు విషయంలో మహాత్మా గాంధీతో తీవ్రంగా విభేదించారు. 32 లో రాంసే మెక్ డొనాల్డ్" కమ్యునల్ అవార్డు" ప్రకటన ద్వారా ప్రత్యేక నియోకవర్గాల ప్రతిపాదన జరిగింది. పూనా ఒప్పందం ద్వారా కమ్యునల్ అవార్డు కన్నా ఎక్కువ స్థానాలు వుమ్మడి నియోజక వర్గాలలో ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. 35 మార్చి 4న రమాబాయ్ మరణించింది. 36లో కుల నిర్మూలన గ్రంథాన్ని రచించారు. 42 జూలై 18న షెడ్యూలు కులాల ఫెడరేషన్ ను స్థాపించారు. 42 నుండి 46 వరకు వైస్రాయి క్యాబినెట్ లో "కార్మిక మంత్రి"గా పని చేశారు 47 ఆగస్టు 3న "న్యాయశాఖ మంత్రి"గా బాధ్యతలు స్వీకరించారు. ఆగస్టు 19న "రాజ్యాంగ రచనా కమిటీ చైర్మన్" గా నియమితులైనారు. 48 ఏప్రిల్ 15న తమ 5వ ఏట బ్రాహ్మణ కుటుంబానికి చెందిన శారదా కబీర్ ను ద్వితీయ వివాహమాడారు. నవంబర్ 26న భారత రాజ్యాంగం ఆమోదం పొందింది. 51 లో న్యాయ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. 52 లో ముంబాయి శాసన సభ నుండి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 56 అక్టోబర్ 14న నాగపూర్ లో "బౌద్ధ మతం స్వీకరించారు. డిసెంబర్ 6న ఢిల్లీలో పరమపదించారు. అంబేద్కర్ మరాఠీ, హిందీ, ఇంగ్లీష్, గుజరాతీ, పాళీ సంస్కృతం, బెంగాలీ, పర్షియన్, ఫ్రెంచ్, జర్మన్ తదితర భాషలలో ప్రావీణ్యత సాధించడమే కాక పాళీ ఇంగ్లీష్ నిఘంటువు కూడా రాశారు. ఆయనను ఒక వ్యక్తిగా కాక, శక్తిగా, మహెూద్యమంగా, విద్యావేత్తగా, సాంఘిక సంస్కర్తగా, స్వతంత్ర ప్రతిభకు చిరునామాగా, సాహిత్య వ్యాప్తికి నిరంతర కృషి సల్పి మానవత్వాన్ని, సకల జన సంక్షేమాన్ని కోరిన భారత రత్నంగా, ప్రతి భారతీయుడు పూర్తిగా స్ఫూర్తిని తీసుకోవాల్సి ఉంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

# ప్రతి పౌరునికి సమ న్యాయం జరగాలి - డిసెంబర్ 6.... రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా.....

రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్ భిన్నత్వ సమ్మేళితమైన దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడంలో ప్రముఖ పాత్రలో ఎంతగానో శ్రమించారు. ప్రభుత్వ విధివిధానాలు, శాసనసభల రూపకల్పనతో పాటు కోట్లాది మంది పీడిత ప్రజల ఆశయాలను ప్రతిబింభించేలా రాజ్యాంగాన్ని లిఖించారు. కులాలు, విభిన్న మతాలు, రకరకాల కట్టూ బొట్టు ఆచార వ్యవహారాల సంఘటిత భారతావనికి స్వపరిపాలనా రూపకల్పనను రాజ్యాంగ బద్ధం చేశారు. భారత తొలి రాష్ట్రపతి బాబు రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలో డా.బాబా సాహెబ్ అంబేద్కర్ అధ్యక్షతన డ్రాఫ్టింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. రాజ్యాంగాన్ని తయారు చేసుకోవడానికి దేశంలోని సుప్రసిద్ధ నాయకులు, అనుభవజ్ఞులు, విద్యావేత్తలు, న్యాయ కోవిదులు, వివిధ రంగాల ప్రముఖులతో రాజ్యాంగ నిర్మాణ సభను నిర్వహించు కున్నారు. రాజ్యాంగ మంటే కేవలం ప్రభుత్వ విధివిధానాలు, శాసన సభల రూపకల్పనే కాదు... కోట్లాది పీడిత ప్రజల ఆశయా లను ప్రతిబింభించాలన్నది బాబా సాహెబ్ ప్రధానాశయం. ఆయన కృషి ఫలితం గానే ప్రపంచం లోనే కొత్తదైన రాజ్యాంగం రూపు దిద్దుకుంది. అందుకనే ప్రపంచం లోని అనేక దేశాల రాజ్యాంగాల కంటే భారత రాజ్యాంగం ఉన్నత విలువలు కలిగిందంటూ మన్ననలు పొందింది. అంబేద్కర్ చైర్మన్‌గా, జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, సర్దార్ పటేల్, ఆచార్య జె.బి. కృపలానీ, డా.రాజేంద్ర ప్రసాద్, సరోజినీ నాయుడు, రాజాజీ, వల్లబ్ పంత్, బి.ఆర్. అంబేద్కర్, టంగుటూరి ప్రకాశం పంతులు, పట్టాభి సీతారామయ్య మొదలైన వారు ఈ సభలో సభ్యులు. 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజులు కష్టించి, రాజ్యాంగ సభ మొదటి సమావేశం 1946, డిసెంబర్ 9తో ప్రారంభించి 11 సార్లు, 165 రోజుల పాటు సమావేశాలు జరగగా, ఇందులో 114 రోజులు రాజ్యాంగం రాత ప్రతిపై వెచ్చించింది.



రాజ్యాంగ రాత ప్రతిని తయారుచేసే క్రమంలో రాజ్యాంగ సభ ముందుకు 7,635 సవరణ ప్రతిపాదనలు వచ్చాయి. వీటిలో 2,473 ప్రతిపాదనలను పరిశీలించి, చర్చించి, పరిష్క రించింది. ఏడు దశాబ్దాల కిందట 26నవంబర్ 1949నాడు డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సర్దార్ వల్లభాయి పటేల్ ప్రతిపాదించి ప్రవేశ పెట్టారు. అందమైన చేతి రాతతో హిందీ, ఇంగ్లీషు ప్రతులను, 24 జనవరి 1950న 284 మంది సభ్యుల సంతకా లతో అమోదించారు. రెండు రోజుల తర్వాత 26 జనవరి 1950నుంచి మన రాజ్యాంగం అమలులోకి వచ్చింది. రాజ్యాంగం అంటే దేశానికి, ప్రజలకు, ప్రభుత్వానికి కరదీపిక లాంటిది. ఆ దీపస్తంభపు వెలుగుల్లో సర్వసత్తాక సౌర్వభౌమాధికార దేశంగా ప్రగతి వైపు అడుగులు వేయాలి. అందుకనే రాజ్యాంగానికి ఆధునిక ప్రజా స్వామ్య చరిత్రలో అంతటి విశిష్టమైన స్థానముంది. రాజ్యాంగ మౌలిక లక్ష్యం... సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందరరికీ అంచించడం. ఈ లక్ష్యము ప్రజల హక్కులకు రూపాన్ని ఇచ్చింది. ప్రజాస్వామ్య సంప్రదాయాలను పరిరక్షిం చేందుకు స్వతంత్ర ప్రతిపత్తి గల, సమర్ధ వంతమైన న్యాయాన్ని ఇవ్వగల వ్యవస్థ రూప కల్పనే రాజ్యాంగం. చట్టము ముందు సమాన పరిగణన, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి అంశాల అధ్యయనము ద్వారా బారతీయ న్యాయ వ్యవస్థ పాత్రను బలోపేతము చేయడం జరిగింది. రాజ్యాంగ అమలు ద్వారా పౌర హక్కుల అవగాహనను వివిధ దశల్లో విస్తృత పరిచారు. ప్రాథమిక హక్కులకు పెద్దపీట వేశారు. వీటన్నింటికీ రక్షణ న్యాయ వవస్థ కాబట్టి రాజ్యాంగ ముసాయిదా సంతకాల రోజును జాతీయ న్యాయ దినోత్సవాన్ని జరపడానికి ఎంచుకున్నారు. ప్రభుత్వాలు చట్టాలు ప్రజా వ్యతిరేకముగా ఉన్నా, రాజ్యాంగాన్ని అతిక్రమించేవిగా ఉన్నా, అవి చెల్లవని చెప్పే అధికారము రాజ్యాంగ ధర్మాసనాలకు ఉన్నది .. సుప్రీం కోర్టు ఇచ్చే తీర్పులకు కూడా చట్ట హెూదా ఉంటుంది. అయితే కోర్టులలో కేసుల నమోదు రేటు రాను రాను పెరుగు తున్నది. న్యాయమూర్తుల కొరత ఉన్నందున కేసుల పరిష్కారము సత్వరము జరుగక, చాలా కాల వ్యవధి పడుతున్నది. ఒక్క అమాయ కుడికి కూడా అన్యాయము జరగ కూడదన్న సూత్రము న్యాయ వ్యవస్థకు పునాది. అందుకే న్యాయము అందడంలో జాప్యము కారణంగా చాలా మంది కోర్టుల్ని ఆశ్రయించడానికి సందేహిస్తున్నారనేది వాస్తవం. అయితే న్యాయ వాద వృత్తిలో ఉన్న వారంతా చట్టబద్ధముగా సమస్యలను పరిష్కరించు కోవాల్సిందిగా ప్రజల్ని చైతన్య పరచాల్సిన అవసరము ఉన్నది. ఈ మేరకు ప్రజల్లో విశ్వాసము పెంపొందించ గలగాలి. భాదితుల హక్కులను కాపాడటం. తీవ్రమైన నేరాలను నివారించడం, ప్రపంచంలోని శాంతి, భద్రతలకు భంగం వాటిల్లకుండా చేయడానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యయుత కృషి జరగాలి. అప్పుడే న్యాయ పరిరక్షణ సాకారం అవుతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

# ఉప్పు సత్యాగ్రహంలో తొలి భారతీయ మహిళ ఆచంట రుక్మిణమ్మ - డిసెంబర్ 6...ఆచంట రుక్మిణమ్మ (రుక్మిణీ లక్ష్మీపతి) వర్ధంతి



ఆచంట రుక్మిణమ్మ, రుక్మిణీ లక్ష్మీపతి పేరుతో ప్రసిద్ధి చెందిన ఆమె, భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ మహిళా యోధురాలిగా, సామాజిక సేవకురాలిగా, మరియు రాజకీయ నాయకురాలిగా తన స్థానాన్ని ఏర్పరచుకున్నారు. సామాజిక న్యాయం, మహిళా సాధికారత, ఆరోగ్య పరిరక్షణ కోసం ఆమె చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమైంది.

**ప్రారంభ జీవితం...** రుక్మిణీ లక్ష్మీపతి 1892 డిసెంబర్ 6న, తమిళనాడులోని మధురైలో జన్మించారు.

ఆమె ఒక జమీందారీ కుటుంబంలో పుట్టి పెరిగారు. చెన్నైలోని ప్రెసిడెన్సీ గర్ల్స్ స్కూల్‌లో చదువుకొని, మద్రాసు క్రైస్తవ కళాశాల (మద్రాసు క్రిస్టియన్ కాలేజీ) నుండి బి.ఎ డిగ్రీ పొందారు. రుక్మిణీ లక్ష్మీపతి వివాహం లక్ష్మీపతితో జరిగింది, ఈ కారణంగా ఆమె పేరు "రుక్మిణీ లక్ష్మీపతి"గా మారింది.

**స్వాతంత్ర్య ఉద్యమంలో పాత్ర...** మహాత్మా గాంధీ, సరోజినీ నాయుడు, రాజగోపాలాచారి వంటి నేతల ప్రభావంతో రుక్మిణీ లక్ష్మీపతి స్వదేశీ ఉద్యమంలో చేరారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న మొదటి భారతీయ మహిళగా చరిత్రకెక్కారు. ఈ సందర్భంగా ఆమె అరెస్ట్‌కు గురయ్యారు. ఖాదీ వాడకాన్ని ప్రోత్సహిస్తూ, విదేశీ వస్త్రాలపై బహిష్కరణ ఉద్యమాన్ని విస్తృత స్థాయిలో ప్రచారం చేశారు.

**రాజకీయ ప్రస్థానం...** 1923లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1934లో మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. 1937లో మద్రాసు ప్రెసిడెన్సీ శాసనసభకు ఎన్నికై, ఉపసభాపతిగా నియమితులయ్యారు. 1946–1947లో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతుల మంత్రివర్గంలో ప్రజా ఆరోగ్య శాఖామంత్రిగా సేవలందించారు. ఆయుర్వేదం, యునానీ వంటి భారతీయ వైద్య విధానాల ప్రాచుర్యం కోసం విశేష కృషి చేశారు.

**సామాజిక సేవ మరియు సంస్కరణలు...** బాల్యవివాహాల రద్దు, స్త్రీ విద్యావృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. వితంతు వివాహాలను ప్రోత్సహిస్తూ సమాజంలో స్త్రీలకు కొత్త ఆశలు నింపారు. నిరుపేదల కోసం ఆస్పత్రులు, విద్యాసంస్థలు నెలకొల్పడంలో ముఖ్య పాత్ర పోషించారు.


**ముఖ్య ఘట్టాలు...** ఉప్పు సత్యాగ్రహంలో తొలి భారతీయ మహిళగా, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమంలో తొలి మహిళగా అరెస్టైన రుక్మిణీ లక్ష్మీపతి పేరు చరిత్రలో నిలిచి పోయింది.

తమిళనాడు రాజకీయాల్లో తొలి మహిళా నేత: మద్రాసు శాసనసభకు ఎన్నికైన మొదటి మహిళల్లో ఒకరు. చేనేత మరియు ఖాదీ పరిశ్రమల అభివృద్ధికి విశేష కృషి చేశారు.

**మరణం...** 1951లో రుక్మిణీ లక్ష్మీపతి మరణించారు. కానీ ఆమె విజయాలు, సాధనాలు నేటికీ స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. చెన్నైలోని ఎగ్మోర్ ప్రాంతంలో ఉన్న మార్షల్ రోడ్డుకు ఆమె పేరు పెట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమె జన్మదినాన్ని అధికారికంగా గుర్తించి, కార్యక్రమాలు నిర్వహిస్తుంది. రుక్మిణీ లక్ష్మీపతి భారతదేశానికి మాత్రమే కాదు, మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచిన ఓ మహానుభావురాలు. స్వాతంత్ర్యం కోసం ఆమె చేసిన త్యాగాలు, సామాజిక సేవల కోసం చూపిన నిబద్ధత, మహిళల కోసం చేసిన కృషి మనకు ఎప్పటికీ ప్రేరణ. తరతరాల వారికి ఆమె జీవితం పాఠం, మార్గదర్శనం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

# భారతీయ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసిన పాశ్చాత్య జ్ఞాని - డిసెంబర్ 6...మాక్స్ ముల్లర్ జయంతి



మాక్స్ ముల్లర్ 19వ శతాబ్దంలో భారతీయ సాహిత్యాన్ని పాశ్చాత్య ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప భాషావేత్త, తాత్వికుడు, తులనాత్మక మత శాస్త్రవేత్త. ఆయన భారతీయ వేద సాహిత్యానికి చేసిన సేవల కారణంగా భారతీయ సాంస్కృతిక అధ్యయనాల్లో ఓ కీలక స్ఫూర్తి దాయక వ్యక్తిగా నిలిచారు. మాక్స్ ముల్లర్ 1823 డిసెంబర్ 6న జర్మనీలోని డెసావ్ పట్టణంలో జన్మించారు. ఆయన తండ్రి ప్రముఖ కవి, రచయిత. చిన్నతనం నుండే ముల్లర్‌కు భాషలపై ఆసక్తి పెరిగింది. లైప్జిగ్ విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్రం చదివిన ముల్లర్, తరువాత ఫ్రాన్స్ మరియు ఇంగ్లాండ్‌లో సంస్కృతం, తత్వశాస్త్రంలో తన అధ్యయనాలను విస్తరించారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా స్థిరపడి, తన సార్వత్రిక పరిశోధనలను కొనసాగించారు. మాక్స్ ముల్లర్ భారతీయ సాహిత్యం, ముఖ్యంగా వేదాల పట్ల ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం వంటి వేదాలను పఠించి, వాటిని పాశ్చాత్య సమాజానికి పరిచయం చేయడం కోసం ఇంగ్లీష్‌లో అనువదించారు. ఆయన ముఖ్యమైన రచనల్లో "సేక్రెడ్ బుక్స్ ఆఫ్ ది ఈస్ట్" ఎంతో ప్రసిద్ధి గాంచింది. ఇది 50 సంపుటాల గ్రంథమాలగా ప్రచురించ బడింది. ఇందులో వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, బౌద్ధ గ్రంథాలు, జైన గ్రంథాలు, ఇస్లామిక్ మరియు జరస్ట్రియన్ గ్రంథాల అనువాదాలు ఉన్నాయి. ముల్లర్, తులనాత్మక మత శాస్త్రానికి పునాది వేశారు. భిన్న మతాలు, సాంస్కృతిక గ్రంథాల తులనాత్మక విశ్లేషణ చేయడం ద్వారా మానవ సమాజాల ఆధ్యాత్మిక వికాసాన్ని అర్థం చేసుకోవచ్చని విశ్వసించారు. భారతీయ తత్వశాస్త్రం మరియు పాశ్చాత్య తత్వం మధ్య సారూప్యాలను గుర్తించి, రెండు సంస్కృతుల మధ్య అనుబంధాన్ని ఆవిష్కరించారు. ముల్లర్ ముఖ్యంగా వేదాలను "మానవతా చింతనకు మూలాధారాలు" అని పేర్కొన్నారు. ఆయన దృష్టిలో వేదాలు కేవలం హిందువుల పుణ్య గ్రంథాలు మాత్రమే కాదు, ప్రపంచ మానవాళికి చెందిన ఆధ్యాత్మిక మౌలిక గ్రంథాలు. ముల్లర్ భారతీయ సంస్కృతిని గౌరవంతో పరిగణించేవారు. "వేదాలు భారతీయుల ఆత్మ" అని పేర్కొంటూ, భారతీయుల ఆధ్యాత్మిక జీవన విధానాన్ని సానుకూల దృక్కోణంతో విశ్లేషించారు. ఆయనకు భారతీయ ధర్మం, తాత్విక సూత్రాల పట్ల ఎంతో ఆసక్తి ఉండేది. అయితే, కొందరు విమర్శకులు ముల్లర్‌పై పాశ్చాత్య వలసవాద దృక్కోణంతో భారతీయ సాహిత్యాన్ని అర్థం చేసుకున్నారని అభిప్రాయ పడ్డారు. ఆయన అనువాదాలు పాశ్చాత్య పాఠకుల కోసం కాస్త మార్పుచేర్పులు చేయబడ్డాయని విమర్శనాత్మకంగా పేర్కొన్నారు. ముల్లర్ జీవితకాలంలో అనేక కీలక రచనలు చేసారు, వాటిలో కొన్ని ముఖ్యమైనవి: ఋగ్వేదంపై విశ్లేషణ, ఉపనిషత్తుల అనువాదాలు, ప్రాచీన ఆధ్యాత్మిక గ్రంథాల సమాహారం. తాత్త్విక వ్యాసాల సమాహారం. ముల్లర్ చేసిన అనువాదాలు, విశ్లేషణలు విస్తృతంగా గౌరవించబడ్డప్పటికీ, కొన్ని విమర్శలు ఎదుర్కొన్నాయి. భారతీయ మతసాంప్రదాయాలపై పాశ్చాత్య అర్థాలు రుద్దబడ్డాయని, పాశ్చాత్య పరిశోధనల పట్ల మక్కువతో తాత్త్విక అంశాలను ఒడిసిపట్టాడని విమర్శకులు అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, భారతీయ వేద సాహిత్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రచురించిన ముల్లర్ కృషి చిరస్థాయిగా నిలిచింది. మాక్స్ ముల్లర్ 1900 అక్టోబర్ 28న మరణించాడు. ఆయన సాహిత్యకృషి భారతీయ సాహిత్య, తాత్విక అధ్యయనాలపై ఎనలేని ప్రభావం చూపింది. భారతీయ వేదాలు, తత్వశాస్త్రాలపై పాశ్చాత్య ఆసక్తి పెరగడానికి ఆయన కృషి దోహద పడింది. మాక్స్ ముల్లర్ ప్రపంచానికి భారతీయ సంస్కృతిని పరిచయం చేసిన గొప్ప పాశ్చాత్య వేదాంతి. ఆయన చేసిన తాత్త్విక, సాహిత్య కృషి, వేదాలపై చేసిన విశ్లేషణలు భారతీయ, పాశ్చాత్య ప్రపంచాల మధ్య సంస్కృతిక మార్పిడి సాధించాయి. భారతీయ సాహిత్యం, తాత్త్వికతపై ముల్లర్ చూపిన ఆసక్తి, శ్రద్ధకు భారతీయులు ఎప్పటికీ రుణపడి ఉంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

# తుది విడతకు సర్వం సిద్ధం



పరిగి: స్థానిక సంగ్రామానికి జిల్లా ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలి, మలి విడతలు పూర్తికాగా.. చివరగా పరిగి నియోజకవర్గం ఒక్కటే మిగిలింది. నామపత్రాల స్వీకరణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ప్రతి గ్రామంలో కాకుండా మూడు, నాలుగు ఊళ్లను కలిపి ఒక క్లస్టరుగా ఏర్పాటు చేశారు. సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసే వారు ఆయా క్లస్టర్ కేంద్రాల్లో నామపత్రాలు దాఖలు చేయాల్సి ఉంటుంది. కేంద్రాల్లో పంచాయతీల వారీగా నామినేషన్ల కోసం కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు రిటర్నింగ్ అధికారులు(ఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులు(ఏఆర్వోలు) గెజిటెడ్ హోదా కలిగిన అధికారులను నియమించారు. వీరు అభ్యర్థుల నుంచి నామపత్రాలను స్వీకరిస్తారు. బుధవారం నుంచి శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఎంపిక చేసిన కేంద్రాల్లో నామపత్రాలను స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. 6న నామపత్రాల పరిశీలన, అర్హుల జాబితా రూపొందిస్తారు. 7న అప్పీలుకు అవకాశం కల్పించిన అధికారులు 8న నామపత్రాల విచారణ ప్రక్రియ పూర్తి చేస్తారు. 9న మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు నామపత్రాలను ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉంటుంది. అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. నామపత్రాల స్వీకరణ కోసం ఆయా మండలాల్లో నాలుగైదు పంచాయతీలను కలుపుతూ క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఆయా క్లస్టర్ల పరిధిలోకి వచ్చే పంచాయతీల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు.

**గంపగుత్తగా మళ్లించుకోవాలని..**

జిల్లాలో తొలి విడత పంచాయతీ ఎన్నికల బరిలో నిలుస్తున్న అభ్యర్థులు ఉపాధి కూలీల ఓట్లను సాధించడంలో నిమగ్నమయ్యారు. వారితో సంబంధాలున్న క్షేత్రస్థాయి, టెక్నికల్ సహాయకులతో మంతనాలు జరుపుతున్నారు. చిన్న పల్లెల్లో 100- 200, మండల కేంద్రాలు, పెద్ద గ్రామాల్లో 500-1500 మంది వరకు కూలీలున్నారు. సర్పంచి, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేస్తున్న వారి గెలుపోటములను శాసించేది వారే. జిల్లాలోని 20 మండలాల్లో 4.30 లక్షల మంది ఉపాధి కూలీలు ఉన్నారు. మొదటి విడత ఎన్నికలు జరుగుతున్న తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని 8 మండలాల్లో 1.50 లక్షల మంది కూలీలు ఓటర్లుగా ఉన్నారు.

**గనుల ఖిల్లాల్లో..**

తాండూరు నియోజకవర్గంలోని తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల్లో నాపరాయి, సుద్ద గనులున్నాయి. తాండూరు మండలంలో సిమెంటు కర్మాగారాలున్నాయి. 10వేల మందికిపైగా కార్మికులు గనులు, పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. వీరంతా సంబంధిత గ్రామాల్లో ఓటుహక్కు ఉన్నవారే. జిల్లాలో మేజర్ పంచాయతీగా కరణ్‌కోటలో వివిధ రాష్ట్రాలకు చెందిన 800 మంది కార్మికులు ఓటుహక్కు కలిగి ఉన్నారు. మల్కాపూరు, ఓగిపూరు, సంగెంకలాన్, కోటబాస్పల్లి, సిరిగిరిపేట, కొత్లాపూరు, బెల్కటూరు, ఏక్మాయి, క్యాద్గిర, నవల్గాలో కార్మికులున్నారు. పెద్దేముల్ మండలంలోని మారెపల్లి, కోట్‌పల్లి మండలం ఇందోల్, ఒగులాపూరు, గాజీపూరు, రుద్రారంలో సుద్ద పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. అభ్యర్థులు వారికి అనుకూలంగా ఉన్న వ్యాపార వర్గాలతో మంతనాలు జరిపి బేరసారాలు కుదుర్చుకుంటున్నారు.

**నాపరాయి పరిశ్రమల్లో..**

చాలా గ్రామాలకు చెందిన కూలీలు తాండూరు పట్టణంలోని 800 పాలిష్ యూనిట్లలో కూలీ పనులు చేస్తున్నారు. వారానికి, పది రోజులకోసారి సొంత గ్రామాలకు వెళ్లి వస్తుంటారు. వారి ఓట్లను పొందేందుకు అభ్యర్థులు చరవాణుల్లో సంప్రదింపులు జరుపుతున్నారు. ఖర్చులకు అయ్యే డబ్బులను తెలిసిన మిత్రులు, సన్నిహితుల ఫోన్‌తో గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా పంపుతున్నారు.

## ప్రోత్సాహకం.. అందక నిరుత్సాహం

చంద్రుగొండ : పంచాయతీ ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు నజరానా ప్రకటించింది. దీంతో అనేక గ్రామాలకు చెందిన వారంతా ఊరికి ఉపకారం చేయాలన్న ఉద్దేశంతో ఏకమయ్యారు. అభివృద్ధికి ప్రజలంతా రాజకీయాలు పక్కన పెట్టారు. గ్రామం అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని ఆశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 23 మండలాల్లో 471 పంచాయతీలున్నాయి. గత ప్రభుత్వం(2019) హయాంలో 43 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అప్పుడు ప్రభుత్వం ఒక్కో ఏకగ్రీవ పంచాయతీకి రూ.10 లక్షలు నజరానా ఇస్తానని ప్రకటించింది. ఐదేళ్ల కాలం పూర్తయినా ప్రభుత్వం పైసా విడుదల చేయలేదు.

**ఏకతాటిపై నిలబడి..**

చాలా గ్రామాల్లో ప్రజలు ప్రథమ పౌరుడిని ఏకగ్రీవం చేసుకొని మాట నిలబెట్టుకున్నారు. మళ్లీ ఎన్నికల క్రతువు మొదలైనా ఇప్పటి వరకు ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు మాత్రం విడుదల కాలేదు. పదవీ కాలం పూర్తయ్యేదాకా ఎదురు చూసి నిరాశ చెందారు. ప్రస్తుతం ఎన్నికలకు నజరానా వర్తిస్తుందా.. లేదా... అన్న సందేహం ఆశావహుల్లో నెలకొంది. ఇప్పుడు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె




ఆదినారాయణ మాత్రం ఏకగ్రీవ పంచాయతీలకు తన కోటా నుంచి రూ.10 లక్షలు ప్రోత్సాహం అందిస్తానని ప్రకటించారు.

**నిధుల్లేక ఇబ్బందులు**

ప్రోత్సాహకాలతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల నిధులతో గ్రామాలను సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనింపజేయాలని చాలామంది ముందుకు వచ్చారు. ఆశించిన మేరకు నిధులు రాకపోవటంతో సర్పంచులు అప్పులపాలయ్యారు. జనాభా ప్రాతిపదికన నిధులు విడుదల కావటంతో అన్ని రకాల పనులకు సరిపోక పల్లెల పురోభివృద్ధికి అడ్డంకిగా మారింది. అనుకున్న పనులను మాత్రం నెరవేర్చలేకపోయామని సర్పంచులు బాహాటంగానే అప్పట్లో ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నచిన్న పనులే తప్ప ప్రజా సమస్యల పరిష్కారంలో ఆశించినంతగా మెప్పు పొందలేకపోయామని వాపోయారు. ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. నిధుల కొరత కారణంగా పల్లెల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రహదారుల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల కల్పనలో విఘాతం ఏర్పడింది.

## గౌరవెల్లి.. హుస్నాబాద్ కల్పవల్లి

హుస్నాబాద్: మెట్టప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గంలో శాశ్వత సాగునీటి ఇబ్బందులు తీర్చడానికే గౌరవెల్లి రిజర్వాయరు నిర్మించారు. నీటి సరఫరాకున్న అడ్డంకులను తొలగిస్తే లక్ష ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారిగా హుస్నాబాద్‌కు వస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంత వాసులు సమస్య పరిష్కారానికి చొరవ చూపుతారని గంపెడాశలు పెట్టుకున్నారు.

**కాలువల నిర్మాణానికి రూ.430 కోట్లు**

రెండున్నరేళ్ల క్రితం 95 శాతం పనులు పూర్తయ్యాయి. ఎన్జీటీలో కేసు, భూ నిర్వాసితుల సమస్య కారణంగా రిజర్వాయరులోకి నీటి పంపింగ్ చేయడం లేదు. 8.25 టీఎంసీ సామర్థ్యం కల్గిన రిజర్వాయరులోకి నీటిని పంపింగ్ చేసి నిల్వ చేస్తే సుమారు లక్ష ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలగడంతో పాటు భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయి. రిజర్వాయరు నుంచి పంట పొలాలకు నీరిందించడానికి కాలువల నిర్మాణానికి రూ.430 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి పనులు వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

**నియోజకవర్గాన్ని కరీంనగర్‌లో చేర్చుతారా?**

పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హుస్నాబాద్ సభలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు ముక్కలు చేసిన హుస్నాబాద్ శాసనసభ నియోజకవర్గాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో చేర్చుతామని హామీ ఇచ్చారు. దీనిపై వివిధ పక్షాల నాయకులు కూడా ఆందోళన చేస్తున్నాయి.

బహుజన ఉద్యమనేత సర్వాయిపాపన్నకోటను సందర్శించి ఆయన స్వగ్రామమైన ఖిలాషాపురంను కోటతో సహా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

గండిపల్లిపై హామీ ప్రస్తావించేనా..



గౌరవెల్లి ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న గండిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి 2023 మార్చిలో పాదయాత్ర చేపట్టి హుస్నాబాద్‌లో జరిగిన సభలో మాట్లాడారు. అక్కన్నపేట మండలంలోని గండిపల్లి రిజర్వాయరును సందర్శించానని, అధికారంలోకి వస్తే ఆరు నెలల్లోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అప్పట్లోనే రీడిజైన్ చేసిన ఈ రిజర్వాయరుకు రూ.500 కోట్లతో అంచనాలు చేసినా మోక్షం లభించలేదు.

**వరద ముప్పు తొలగేనా..**

నాలుగు జిల్లాలకు మధ్యన అభివృద్ధి చెందుతున్న హుస్నాబాద్ పట్టణం భారీ వర్షం కురిస్తే జలమయం అవుతోంది. ప్రతి ఏటా ఇదే తంతు కొనసాగుతోంది. పట్టణంలో ప్రధానంగా మూడు కుంటలు తొలగించి వాటిలో మార్కెట్, పోలీస్ స్టేషన్, ఇతర భవనాల నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఎత్తయిన ప్రాంతాల నుంచి వచ్చే వరద పట్టణంలో ప్రవహించి ప్రజా జీవనాన్ని అతలాకుతలం చేస్తోంది. వరద మళ్లింపునకు ప్రత్యేక కార్యాచరణ చేపడితేనే శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. యార్డును అప్‌గ్రేడ్ చేసి కొత్త మార్కెట్ నిర్మాణంపై దృష్టి సారించాలి.

## 6 నెలలు.. రూ.9 లక్షలు



కరీంనగర్ : స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా కరీంనగర్‌లో సకల సౌకర్యాలతో నిర్మించిన సమీకృత మార్కెట్ ఉపయోగంలోకి రావడం లేదు. అమ్మకందారులు, కొనుగోలుదారులు వస్తారనే ఉద్దేశంతో సీసీ రోడ్లతోపాటు లోపల ఫ్యాన్లు, లైట్లు బిగించారు. ఈ మార్కెట్‌కు వస్తే కూరగాయలతోపాటు మాంసం, చికెన్, చేపలు, కిరాణం, పూలు, పండ్లు వంటివి నచ్చిన వారికి నచ్చినవి కొనుగోలు చేసుకునేలా తీర్చిదిద్దారు. స్టాళ్లకు, దుకాణాలకు లక్కీడ్రా నిర్వహించగా.. కొన్ని నెలల కిందట దక్కించుకున్న వారితో ఒప్పందం కూడా చేశారు. వీరంతా వ్యాపారాలు చేసుకోవడానికి అవకాశం ఉండటంతో నగరపాలక అధికారులు విద్యుత్తు సౌకర్యం కల్పించారు. దీనికోసం రూ.లక్షల్లో డిపాజిట్ చెల్లించి విద్యుత్తు నియంత్రిక, కనెక్షన్ ఇప్పించారు.

**పైసా..పైసా వసూలు చేసి..**

మరో వైపు నగరంలో ఆదాయం పెంచుకోవడానికి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అష్టకష్టాలు పడుతున్నారు. సర్వేల పేరుతో వివిధ రకాల పన్నులు, ఇతర మార్గాల ద్వారా వచ్చే అన్ని రకాల ఫీజులను ప్రజల నుంచి వసూలు చేస్తున్నారు. ఇలా వసూలు చేసిన డబ్బులు వినియోగంలో లేని భవనాల విద్యుత్తు బిల్లులాంటివి చెల్లించాల్సి రావడం.. ప్రజలు చెల్లించే పన్నులు వృథా అవుతున్నాయి.

**నెలకు రూ.1.50 లక్షల బిల్లు..**

సమీకృత మార్కెట్‌లో విద్యుత్తు సౌకర్యం కోసం హెచ్‌టీ కనెక్షన్‌తో విద్యుత్తు నియంత్రిక బిగించారు. దీనిని ఉపయోగించిన, ఉపయోగించకపోయినా నెలకు రూ.1.50 లక్షల బిల్లు వస్తోంది. ఇలా ఆరు నెలలుగా రూ.9 లక్షల బిల్లు వస్తోంది. ఎలాంటి వినియోగం లేకపోయినా బల్దియా మాత్రం కరెంట్ బిల్లు మాత్రం చెల్లించక తప్పడం లేదు.

రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన సమీకృత మార్కెట్ ఉందనే విషయాన్ని ప్రచారం చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. దుకాణాలు దక్కించుకున్న వారిని కచ్చితంగా కూర్చొనేలా ప్రోత్సహించాలి. ఇక్కడ అన్ని రకాల సరకులు దొరుకుతాయని ప్రజలకు అవగాహన కల్పించి.. రప్పించాలి.

నిర్మాణానికి వెచ్చించిన వ్యయం: రూ.16.50 లక్షలు

నిర్మించిన స్టాల్స్ : 114

## ఆ వార్డులో..29 ఓట్లే

మద్దిరాల : మద్దిరాల మండలంలోని చిననెమిల గ్రామ ఆవాస ప్రాంతాలైన షట్‌రాంతండా, శామ్యూల్‌తండా, గుట్టకాడితండాలను కలిపి గత ప్రభుత్వం 2023 ఆగస్టులో నూతన గ్రామపంచాయతీగా గుట్టకాడితండాను ఏర్పాటు చేసి గెజిట్ విడుదల చేసింది. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోనే అత్యల్ప ఓటర్లున్న ఒకటో వార్డుగా(శామ్యూల్‌తండా) పేరుపొందింది. ఈ వార్డులో పురుషులు 16, స్త్రీలు 13.. మొత్తంగా 29 మంది ఓటర్లు నమోదయ్యారు. 13 రేషన్‌కార్డులున్నాయి. ఇరవై ఏళ్ల క్రితం పెద్దనెమిల కొత్తతండాకు చెందిన బానోత్ శామ్యూల్ అనే అతను నివాసం ఏర్పాటు చేసుకోవడంతో శామ్యూల్ తండాగా ఏర్పాటైంది.

**.. మరి మీ ఇంట్లో..!**

తన ఇంటి ప్రధాన ద్వారం వద్ద ' మా ఇంట్లో ఓట్లు అమ్మబడవు' అనే ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు నారాయణపురానికి చెందిన ఎలకాని రామస్వామి. తాను ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నానని, ఉద్యోగానికి వెళ్లిన సమయంలో ఫోన్‌లో అభ్యర్థులు సంప్రదిస్తుంటే ఇబ్బందిగా మారి ఇలా చేసినట్లు వివరించారు. గ్రామాభివృద్ధికి కృషి చేసే వారికే తాము ఓట్లు వేస్తామని తెలిపారు. **తీరు మారే..!**

కప్పుడు ఎన్నికలంటే గోడ మీద రాతలు, మైకు సెట్ల హోరు ఉండేది.




స్థానిక సంస్థల ఎన్నికలలో ఇది ఎక్కువగా కన్పించేది. నామినేషన్లు వేసిన దగ్గర నుంచి ఎన్నికల సంఘం కేటాయించిన గుర్తుతో చిన్న చిన్న వాహనాల్లో ఊరంతా ప్రచారంతో ఊదర గొట్టేవారు. ప్రస్తుతం కాలం మారింది. పల్లె పోరులోనూ సామాజిక మాధ్యమాలదే పైచేయి అవుతోంది. పార్టీల వారీగా గ్రూపులు ఏర్పాటు చేసి తమ పార్టీ చేసే పనులను, తాను గెలిస్తే చేయబోయే అభివృద్ధిని వివరిస్తూ జోరుగా ప్రచారం చేస్తున్నారు. కొన్ని గ్రామాలలో సామాజిక మాధ్యమాలకు ఇన్‌ఛార్జీలను సైతం నియమించుకున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పలు గ్రామాలలో ఈ పరిస్థితి కన్పిస్తోంది. నామినేషన్ల తేదీల ప్రకటన, ఏరోజు ఏ వార్డులో ఎలాంటి ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారనేది గ్రూపులలోనే వైరల్ చేసి ప్రచారం నిర్వహిస్తున్నారు.

## బెట్టు వీడేదెవరు.. మెట్టు దిగేదెవరు!

సంగారెడ్డి : జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలోని ఓ పంచాయతీలో ఓ సర్పంచి అభ్యర్థి గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉందని గ్రహించిన ఓ నాయకుడు రంగంలోకి దిగి బుజ్జగించారు. ఈ విషయం తెలియడంతో మరో పార్టీ నాయకుడు అదే పంచాయతీలో బరిలో దిగిన మరో అభ్యర్థిని తమ వైపు తిప్పుకొనేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. హత్నూర మండలంలోని ఓ గ్రామంలో మూడు పార్టీల మద్దతు దారులు నామినేషన్లు దాఖలు చేశారు. ఓ పార్టీకి చెందిన నాయకుడు రెండు పార్టీల అభ్యర్థులను ఒత్తిడి చేసి నామినేషన్లు ఉపసంహరించుకునేలా బుజ్జగిస్తున్నారు. దీంతో ఆయా అభ్యర్థులు ఆలోచనలో పడిపోయారు.

**పోరులో నువ్వానేనా?**

జిల్లాలో తొలి విడతలోని గ్రామాల్లో పోరు నువ్వా, నేనా అన్నట్లుగా సాగుతోంది. బాబు తప్పుకో.. మీకు ఏమీ కావాలో ఇస్తాం? భవిష్యత్‌లో మంచి పదవులు కట్టబెడతాం. అంటూ ఆశలు కల్పించి తమ వైపు వచ్చేలా పలువురు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఎన్నికలు పార్టీలకు సంబంధం లేని ఎన్నికలు అయినా ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. పార్టీల గుర్తులు లేకున్నా మద్దతుదారులు బరిలోకి దిగుతుండడం వల్ల ఆయా పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. ఈ పోరులో పోటీ తీవ్రతను తగ్గించేందుకు అభ్యర్థులు



యత్నిస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణ ఈనెల 3తో ముగుస్తుంది. గడువు సమీపించడంతో రహస్యంగా అభ్యర్థులతో బేరసారాలు కుదుర్చుకోవడంలో నిమగ్నమయ్యారు.

**సగటున అయిదుగురు చొప్పున**

తొలి విడతలో సంగారెడ్డి రెవెన్యూ డివిజన్‌లో సంగారెడ్డి, కంది, కొండాపూర్, సదాశివపేట, పటాన్‌చెరు, గుమ్మడిదల, హత్నూర మండలాలున్నాయి. ఈ ఏడు మండలాల్లో పంచాయతీకి, వార్డు స్థానాలకు సగటున అయిదుగురు చొప్పున నామినేషన్లు వేశారు. ఇందులో వీలైనంత మంది పోటీదారులను తప్పించేలా కొంత మంది అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. వార్డు సభ్యులకు కూడా చాలా చోట్ల పోటీ నెలకొంది. దీంతో వారి ఇళ్లకు వెళ్లి బుజ్జగించేలా చేస్తున్నారు. వినకపోతే కొంత నగదు ఇచ్చేందుకు కూడా వెనుకాడడంలేదు.

## ముగిసిన కోటా.. కొనుగోళ్లకు టాటా

ఆదిలాబాద్ : సోయా కొనుగోళ్లపై అయోమయం నెలకొంది.. కేంద్రం కోటా పూర్తవడంతో కొనుగోళ్లను నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మళ్లీ ఆదేశాలొస్తేనే.. కొనుగోళ్లు చేస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులు పడిగాపులు కాస్తున్నారు. పది కేంద్రాల్లో కొనుగోలు చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పటివరకు ఎనిమిదే ప్రారంభించారు. ఇంద్రవెల్లి, ఉట్నూరు కేంద్రాల్లో విక్రయాలు మొదలుకాలేదు.. ఇంతలోనే కోటా పూర్తయిందని మొత్తం కేంద్రాలను మూసేశారు. జిల్లాలో గతేడాదితో పోలిస్తే సోయా సాగు బాగా తగ్గింది. అయితే కాత దశలో వర్షాలు కురవడంతో పంట దెబ్బతింది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.5328 ఉంది. ప్రైవేట్‌లో క్వింటాలుకు రూ.4,500లకు మించి లేదు.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పలు ఆంక్షల కారణంగా ఎక్కువ మంది రైతులు విక్రయించుకోలేకపోయారు.. కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలో 1.20 లక్షల క్వింటాళ్ల సోయాను విక్రయించుకునేందుకు అనుమతిచ్చింది.. ఈ కోటా ఇప్పుడు పూర్తవడంతో విక్రయాలను నిలిపివేశారు. సోయా పంట నాణ్యత లేకపోవడంతో చాలా మంది రైతులను వెనక్కు పంపించారు.

జమకాని డబ్బులు

సోయాను విక్రయించిన రైతులకు వారం రోజుల్లో డబ్బులు జమచేయాలి. ఇప్పటివరకు రైతుల నుంచి రూ.63.68 కోట్ల విలువైన సోయాను కొనుగోలు చేయగా, కేవలం రూ.10.49 కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయి.. ఈ విషయమై మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డిని వివరణ కోరగా, కేంద్రం నుంచి అదనపు కోటా వచ్చిందని, కొన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు తిరిగి ప్రారంభిస్తామని అన్నారు.

సాగు : 60వేల ఎకరాలు

కొనుగోలు కేంద్రాలు : 10

తెరిచినవి : 08

ఇప్పటివరకు చేసిన కొనుగోళ్లు : 1.20 లక్షల క్వింటాళ్లు

విక్రయించిన రైతులు : 5,378

రైతులకు ఇవ్వాల్సిన నగదు : రూ. 63.68 కోట్లు

మంజూరు : 10.49 కోట్లు

ఇంకా చెల్లించాల్సింది : 53.19 కోట్లు

## సంకల్పానికి.. ఆటంకం

ఆదిలాబాద్ : నవజాత శిశు మరణాలను గణనీయంగా తగ్గించటానికి కేంద్ర ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి 'సంకల్ప్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఐసీఎంఆర్(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) ఆధ్వర్యంలో రెండేళ్లుగా తగిన చర్యలు తీసుకుంటోంది. దీంతో 2023-24లో నవజాత శిశు మరణాల రేటు 24 నుంచి ప్రస్తుతం 17కి తగ్గింది. శిశు మరణాలను సింగిల్ డిజిట్‌కు తీసుకెళ్లాలనేది లక్ష్యం.. కానీ, అవసరమైన సిబ్బంది, పరికరాలు లేకపోవడం ఆటంకంగా మారింది.

ఎస్ఎన్‌సీయూలో పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవటంతో రిమ్స్ పిల్లల వార్డు నుంచి ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లను, ఇద్దరు సీనియర్ రెసిడెంట్ వైద్యులకు ఎస్ఎన్‌సీయూలో విధులను కేటాయించారు. ఎప్పుడూ అత్యంత రద్దీగా ఉండే పిల్లల వార్డులో చికిత్స అందించటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. వార్డులో 60 పడకలను గాను నిత్యం 70కి పైగా చిన్నారులు చికిత్స పొందుతుంటారు. 24 గంటల పాటు వార్డులో చిన్నారులకు వైద్య సేవలు అందించటంతో పనిభారం పెరిగి మెరుగైన వైద్యం అందించటం కష్టతరంగా మారిందంటున్నారు. ఎస్ఎన్‌సీయూలో ఎన్‌హెచ్ఎం స్టాఫ్‌నర్సులు 10 మంది, రిమ్స్ నుంచి ఒకరు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కాన్పుల విభాగంలో ఐసీఎంఆర్ నుంచి నియమితులైన స్టాఫ్‌నర్సులు కేవలం అయిదుగురు మాత్రమే ఉన్నారు. ప్రతి రోజు 30 వరకు.. రిమ్స్ ఎస్ఎన్‌సీయూలో ప్రతి రోజు 25 నుంచి 30 మంది నవజాత శిశువులు చికిత్స పొందుతుంటారు. వివిధ రుగ్మతలతో పుట్టిన వారితోపాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులను సైతం ఇక్కడికే తీసుకొస్తారు. దీంతో ఆ వార్డులో చిన్నారుల సంఖ్య వార్మర్ల కంటే ఎక్కువగా ఉంటోంది.

# విలీనం వడివడి.. నేతల్లో 'అలజడి'

హైదరాబాద్ : బల్దియాలో శివారు ప్రాంతాల విలీనం వడివడిగా జరిగిపోతోంది. రోజుల వ్యవధిలోనే ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించడం జరిగిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం అధికార ఉత్తర్వును జారీ చేయడమే తరువాయి. అయితే శివారు ప్రాంతాలను ఎందుకు విలీనం చేస్తున్నారు, ఆనక ఏం చేయబోతున్నారనే ప్రశ్నకు ప్రభుత్వం నుంచి సమాధానం లేదు. విలీనం ఉద్దేశం, అభివృద్ధి ప్రణాళికలను వివరించకపోవడంతో ప్రజలు అయోమయంలో పడ్డారు. మరోవైపు.. తమ రాజకీయ పదవులు మూడోవంతుకు తగ్గిపోనున్నాయని నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వాటి ఆదాయం అంతంతే..**



ఆస్తిపన్ను రూపంలో 20 మున్సిపాలిటీలు, 7 నగరపాలక సంస్థల వార్షిక ఆదాయం మొత్తం రూ.602 కోట్లు. జీహెచ్ఎంసీ ఖాతాలో ఏటా రూ.2 వేల కోట్లు జమవుతుంది. అంతంతమాత్రం ఆదాయమున్న శివారు ప్రాంతాల్లో.. జీహెచ్ఎంసీతో సమానంగా అభివృద్ధి జరుగుతుందా అనే ప్రశ్న స్థానికులను వేధిస్తోంది. అక్కడ సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలు అంతగా లేవని, గ్రేటర్‌లో కలిపేస్తే అభివృద్ధి గురించి ఎవరినడగాలనే సందేహం వారిది.

**పదవులపై కలవరం**

పంచాయతీలు, మున్సిపాలిటీల్లో సర్పంచులు, వార్డు సభ్యులను ప్రజలు నేరుగా ఎన్నుకునేవారు. విలీన ప్రక్రియతో పంచాయతీలు, పదవులన్నీ పోయాయి. ఇప్పుడు యూఎల్‌బీల వంతు. ప్రతి 4 వేల మందికి ఓ వార్డు సభ్యుడు ఉండే స్థానిక సంస్థలను, ప్రతి 96 వేల మందికి ఓ డివిజన్ ఉండే జీహెచ్ఎంసీలో కలిపేస్తుండటంతో.. 598 వార్డులున్న 27 స్థానిక సంస్థల్లో 75% పదవులు గల్లంతవుతాయని నేతలు ఆందోళన చెందుతున్నారు.

# థీమ్ పార్కుకు తాళం

హైదరాబాద్ : జలమండలి ఆధ్వర్యంలో రూ. 4 కోట్లు వెచ్చించి నగరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన థీమ్ పార్కు మూతపడింది. నాలుగేళ్ల క్రితం దీన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. వాననీటి సంరక్షణ, భూగర్భజలాల పెంపు, ఇంకుడుగుంతల ఆవశ్యకత తదితర అంశాలపై అవగాహన కలిగించేలా.. సంబంధిత పార్కును జూబ్లీహిల్స్‌లో అందుబాటులోకి తెచ్చారు. ప్రధానంగా ఆసక్తి ఉన్న వివిధవర్గాల ప్రజలు, స్వచ్ఛందసేవా సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు



దీన్ని సందర్శించే వారు. ఈ సందర్భంగా.. వాననీటి సంరక్షణ కోసం తీర్చిదిద్దిన వివిధ మోడళ్లను పరిశీలించేవారు. డిస్‌ప్లే గ్యాలరీ, యానిమేషన్ సెంటర్, తాగునీటిని శుద్ధి చేయడం, సీవేజ్ ట్రీట్‌మెంట్‌లపై త్రీడీ షోల ద్వారా అవగాహన కలిగించడంతో పాటు వాననీటి సంరక్షణకు సంబంధించిన వీడియోగేమ్స్‌నూ వారికి అందుబాటులో ఉంచారు. స్థానిక ఆడిటోరియంలో పలు అంశాలపై షార్ట్‌ఫిల్మ్‌లను సైతం ప్రదర్శించేవారు. ఇన్ని విశేషాలున్న ఈ థీమ్ పార్కు గేటుకు రెండేళ్లుగా తాళాలు వేసి ఉంచారు. దీంతో లోపల చేపట్టిన ఏర్పాట్లన్నీ క్రమంగా పాడైపోతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

# ధనాగారం..!

నల్గొండ: అన్నదాతలు పండించే వరి ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు రంగాలకు ఉపాధి కల్పిస్తోంది. మిల్లర్లు, ఇటుక బట్టీ వ్యాపారులు, మద్యం తయారీ సంస్థలు, తవుడు నూనె సంస్థలు (రైస్‌బ్రాన్ ఆయిల్)తో పాటు చిరు వ్యాపారులకు కల్పతరువులా మారింది.

ఉమ్మడి జిల్లాలో 270 వరకు రైస్‌మిల్లర్లు ఉండగా.. అందులో వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. మిల్లింగ్ అనంతరం వృథాగా పారవేసే ధాన్యం పొట్టు, ఉడకబట్టే క్రమంలో వెలువడే నూకలు ఇవన్నీ ఆర్థిక వనరులు కల్పిస్తున్నాయి. ఇటుకలు కాల్చేందుకు ఊక, మద్యం తయారీ సంస్థలకు నూకలు, బియ్యం రవాణాతో లారీలు నడిపించే వారికి ఉపాధి కలుగుతుంది. లోడింగ్, అన్‌లోడింగ్ వల్ల హమాలీ కార్మికులకు భరోసా ఉంటోంది.

రూపాంతరం చెందే క్రమం ఇలాబియ్యం మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద క్వింటాల్ ధాన్యానికి 67 కిలోల ముడి బియ్యాన్ని, బాయిల్డ్ మిల్లుల వారు 68 కిలోల మేర ఉడకబెట్టిన బియ్యాన్ని భారత ఆహార సంస్థ(ఎఫ్‌సిఐ)కు అప్పగించాల్సి ఉంటుంది. వరిలో పొట్టుశాతం 25 శాతంగా ఉంటుంది. వరి బరువులో 25 శాతం పొట్టు బరువుగా అంచనా వేస్తారు. బాయిల్డ్ రైస్ విషయానికొస్తే ఒక కిలోలో దాదాపు 1.67 క్యూబిక్ మీటర్ల మేర ఆవిరి రూపంలో బరువు ఆక్రమిస్తుంది. ధాన్యాన్ని మరాడించే క్రమంలో పూర్తి బియ్యం గింజ పొడవులో 75 శాతం కంటే తక్కువగా గింజలుంటే నూకలుగా పరిగణిస్తారు. మిగిలిన 33 కిలోల మేర మిల్లర్లు పొట్టు, తవుడు, ఊక, ఆవిరి, నూకల రూపంలో భరించాల్సి ఉంటుంది. వీటిని అదనపు ఆదాయంగా పరిగణించి విక్రయించుకుంటున్నారు.

మరాడించిన తర్వాత లభ్యమయ్యే రకం బహిరంగ మార్కెట్‌లో ధర(రూ.టన్నుల్లో)బియ్యం 6,000 (క్వింటాల్‌కు)

ఊక 4,200నూక 2,500 తవుడు 3,100 పొట్టు 4,000 (ట్రాక్టర్‌కు)

# నిమ్స్‌లో సేవలు జెమ్స్




హైదరాబాద్: నిమ్స్‌లో ఈ ఏడాది కొత్తగా మరిన్ని ఆధునిక సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటికే 30 విభాగాల రోగులకు సూపర్‌స్పెషాలిటీ సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా కార్డియాలజీ, కార్డి యో థొరాసిక్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, యురాలజీ, నెఫ్రాలజీ, మెడికల్, సర్జికల్ ఆంకాలజీ, జనరల్ మెడిసిన్, న్యూరాలజీ తదితర విభాగాల్లో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా సేవలు అందిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులతో పోల్చితే చాలా తక్కువ ఖర్చుకే సేవలు లభిస్తుండటం.. ఆరోగ్యశ్రీలో పేదలకు ఉచిత చికిత్సలతో తెలుగు రాష్ట్రాల నుంచి అనేక మంది వస్తుంటారు. దీంతో మరో 2 వేల పడకలను పెంచేందుకు అదనపు భవనాల నిర్మాణం జరుగుతోందని డైరెక్టర్ డా.బీరప్ప తెలిపారు.ఆధునిక

**సేవలు ఏంటంటే..**

ఇంటర్వెన్షనల్ రేడియాలజీ: పేగులు, గుండె, రక్తనాళాలు, ఊపిరితిత్తుల్లో ఇబ్బందులు ఏర్పడినప్పుడు అతి చిన్న కోతతో చికిత్స అందిస్తారు. తక్కువ రక్తస్రావం, నొప్పి లేకుండా త్వరగా కోలుకుంటారు. క్రిటికల్ కేర్ మెడిసిన్: తీవ్ర అనారోగ్యం, ప్రమాదాల్లో గాయపడటం, గుండె వ్యాధులకు అత్యవసర పరిస్థితిలో వెంటిలేటర్, ఆక్సిజన్ మద్దతు వంటి వాటిని అందిస్తారు. ప్రాణాలను రక్షించడంతో ముఖ్యమైన పాత్ర ఈ విభాగానిదే.

న్యూరో అనస్థీషియా: నాడి వ్యవస్థతో సంబంధం ఉన్న భాగాల్లో నొప్పి తగ్గించడానికి ఉపయోగిస్తారు. మెదడు, వెన్నుపూస, వెన్ను భాగాల్లో శస్త్రచికిత్సలు, అవయవ మార్పిడి సందర్భంగా వాడతారు.

హెడ్ అండ్ నెక్ ఆంకాలజీ: పొగాకు, తంబాకు, ఖైనీ, పాన్ మసాల, గుట్కాల వినియోగంతో నోటి, గొంతు క్యాన్సర్లకు నిమ్స్‌లోని ఈ విభాగంలో నాణ్యమైన సేవలు అందిస్తున్నారు.

ఆంకో పాథాలజీ: క్యాన్సర్ సంక్రమణ, ఆటో ఇమ్యూన్, కిడ్నీ, కాలేయ వ్యాధుల నిర్ధారణకు ఉపయోగపడుతుంది. నమూనాలను సూక్ష్మదర్శిని ద్వారా పరిశీలించి నిర్ధారించడంలో ఈ విభాగం కీలకం.

# స్థానికంపై నిఘా నేత్రాలు



వికారాబాద్: పంచాయతీ ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు పరిచేందుకు అధికారులు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేశారు. నగదు, మద్యం అక్రమ రవాణాతోపాటు తాయిలాల పంపిణీకి ఈ బృందాలు అడ్డుకట్ట వేస్తాయి. సరిహద్దులోని తనిఖీ కేంద్రాల్లో ఇప్పటికే సంబంధిత అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే వారిని క్షుణ్నంగా పరిశీలిస్తున్నారు.

**ఏవైనా ఫిర్యాదులుంటే..**

ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకురాలిగా షేక్ యాస్మిన్‌బాషా నియమితులయ్యారు. నామపత్రాల దాఖలు ప్రక్రియ నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ఆమె పర్యవేక్షిస్తారు. ఏవైనా ఫిర్యాదులుంటే ఆమె చరవాణి నెంబరు 8416235291కు ఫోన్ చేసి చెప్పొచ్చు.

**ఎంసీఎంసీ బృందం..**

మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ బృందాన్ని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ప్రచారానికి అనుమతులు జారీ, చెల్లింపు వార్తలపై నిఘా ఉంచుతారు. నియమావళిని అతిక్రమించి సోషల్ మీడియాలో పోస్టులు, షేర్ చేయడాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటారు.

**వ్యయ పరిశీలకులు..**

ఎన్నికల వ్యయ పరిశీలకులుగా రమేశ్‌కుమార్ నియమితులయ్యారు. ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు వివిధ రకాలుగా చేస్తున్న వ్యయంపై దృష్టి సారిస్తారు. ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ఖర్చు చేస్తున్నారా.. లేదా.. అనే అంశాలపై దృష్టి సారిస్తారు.

**ఫ్లయింగ్ స్క్వాడ్..**

కోడ్ ఉల్లంఘనను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలిస్తాయి. అభ్యర్థులు, మద్దతుదారుల సమావేశాలు, ప్రచారాలపై నిఘా ఉంచుతారు. అనుమతి ఉందా.. లేదా.. చూస్తారు. మద్యం, డబ్బు పంపిణీని అడ్డుకుంటారు. మండలానికో బృందం ఏర్పాటు చేశారు.

**సర్వైలెన్స్ నజర్..**

జిల్లా సరిహద్దులోని ఏడు చెక్‌పోస్టుల్లో నిఘా ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వెంట రూ.50వేల కంటే ఎక్కువ నగదు ఉంటే స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు సీజ్ చేస్తాయి. నగదుకు ఆధారాలు చూపితే తిరిగి ఇస్తారు.

# గుట్టలు తవ్వేసి.. కట్టలు మేసి!



తాండూరు : తాండూరులో ప్రభుత్వ పరిధిలోని మట్టి గుట్టలన్నీ కనుమరుగవుతున్నాయి. ఇప్పటికే 20 ఎకరాలకుపైగా గుట్టలు భూమికి సమాంతరంగా మారాయి. ఇంకా వందల ఎకరాల్లో విస్తరించిన వాటిని అదను చూసి తవ్వేస్తున్నారు. రాజకీయ అండదండలున్న వ్యాపారులే ఈ తంతు కొనసాగిస్తున్నారు. యంత్రాలతో తవ్వి లారీల ద్వారా నిర్ణీత ప్రాంతాలకు తరలించి రూ.కోట్లలో సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వానికి మాత్రం ఆదాయం సమకూరడం లేదు. అయిదేళ్లుగా తంతు కొనసాగుతున్నా అధికారుల్లో చలనం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చినప్పుడు మాత్రమే లారీలు, యంత్రాలను జప్తు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు.. తరవాత అటువైపే చూడడం లేదు. దీంతో అక్రమార్కులు యథావిధిగా కొనసాగిస్తున్నారు. లారీ మట్టిని డిమాండ్‌నుబట్టి రూ.5వేల వరకు విక్రయిస్తున్నారు. రోజూ 100- 200 ట్రిప్పులు తరలిస్తున్నారు.

**అనుమతుల్లేకుండానే..**

ప్రభుత్వ, పట్టా భూముల్లో మట్టి తవ్వాలంటే రెవెన్యూ, గనులు, పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి, అటవీశాఖ అనుమతులు తప్పనిసరి. ఇవేవీ లేకుండానే వ్యాపారులు నచ్చిన మట్టి గుట్టల వద్దకు నేరుగా యంత్రాలతో వెళుతున్నారు. మట్టి తవ్వి వెంచర్ల యజమానులు, రహదారులు నిర్మించే గుత్తేదారులకు, ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్నారు. మట్టి త్వకాలకు అనుమతులు పొందాలంటే భూ విస్తీర్ణాన్నిబట్టి రూ.కోట్లలో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అనుమతుల్లేకుండానే తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. తాండూరు పట్టణ శివారులోని హైదరాబాద్ రోడ్డు వారగా ఉన్న కందనెల్లి, ఖాంజాపూరు గుట్టలు పదెకరాల్లో విస్తరించి ఉన్నాయి. ఇప్పటికే నాలుగెకరాలను తవ్వేశారు. తాండూరు బైపాస్ రోడ్డు దగ్గరున్న తండాకు చెందిన గిరిజనులకు ప్రభుత్వం గుట్టలపై భూమి కేటాయించింది. అనువైన భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నారు. పనికిరాని భూమిని కొందరు అక్రమార్కులు రాజకీయ నాయకుల అండదండలతో తవ్వి మట్టి విక్రయిస్తున్నారు. తాండూరు బైపాస్ రోడ్డు వారగా ఎత్తయిన మట్టి గుట్ట ఉంది. ఓ నాయకుడు తవ్వి మట్టిని ఎన్‌హెచ్ నిర్మాణ పనులు చేస్తున్న గుత్తేదారుకు విక్రయిస్తున్నాడు. యాలాల మండలం తిమ్మాయిపల్లిలోని గుట్ట భూములు మట్టి తవ్వకాలతో అసలు స్వరూపాన్ని కోల్పోయాయి.

**జాతీయ రహదారి నిర్మాణానికి తరలిస్తే ఆదాయం..**

– సత్యనారాయణ, గనుల శాఖ సహాయ సంచాలకుడు, తాండూరు

గుట్టల నుంచి జాతీయ రహదారి నిర్మాణానికి తరలిన మట్టి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. మిగిలిన ప్రదేశాలకు మట్టి తరలితే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా ఎవరూ తవ్వరాదు.

# మూత్రపిండం.. ప్రాణ గండం

పెద్దపల్లి : ఆహార అలవాట్లలో మార్పులు, మధుమేహం, మద్యపానం, జన్యుపరమైన లోపాలమూలంగా మూత్రపిండాలు దెబ్బతింటున్నాయి. శరీరానికి కావాల్సిన మోతాదులో నీరు తీసుకోకపోవడం, ఇతర వ్యాధుల ప్రభావం, ఇష్టారీతిగా మందుల వాడకంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఫలితంగా జిల్లాలో వ్యాధిగ్రస్థుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది.

**కారణాలు ఇవి..**

మూత్రనాళం చిన్నదిగా ఉండటం.

ఎక్కువసేపు మూత్ర విసర్జన చేయకుండా ఆపుకోవడంతో ఇబ్బందులు.

చాలా మంది నీటిని చాలా తక్కువ పరిమాణంలో తాగుతుంటారు.

అధిక బరువు, శరీరంలో ఇన్‌ఫెక్షన్లు.

నెలకు వెయ్యికిపైగా అనుమానితులు

జిల్లా టీ డయాగ్నొస్టిక్ కేంద్రాల్లో మూత్రపిండాలకు సంబంధించి నెలకు సగటున 1,106 పరీక్షలు చేయడంతో చాలా మందికి పాజిటివ్‌గా తేలడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా ఆసుపత్రి, గోదావరి ఖని సార్వజనిత, మంథని ఆసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలున్నాయి.



ఒక్కో కేంద్రంలో అయిదు బెడ్(మంచాలు) అందుబాటులో ఉండగా చికిత్స అందిస్తున్నారు. జిల్లాలో 86 మంది రోగులకు రక్తశుద్ధి చేస్తున్నారు. కరీంనగర్, ఇతర పట్టణాల్లో ప్రైవేటుగా రెట్టింపు స్థాయిలో చికిత్స పొందుతున్నారు.

**ఇలా చేస్తే మేలు**

అలసట, బలహీనత ఇతర సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలి.

ఎక్కువ నీరు తీసుకోవడం, మద్యపానం, ఇతర వ్యసనాలకు దూరం.

మధుమేహం, బీపీ ఉంటే తరచూ కిడ్నీ పరీక్షలు చేసుకోవాలి.

ఉప్పు తగ్గించాలి, సొంతంగా నొప్పి మాత్రలు వాడకూడదు.

**లక్షణాలుంటే సంప్రదించాలి**

తరచూ మాంసాహారం తీసుకోవడం. కాలుష్యం, మధుమేహం, రక్తపోటుతో కిడ్నీ సమస్యలు ఏర్పడుతున్నాయి. బయటి ఆహారాన్ని పూర్తిగా మానేయాలి. అధికంగా మంచి నీరు తాగాలి. వైద్యుల సలహాలు పాటించి పరీక్షలు చేయించుకోవాలి. డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఫిజీషియన్ ప్రభుత్వ ఆసుపత్రి, పెద్దపల్లి

# భవనాల 'పంచాయితీ'!

పెద్దపల్లి : జిల్లాలో చాలా గ్రామ పంచాయతీలను కార్యాలయ భవనాల సమస్య వేధిస్తోంది. సొంత భవనాలు లేకపోవడం, అద్దె గదులు, పాఠశాలలు, అంగన్‌వాడీల్లో కొనసాగించాల్సి రావడం, పైగా అరకొర సౌకర్యాలు వంటి పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో పరిశీలన కథనం.

**ఇదీ పరిస్థితి** రాచర్ల బాకురుపల్లి, జై సేవాలాల్ తండాల్లో అద్దె భవనాల్లో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. కిష్టునాయక్‌తండా, గుంటపెల్లిచెరువు తండాల్లో శాశ్వత భవన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. బండలింగంపల్లి, తిమ్మాపూర్, నారాయణపూర్, అక్కపల్లి, సింగారం కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

గోపాల్‌పల్లెలో భవన నిర్మాణం చేపట్టకపోవడంతో అద్దె భవనంలో కార్యాలయం కొనసాగుతోంది.

గొల్లపల్లిలో భవనం శిథిలావస్థకు చేరుకోగా పాఠశాలలో నిర్వహిస్తున్నారు. చిక్కుడోనిపల్లెలో అంగన్‌వాడీ కేంద్రంలో.. దాచారంలో రైతు వేదికలో కొనసాగుతున్నాయి.

వెంకట్రావుపల్లిలో భవనం శిథిలావస్థకు చేరగా రెండున్నరేళ్ల క్రితం కూల్చివేశారు. కొత్త భవన నిర్మాణం పిల్లర్ల దశ దాటడం లేదు. ప్రతి నెల అద్దె చెల్లింపు గ్రామ పంచాయతీకి భారంగా మారింది.

పాఠశాలలోనే..

మండలంలోని లక్ష్మీపూర్ పంచాయతీ భవన నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో ఏడేళ్లుగా పాఠశాల భవనంలోనే కొనసాగుతోంది. పొన్నాలపల్లెలో



భవనం నిర్మించినా ప్రారంభానికి నోచుకోలేదు.

**అద్దె భవనమే దిక్కు**

జైసేవాలాల్ కమ్మర్‌పేటతండాలో అద్దె భవనంలో.. అజ్మీరాతండాలో కమ్యూనిటీ భవనంలో.. భూక్యారెడ్డితండాలో మహిళా సంఘం.. ఊరుతండాలో మత్స్యశాఖ భవనంలో కొనసాగుతున్నాయి.

అంగన్‌వాడీ కేంద్రంలో.. తుర్కాషినగర్‌లో సొంత భవనం లేదు. అంగన్‌వాడీ కేంద్రంలో ఒక గదిని పంచాయతీ కార్యాలయంగా వినియోగిస్తూ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

ఎన్నాళ్లిలా.. మండలంలో కొత్తగా ఏర్పాటైన గిరిజన గ్రామ పంచాయతీలకు ఈజీఎస్ నిధులతో పక్కా భవనాలు మంజూరయ్యాయి. మెజారిటీ గ్రామాల్లో పనులు పూర్తికాలేదు. భూక్యతండాలో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

# సిరిసిరి పల్లెలు

కొత్తగూడెం : కొన్ని పల్లెలు ఆదాయ వనరుల్లో పట్టణాల్ని తలపిస్తున్నాయి. భౌగోళిక సంపద, చారిత్రక ప్రాధాన్యం, రవాణా మార్గాలు వీటికి అనుకూలంగా మారాయి. భారీ పరిశ్రమలు, మైనింగ్, వాణిజ్య కార్యకలాపాలు వంటి వాటి ద్వారా వచ్చే పన్నులు, సీనరేజీ, అద్దెలతో అవి సిరి పల్లెలుగా మారుతున్నాయి. ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులకు ఇవి అదనపు బలాలుగా మారాయి. బాధాకర విషయం ఏంటంటే దండిగా నిధులున్నా పెద్ద పంచాయతీల్లో దీర్ఘకాలికంగా సమస్యలు వేధిస్తున్నాయి. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ధనిక పంచాయతీలు, లోటుపాట్లపై ప్రత్యేక కథనం.అభివృద్ధిలో వెనుకబాటు

అంగట్లో అన్నీ ఉన్నా అన్నట్టు.. ధనిక పంచాయతీలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధించలేకపోతున్నాయి. రికార్డుల్లో పనులు చూపించడం, నాణ్యతలేమి వంటివి ప్రతికూలతలుగా మారాయి. నిధులను దీర్ఘకాలిక లక్ష్యాల కోసం వినియోగించడంలో పాలకులకు ప్రణాళికలు లేకుండాపోయాయి. గ్రామసభలు సరిగా నిర్వహించకపోవటంతో నిధుల కేటాయింపు, వినియోగంలో ఏకపక్ష నిర్ణయాలతో గాడితప్పుతోంది.

బూర్గంపాడు మండలంలోని మోరంపల్లి బంజర గ్రామంలో నిర్వహించే సంత ద్వారా సుమారు రూ.40లక్షల ఆదాయం వస్తోంది.

## ముక్కిపోతున్న దొడ్డు బియ్యం

మల్యాల: ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా తెల్ల బియ్యం పంపిణీ చేస్తుండగా అప్పటికే మిగిలిపోయిన దొడ్డు బియ్యాన్ని తీసుకోకపోవడంతో ముక్కిపోయి పిండిగా మారుతోంది. జిల్లావ్యాప్తంగా మండలాల పరిధిలో 592 రేషన్ దుకాణాలున్నాయి. వాటి ద్వారా ప్రతి నెలా 6,400 నుంచి 6,500 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఆరు నెలల కిందటి వరకు డీలర్లకు సరఫరా చేసిన దొడ్డు బియ్యంలో మిగిలిన నిలువలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదు. దీంతో ఆరు నెలలుగా సంచుల్లోనే ముక్కిపోతున్నాయి. కొన్ని దుకాణాల్లో పిండిగా మారుతున్నాయని డీలర్లు పేర్కొంటున్నారు. పౌరసరఫరాల మల్యాల గోదాంలో దాదాపు 600 సంచుల దొడ్డు బియ్యం సంచులు మిగిలిపోయాయి.

**ఒక్కో దుకాణంలో 10 క్వింటాళ్లు**



జిల్లాలో ఒక్కో డీలర్ వద్ద 5–10 క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిలువలు మిగిలిపోయాయి. వాటిని వేలం వేయడం గానీ, ఎఫ్‌సీఐకి అప్పగించడం గానీ చేయకపోవడంతో ముక్కిపోతున్నాయి.

ప్రస్తుతం సరఫరా చేస్తున్న సన్న బియ్యం బస్తాల్లోనూ కొన్ని నాణ్యత లోపించిన దొడ్డు బియ్యం సంచులుంటున్నాయని కొందరు డీలర్లు తెలిపారు. వాటిని వినియోగదారులకు పంపిణీ చేయకుండా పక్కన పెట్టినట్లు పేర్కొంటున్నారు. చాలా గ్రామాల్లో బినామీ వ్యక్తులు దుకాణాలు నిర్వహిస్తున్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం డీలర్ల నియామకం చేపట్టకపోవడంతో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే దుకాణాలు నడుపుతున్నారు. రేషన్ దుకాణాలకు ఎలాంటి బియ్యం సరఫరా అవుతోంది. వినియోగదారులకు పూర్తి స్థాయిలో పంపిణీ జరుగుతోందా? అన్న విషయమై అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికీ గ్రామాల్లో కొందరు రేషన్ వినియోగదారులు సన్న బియ్యాన్ని విక్రయిస్తున్నా అధికారుల నిఘా కొరవడింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

జిల్లాలోని రేషన్ దుకాణాలతో పాటు, పౌరసరఫరాల గోదాముల్లో దొడ్డు బియ్యం సంచుల నిల్వలున్నాయి. వాటిని ఏం చేయాలన్న విషయమై ప్రభుత్వం మాకు ఆదేశాలు జారీ చేస్తే ఆ మేరకు చర్యలు తీసుకుంటాం. –జితేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరా అధికారి

## 'ఆదా'య 'సౌర'భం

జగిత్యాల : సంప్రదాయ విద్యుత్తు వాడకంతో ప్రతి నెలా రూ.వేలల్లో బిల్లు చెల్లించే వారికి పీఎం సూర్యఘర్ పథకం వరంగా మారనుంది. ఏడాది కిందటే పథకం అందుబాటులోకి రాగా జిల్లాలో పలువురు ఇళ్లపై సౌర ఫలకల ఏర్పాటు చేసుకొని డబ్బులు ఆదా చేసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 3,21,776 గృహ విద్యుత్తు కనెక్షన్లున్నాయి. ప్రతి నెలా రూ.2–4 వేల బిల్లులు చెల్లించే వినియోగదారులు పీఎం సూర్యఘర్ పథకం కింద సౌర విద్యుత్తు తయారీపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో వివిధ కేటగిరీలు కలిపి 474 మంది వినియోగదారులు ఫలకలు ఏర్పాటు చేసుకోగా అందులో 312 గృహ కనెక్షన్లున్నాయి. వాణిజ్య కనెక్షన్లలో 131, కేటగిరీ 3లో 10, కేటగిరీ 7లో 21 మంది సౌర విద్యుత్తు ప్యానెళ్లు ఏర్పాటు చేసుకున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సుదర్శన్ తెలిపారు.

వాడకాన్ని బట్టి ప్యానళ్లు

అధీకృత కంపెనీ ద్వారానే సౌర ఫలకలు ఏర్పాటు చేసుకోవాలి. టాటాతో పాటు ఇతర ప్రముఖ కంపెనీలు పీఎం సూర్యఘర్ కింద ప్యానెళ్లు బిగిస్తున్నాయి.

ఎన్ని కిలోవాట్ల విద్యుత్తు అవసరమో ముందుగా ఎలక్ట్రీషియన్‌తో



ఇంటి లోడ్‌ను లెక్కించాలి. నెలకు 200–300 యూనిట్లు వినియోగించుకునే 2 నుంచి 3 కిలోవాట్ల ప్యానళ్లు ఏర్పాటు చేసుకోవాలి. భవిష్యత్తులో ఏసీ బిగించాలనుకొనేవారు 4 కిలోవాట్ల ప్యానళ్లు బిగించుకోవడం మేలు. ఆసక్తి కలవారు పీఎం సూర్యఘర్ పథకం పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

**పూచీకత్తు లేకుండా రుణాలు**

సౌర ఫలకల ఏర్పాటుకు స్వశక్తి సంఘాల సభ్యులకు స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తున్నారు. ఇతరులకు కూడా ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.2 లక్షల వరకు ఇస్తున్నారు. ప్రతి ఇంటికీ సౌర ఫలకలు ఏర్పాటు చేయడమే పీఎం సూర్యఘర్ పథకం ఉద్దేశం. ఇందుకోసం మా శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులను ప్రోత్సహిస్తున్నాం. –సుదర్శన్, ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ

## గుట్టలు మాయం.. ప్రకృతికి గాయం

ధర్మపురి: ధర్మపురి, బుగ్గారం మండలాల్లో కొందరు గుట్టలను కొల్లగొడుతున్నారు. ఎలాంటి మైనింగు, రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా ఎర్ర, ఇతర విలువైన మట్టిని దూర ప్రాంతాలకు గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతోపాటు, ప్రకృతి సహజ సంపద తరలి పోతుందని స్థానికులు వాపోతున్నారు. ప్రతి గ్రామం సరిహద్దుల్లో ఒక చిన్న గుట్ట ఉంది. ఈ గుట్టలు సహజ సంపదతోపాటు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్నాయి. వీటిని సంరక్షించాల్సిన అధికారులు మిన్నకుంటున్నారనే విమర్శలున్నాయి.

కార్యాలయాల ఎదుట నుంచే..అధికారుల కార్యాలయాల ముందు నుంచే ఎర్ర మట్టిని తరలిస్తున్నా.. అధికారుల్లో ఏమాత్రం చలనం ఉండటం లేదని పల్లె ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటుక బట్టీలకు కచ్చితంగా సర్వే నంబర్, రెవెన్యూ, మైనింగ్ ధ్రువీకరణ పత్రాలను స్వీకరించిన తర్వాతే తరలించాల్సి ఉంటుంది. ఇలా కాకుండా ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. అలాగే ధర్మపురి పరిధి మారుమూల గ్రామాలైన తీగల ధర్మారం, దొంతాపూర్, మగ్గిడి, జైన, ఆరెపల్లి ప్రాంతాల్లోని గుట్టలను గుత్తేదార్ల దాహానికి మాయమవుతున్నాయి.

రాత్రిళ్లు గుట్టుగా..నేరెళ్ల, వెల్గొండ ప్రాంతాల్లోని గుట్టల వద్ద లభ్యమయ్యే ఎర్రమట్టిని రాత్రిళ్లు జేసీబీలు పెట్టి వాహనాల్లో తరలిస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు, నిఘా పెట్టడంలేదు. రహదారుల నిర్మాణానికి, ఇతర ప్రభుత్వ, ప్రజా అవసరాలకు వినియోగించినా పర్వాలేదు. అయితే వ్యక్తిగత స్వలాభానికి విక్రయిస్తున్నారు.

# రుణాలకు.. కొత్త మెలిక

రాయికల్ : దేశ ఆర్థిక వ్యవస్థలకు వెన్నుముకగా నిలుస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎమ్ఎస్ఎమ్ఈ) అభివృద్ధికి కేంద్రం తీసుకువచ్చిందే ఉద్యమ్ రిజిస్ట్రేషన్. వ్యాపారవేత్తలు తమ సంస్థలకు సులభంగా, ఉచితంగా, పేపర్‌లెస్ విధానంలో అధికారిక గుర్తింపు పొందడానికి ఇది ఉపయోగపడుతుంది. ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌తో ఎమ్ఎస్ఎమ్ఈలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక, చట్టపరమైన, పరిపాలనపరమైన ప్రోత్సాహకాలు పొందుతారు.

**తక్కువ వడ్డీ ప్రయోజనాలు**

దీనివల్ల ప్రభుత్వ పథకాల ద్వారా హామీ లేని రుణాలు, వడ్డీ రేట్లలో రాయితీ లేదా తక్కువ వడ్డీ వంటి ప్రయోజనాలు సమకూరుతాయి. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ అనేది ఎమ్ఎస్ఎమ్ఈ మంత్రిత్వ శాఖ ద్వారా అందించబడే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ. ఈ ప్రక్రియ ఆధార్, పాన్‌కార్డు అనుసంధానంపై ఆధారపడి ఉండగా.. రిజిస్ట్రేషన్ పూర్తయిన అనంతరం ఆయా సంస్థలకు ఒక శాశ్వత ప్రత్యేక గుర్తింపు సంఖ్య, ధ్రువీకరణ పత్రం లభిస్తుంది. బల్దియా పరిధిలో నమోదైన స్ట్రీట్ వెండర్స్‌కు, ముద్ర రుణాల దరఖాస్తుదారులు, వ్యాపారం కోసం పీఎంఈజీపీ వంటి పథకాల్లో బ్యాంకు రుణాలు తీసుకునేవారికి ఉద్యమ్ ఆధార్ తప్పనిసరిగా కలిగి ఉండాలని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు.

**ఆన్‌లైన్ నమోదు విధానం**

%https:///www.udyamregistration.gov.in/Governm ent-India/Ministry-MSME-registration.htm% అనే హోమ్ పేజీలో 'ఫర్ న్యూ ఎంటర్‌ప్రెన్యూర్స్ హూ ఆర్ నాట్ రిజిస్టర్డ్ యెట్ యాస్ ఎమ్ఎస్ఎమ్ఈ' అనే ఆప్షన్ ఎంచుకొని ఆధార్ నంబర్, పేరు నమోదు చేసి జనరేట్ ఓటీపీ బటన్ ఎంచుకోవాలి. రిజిస్టర్డ్ మొబైల్‌కు వచ్చిన ఓటీపీని నమోదుచేసి వాలిడేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి.

వ్యాపార సంస్థ రకాన్ని ఎంచుకొని పాన్ నంబర్ నమోదు చేయగానే ధ్రువీకరణ జరుగుతుంది. అనంతరం చరవాణి నంబర్, మెయిల్ ఐడీ, సామాజిక వర్గం, జెండర్, వ్యాపార సంస్థ పేరు, చిరునామా, సంస్థ రిజిస్ట్రేషన్ వివరాలు, నిక్(నేషనల్ ఇండస్ట్రియల్ క్లాసిఫికేషన్) కోడ్, పెట్టుబడి వివరాలు తదితర నమోదు చేయాలి. అన్ని వివరాలు సరి చూసుకున్న తర్వాత సబ్మిట్ అండ్ గెట్ ఫైనల్ ఓటీపీ బటన్‌పై క్లిక్ చేయాగానే వచ్చిన ఓటీపీ నమోదు చేసి క్యాప్చా కోడ్ ఎంటర్ చేయాలి. అనంతరం దరఖాస్తు సమర్పించాలి. దరఖాస్తు సమర్పించగానే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ నంబర్(యుఆర్ఎన్) చూపిస్తోంది. నమోదుచేసిన మెయిల్ ఐడీకి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ వస్తుంది.

# ఇకనైనా కుక్కల సమస్య తీరేనా?



కరీంనగర్ : 'విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా మైదానాలు, ఆసుపత్రులు తదితరల జన రద్దీ ఉండే బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలను సంచరించకుండా చేయాలి. వాటిని ప్రత్యేక షెడ్లకు తరలించండి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలకు ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవి..జిల్లాలోని నగర, పురపాలికల పరిధిలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. ఏ సమయంలో ఇవి దాడికి దిగుతాయో తెలియకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎనిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) నిబంధనల ప్రకారం జంతు సంరక్షణ బోర్డు ఆఫ్ ఇండియా ద్వారా శునకాలకు శస్త్రచికిత్సలు చేసి సంతానోత్పత్తి తగ్గించాల్సి ఉండగా, పలు ప్రాంతాల్లో ఈ ప్రక్రియ నిలిపివేశారు. కరీంనగర్‌లో ఆపరేషన్ థియేటర్, క్యాటిల్ సక్రమంగా లేదనే ఫిర్యాదుతో ఆగిపోయింది. మరో వైపు జన సమూహ ప్రాంతాల నుంచి వీటిని తరలించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయగా ఏమేరకు సమస్యను పరిష్కరిస్తారో తెలియకుండా మారింది. పురపాలికల పరిధిలో షెల్టర్లు లేవు. వాటిని నిర్మించి శునకాలను తరలిస్తారా లేదా చూడాలి మరి.

**పెరుగుతున్న ఫిర్యాదులు**

పుర, నగరపాలికల్లో శునకాల గుంపులతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పిల్లలకు పెద్దలు తోడుగా వెళ్లాల్సి వస్తోంది.

రాత్రిపూట నడిరోడ్లపై ఉంటూ రాకపోకలు సాగించే వాహనదారుల వెంట పడుతుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

వీధి కుక్కలను తరలించాలని జిల్లాలో ఫిర్యాదులు పెరుగుతుండగా.. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ఎక్కడ పడితే అక్కడ వీధుల్లో, బహిరంగ ప్రదేశాల్లో కొందరు ఆహారం పెట్టడంతో శునకాలన్నీ అక్కడికి చేరుకుంటున్నాయి.

**షెడ్డు నిర్మిస్తేనే శస్త్రచికిత్సలు**

కరీంనగర్‌లో రామగుండం బైపాసు రోడ్డులో జంతు సంరక్షణ కేంద్రం కోసం షెడ్డు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శ్లాబ్ దశకు చేరింది.

కోర్టు ఆదేశాల మేరకు షెడ్డు నిర్మిస్తే తప్ప శునకాలకు శస్త్ర చికిత్స చేసే అవకాశం లేదు.

వీధికుక్కల శస్త్రచికిత్స కోసం థియేటర్, క్యాటిల్ షెడ్డు వంటి సౌకర్యాలు అక్కడ ఏర్పాటు చేయనున్నారు.

**వేగంగా నిర్మాణ పనులు**

నగరానికి సంబంధించి జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. శునకాల తరలింపు విషయంపై మార్గదర్శకాలు రావాలి. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నిర్ణయముంటుంది.

దుర్గాప్రసాద్‌రెడ్డి, పశు వైద్యాధికారి, బల్దియా

# సేవాలోపాల్లో 'అందరూ బాధ్యులే'




కరీంనగర్ :వినియోగదారులకు విక్రయించే ఉత్పత్తులకి సంబంధించి సేవాలోపాలుంటే తయారీదారులతో పాటు విక్రయదారులు, డీలర్లు సైతం బాధ్యులేనని తాజా తీర్పులు వెల్లడిస్తున్నాయి. సేవా లోపముంటే ప్రతి దశలో పరిష్కారం దిశగా ప్రయత్నించాలని పేర్కొంటున్నాయి. తాజాగా ఓ ఎలక్ట్రిక్ స్కూటర్ విక్రయించిన కేసులో తయారీదారుదే పూర్తి బాధ్యత అంటూ అమెజాన్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ తప్పించుకునే ప్రయత్నం చేయగా.. సేవాలోపం ఉందని గుర్తించి పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసినందుకు బాధ్యులను చేస్తూ పరిహారం చెల్లించాలని రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు వెలువరించింది.

**లోపాలు జరుగుతున్నాయిలా..**

ఆరోగ్య సేవలు – రోగ నిర్ధారణలో తప్పులు, శస్త్ర చికిత్సలో నిర్లక్ష్యం, హాస్పిటల్ బిల్లు ఎక్కువ చూపించడంబ్యాంకింగ్, ఫైనాన్షియల్ సేవలు – ఏటీఎం నుంచి డబ్బు రాలేదు కానీ ఖాతాలో ఉపసంహరించడం, రుణానికి ఆమోదం ఇచ్చి తర్వాత తిరస్కరించడం, బీమా క్లెయిమ్ తిరస్కరణ్య టెలికాం, ఇంటర్నెట్ సేవలు – రీఛార్జ్ చేసినా డేటా రాకపోవడం, బిల్లింగ్ లోపం (ఎక్కువ బిల్), ఇంటర్నెట్ స్పీడ్ హామీ ఇచ్చి తక్కువ ఇవ్వడం ప్రయాణాలు, ఆతిథ్య సేవలు – విమాన ప్రయాణం రద్దుపై ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం, హోటల్ బుక్ చేసి గది ఇవ్వకపోవడం, టూర్ ప్యాకేజీలో హామీ ఇచ్చిన స్థలాలు లేకపోవడం

ఈ కామర్స్, డెలివరీ సేవలు – ఆర్డర్ ఇచ్చిన మోడల్‌కు బదులుగా వేరేవి రావడం, డెలివరీ ఆలస్యం, రిటర్న్ పాలసీ ప్రకారం రీఫండ్ ఇవ్వకపోవడం

గ్యాస్ సిలిండర్ లీక్, సేఫ్టీ చెక్ చేయకపోవడం, నీటి సరఫరా నిలిపివేత (సమాచారం ఇవ్వకపోవడం).

**జిల్లా కమిషన్లలో కేసులు..**

రాజధాని పరిధిలో నిత్యం రూ.కోట్ల వ్యాపారం జరుగుతోంది. తక్కువ ప్రచార ఖర్చులో విక్రయాలు పెంచుకోవడానికి కొంత మంది అనుచిత వ్యాపార పద్ధతులను అవలంభిస్తున్నారు. అందించాల్సిన సేవలను విస్మరిస్తున్నారు. ఈ క్రమంలో లోపం ఉందని తెలిసి ఉత్పత్తులు విక్రయిస్తూ, నాణ్యత పట్టించుకోకపోవడం లేదు. ఈ తరహా కేసులు రాజధాని పరిధిలోని 4 జిల్లా వినియోగదారుల కమిషన్లలో ప్రతినెలా 150కిపైగా నమోదవుతున్నాయి.

**తయారీదారు బాధ్యతలివీ..**

ఉత్పత్తి సురక్షితం, నాణ్యత కలిగి ఉండాలి.– వారంటీ, గ్యారంటీ ప్రకారం సేవలు అందించాలి.– లోపం తెలిస్తే రీకాల్ చేయాలి.– ప్రమాదకరమైన ఉత్పత్తులు (ఉదా: ఆటోమొబైల్స్, ఔషధాలు) గుర్తిస్తే హెచ్చరికలు ఇవ్వాలి.

**విక్రయదారు/ డీలర్‌లవి**

లోపం ఉన్న ఉత్పత్తి విక్రయించకూడదు. తెలిసినా తెలియకపోయినా బాధ్యులే. తప్పుడు ప్రకటనలు చేయకూడదు.

వారంటీ ప్రకారం సేవలు అందించాలి. లేదా తయారీదారుకు పంపాలి.

బిల్, వారంటీ కార్డు ఇవ్వాలి. వినియోగదారుడు విక్రేతకు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు.

సేవా ప్రదాత..సేవా ఒప్పందం, ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి అనుచిత వాణిజ్య పద్ధతులు అవలంబించకూడదు

ధర, నాణ్యత, రిస్క్‌ల గురించి స్పష్టంగా చెప్పాలి.

# ఆధునిక వసతులు.. ఆటపాటల తరగతులు

కరీంనగర్ : ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రీప్రైమరీ పాఠశాలలకు మహర్దశ చేకూరనుంది. అయిదేళ్లలోపు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తున్న ఈ పాఠశాలలకు బోధనాభ్యసన సామగ్రిని సమగ్ర శిక్షా అధికారులు సమకూరుస్తున్నారు. ఆటపాటలతో చిన్నారులకు బోధన చేసేందుకు ఈ సామగ్రి ఉపయోగపడనుంది. వీటితోపాటు తరగతి గదులకు రంగులు, బాలలకు ఏకరూప దుస్తులు అందించనున్నారు. ప్రైవేటుకు ధీటుగా అధునాతన వసతులతో చిన్నారులనే కాకుండా వారి తల్లిదండ్రులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు.

**జిల్లాలో 22 బడులు ఏర్పాటు**

ఈ ఏడాది అక్టోబరులో జిల్లాలో 22 ప్రీప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేశారు. వీటికి ఒక ఇన్‌స్ట్రక్టర్, చిన్నారులను చూసుకోవడానికి ఆయాను విద్యాశాఖ నియమించింది. ప్రస్తుతం 150 మంది బాలలు చేరగా యూకేజీ తరగతులు బోధిస్తున్నారు. అయితే సాధారణ రీతిలో బోధన చేస్తుండటంతో చిన్నారులు ఆకర్షితులు కావడం లేదని తెలుస్తోంది. కిడ్స్ కేర్ పాఠశాలలను తలపించేలా ఈ పాఠశాలల్లో అధునాతన వసతులు, ఆటపాటలతో కూడిన బోధనా పద్ధతులతో తీర్చిదిద్దే విషయంపై సమగ్ర శిక్షా అధికారులు దృష్టి నిలిపారు.

**ఒక్కోదానికి రూ.1.70 లక్షలు**


జిల్లాలోని ఒక్కో ప్రభుత్వ ప్రీప్రైమరీ పాఠశాలకు రూ.1.70 లక్షల నిధులు కేటాయించి తీర్చిదిద్దుతున్నారు. సామగ్రి, బోధనాభ్యసన సామగ్రి అందించనున్నారు. ఇప్పటికే ఇవి జిల్లాకు చేరడంతో శనివారం ఎంఈవోల ద్వారా పాఠశాలలకు పంపిణీ చేశారు. పాఠశాల తరగతి గదులను అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు రూ.50 వేలతో రంగులు వేయిస్తున్నారు. రూ.20 వేలతో బాలలకు దుస్తులు, స్టేషనరీ సమకూరుస్తున్నారు. ఆటపాటలతో అభ్యసనాన్ని సాగించేందుకు పలు రకాల వస్తువులు, ఆట బొమ్మలు, రంగురంగుల ఆకారాలు వంటివి అందించనుండటంతో చిన్నారులు చదువుపై ఆసక్తి చూపిస్తారని, ఈ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

## అంతా ఏకమై.. అన్నదాతకు శాపమై..!

సూర్యాపేట : అకాల వర్షాలు, మొంథా తుపాను వరి రైతులపై అదనపు భారాన్ని మోపాయి. వానలతో నిలిచిన వరికోత పనులకు వాతావరణం ప్రస్తుతం అనుకూలించడంతో ఒకేసారి పొలాలు కోతకు వచ్చాయి. దాంతో యంత్రాల నిర్వాహకులు, వాటి మధ్యవర్తులు అన్నదాతల అవసరాన్ని ఆసరా చేసుకుని ధరలను పెంచారు. అయినా ముందుకొస్తే హార్వెస్టర్ల కొరత నెలకొంది. రెండు రోజులు ఆలస్యమైనా.. తమ పొలాన్ని నూర్పిడి చేయాలంటూ రైతులు యంత్రాల నిర్వాహకుల, మధ్యవర్తులు చుట్టూ తిరుగుతున్నారు. వాన భయంతో కొన్ని ప్రాంతాల్లో ముందస్తు చెల్లింపులు చేస్తూ బుకింగ్ చేయించుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి.

**50 శాతం పూర్తి..**

ఉమ్మడి జిల్లాలో 11.82 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా.. అత్యధికంగా ఎన్ఎస్పీ, ఎస్సారెస్పీ, మూసీ పరివాహకంలోనే సాగైంది. ప్రస్తుతానికి 50 శాతం కోతలు కాగా మరో 50శాతం కోయాల్సి ఉంది. ఇందులో దిగుబాటు పొలాలే ఎక్కువగా ఉండటంతో చైన్ హార్వెస్టర్లను ఆశ్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఫోర్ వీల్ యంత్రాలతో నూర్పిడి చేయిస్తున్నారు. చైన్ల యంత్రాల నిర్వాహకులు గతంలో ఎకరం పొలాన్ని గంట సమయంలో కోసేవారు. అందుకు రూ.3 వేల చొప్పున తీసుకునే వారు. ఇప్పుడు యంత్రాల కొరత, నూర్పిడికి డిమాండ్ ఉండటంతో గంటకు రూ.500 ధర పెంచి రూ.3,500 తీసుకుంటున్నారు. ఫోర్‌వీల్ గతంలో గంటకు రూ.2,500 తీసుకుంటే ఇప్పుడు



రూ.3 వేలు తీసుకుంటున్నారు.

మొంథా తుపాను ప్రభావంతో చాలా పొలాలు నేలవాలడంతో ఎకరం విస్తీర్ణాన్ని 1:30 గంటల నుంచి 2 గంటల పాటు కోయాల్సి వస్తుందని యంత్రాల నిర్వాహకులు చెబుతున్నారు. ఈ లెక్కన ఒక రైతు ఎకరం పొలం కోయించడానికి రూ.5,250 నుంచి రూ.6 వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. అదే 10 ఎకరాల విస్తీర్ణం కలిగిన రైతు రూ.52,500 నుంచి రూ.60 వేలు వెచ్చిస్తున్నారు.

వానాకాలం వరి కోతలు సాధారణంగా రాత్రి 8 గంటల సమయం వరకు చేస్తారు. కారణం మంచు పడి కోత చేస్తే వడ్లు నేలరాలి నష్టపోతామని రైతులు వద్దనే వారు. కానీ, ప్రస్తుతం యంత్రాల కొరత కారణంగా దాదాపు రాత్రి 11 గంటల దాకా కోత పనులు చేస్తున్నారు.

రూ.5 వేల అదనపు భారం: బోసు, పాలవరం, అనంతగిరి మండలం ఎనిమిదెకరాల్లో వరిసాగు చేశా. హార్వెస్టర్‌కు గతేడాది గంటకు రూ.3 వేలు ఉండగా.. ఈ దఫా ఒక్కో గంటకి రూ.3,500 వసూలు చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఈసారి కోత పనులకు రూ.5 వేల అదనపు భారం పడింది.

## అక్షరమే ఆయుధం.. విజయ వికాసం

మిర్యాలగూడ : చదువుతోనే భవిష్యత్తు బంగారుమయం అవుతుందని మేధావులు ఏనాడో చెప్పారు. చదువు అనగానే ప్రతి ఒక్కరికి ఉద్యోగం, వేతనం మాత్రమే గుర్తుకు వస్తుంది. కానీ అసలు చదువు అంటే విజ్ఞానం. విజ్ఞానం పొందిన వారు మంచి భవిష్యత్తుతో పాటు సమాజంలో కీర్తి ప్రతిష్ఠలు సైతం అందుకుంటారు. దేశంలో ఉన్నత విద్యకు ఆజ్యం పోసిన భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఏటా నవంబరు 11న 'జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**ప్రస్తుత రోజుల్లో చదువుకోవడానికి అవకాశాలు ఉన్నప్పటికీ అనేక మంది నిర్లక్ష్యం చేస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చదువు విలువ తెలిసిన వారు ఎలాంటి అవకాశాలు లేకపోయినా ఉన్న కొద్దిపాటి వనరులనే సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదివి కొలువుదీరిన వారు సైతం ఉన్నారు.

**చదువు విలువ తెలిసి...**

సైదులు, ఎక్సైజ్ ఎస్సై, వెంకటాద్రి పాలెం, మిర్యాలగూడ మండలం. అమ్మానాన్నలు భిక్షం, ఎల్లమ్మ గీత కార్మికులు. కుటుంబ పోషణ కోసం ఆరో తరగతి లోనే చదువు మానేసి పనిలో చేరాను. ఐదేళ్ల తర్వాత చదువు విలువ తెలిసి దూరవిద్య ద్వారా పదో తరగతి, డిగ్రీలో చేరాను. పరీక్షల్లో అనేక సార్లు ఫెయిల్ అయినప్పటికీ గ్రామానికి వచ్చిన అధికారులు, వారికి ప్రజలు ఇచ్చే గౌరవాన్ని చూసి నేను కూడా అదే స్థాయి గౌరవం పొందాలని నిశ్చయించుకున్నాను. ఎంతో కష్టపడి డిగ్రీ పూర్తి చేశాను. అనంతరం బీఈడీ సైతం పూర్తి చేసి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీజీ సెట్‌లో ఎనిమిదో ర్యాంకు సాధించి, ఎంఏ ఎకనామిక్స్‌లో సీటు పొందాను. పొలిటికల్ సైన్స్‌లో సైతం పీజీ పూర్తి చేసి ఉద్యోగానికి సన్నద్ధమయ్యాను. 2016లో గ్రూప్–2లో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకుతో ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం ధూల్‌పేటలో పని చేస్తున్నాను.

**తాళ్లెక్కుతూ.. కల్లు విక్రయిస్తూ...**పల్స నాగరాజుగౌడ్, సూర్యాపేట. మాది సాధారణ పేద వ్యవసాయ, గీత కార్మిక కుటుంబం. అమ్మానాన్నలు పల్స రాములు–సత్తెమ్మలు కష్టాలు పడి నన్ను, అక్క, చెల్లిని పోషించే వారు. నేను చదువుకునే వయసులోనే పొలం పనులకు, కల్లు విక్రయాలకు వెళ్లే వాడిని. పాఠశాల, కళాశాల విద్యలన్నీ ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పూర్తి చేశాను. డిగ్రీ చదువుతున్న రోజుల నుంచే తాళ్లెక్కడం, కల్లు గీయడం, విక్రయించడం వంటి పనులు చేసే వాడిని. డిగ్రీ, బీఈడీ పూర్తి చేసిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధమయ్యాను. ఈ క్రమంలో ఏడాది కాలంలోనే ఎస్సైగా ఉద్యోగం సాధించాను. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పని చేశాను. ప్రస్తుతం హయత్‌నగర్ సీఐగా పని చేస్తున్నాను.

# పెద్ద 'ప్లానే'

విశాఖపట్నం: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో కొన్ని భవనాల పార్కింగ్ సెల్లార్లను వ్యాపార సముదాయాలుగా మార్చేశారు. స్టిల్ట్ ఫ్లోర్‌లో అనధికార నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేస్తున్నా అధికారులు తూతూమంత్రంగా స్పందిస్తున్నారు. ఫలితంగా పార్కింగ్‌లో ఉండాల్సిన వాహనాలు రోడ్లపై పెట్టించి ట్రాఫిక్ సమస్యను మరింత క్లిష్టం చేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, జనరేటర్లు పేలడం, వరద నీరు పోటెత్తినప్పుడు సెల్లార్లలో ప్రాణ నష్టం జరిగే అవకాశాలుండటం కలవరపెడుతోంది.

**కన్నెత్తి చూడని ప్రణాళిక అధికారులు :** సెల్లార్లను వాణిజ్య సముదాయాలుగా మార్చినా జీవీఎంసీ 'పట్టణ ప్రణాళిక' గుర్తించని చాలా ఉన్నాయి. సెల్లార్లలో బార్‌లు, హోటళ్లు, క్లినిక్‌లు, వాటర్ సర్వీస్, మొబైల్ సర్వీస్ దుకాణాలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు.

మరికొన్ని చోట్ల స్టిల్ట్ ఏరియాను పూర్తిగా వాణిజ్య సముదాయాలుగా మార్చి ఫైనాన్స్ సంస్థలు, స్టోర్‌లకు ఇస్తున్నారు. భవన నిర్మాణ ప్లాన్ అనుమతులిచ్చాక ఆ నిర్మాణం పూర్తయ్యే వరకు పట్టణ ప్రణాళిక పర్యవేక్షణ ఉండాలి. అయితే ప్లాన్ ఒకలా తీసుకుని వేరేలా వాణిజ్య సముదాయం నిర్మించినా, సెల్లార్లలో గదులు నిర్మించి అద్దెకిస్తున్నా అడ్డుకోవడం లేదు. కొందరు భవన నిర్మాణదారులు ఇచ్చే కాసులకక్కుర్తితో పలువురు అధికారులు కళ్లుమూసుకుంటున్నారు.



**సమన్వయంతో చేస్తేనే..**

సెల్లార్లలో నిర్మించే వాణిజ్య సముదాయాల వద్దకు వచ్చే వినియోగదారులు రోడ్లపైనే వాహనాలను నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు నిత్యం తలెత్తుతున్నాయి. ఇలాంటి భవనాల సెల్లార్లను గుర్తించి నోటీసులిచ్చి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పట్టణ ప్రణాళికాధికారులపై ఉంది. జీవీఎంసీ పట్టణ ప్రణాళికాధికారులు, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పర్యవేక్షించే పోలీసులు ఈ అంశంపై ఉమ్మడిగా ముందుకు సాగాలి. ముఖ్యమైన కూడళ్లు, రద్దీ ప్రాంతాలలో సెల్లార్ల ఆక్రమణలను తొలగించడానికి నోటీసులు జారీ చేయాలి. అనంతరం వాటిలోని వ్యాపార సముదాయాలను తొలగించి, వాహనాలు పార్కింగ్‌కు అవకాశం ఇవ్వాలని పలువురు సూచిస్తున్నారు.

**హైకోర్టు తీర్పు ఇలా..**

ఈస్ట్‌పాయింట్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో స్టిల్ట్ ఫ్లోర్‌లో అనధికార నిర్మాణాలను కూల్చివేయడానికి జీవీఎంసీ నోటీసులు జారీ చేయగా, వాటిని సవాల్ చేస్తూ సంబంధిత వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో 'పార్కింగ్‌లకు కేటాయించిన స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీల్లేదు. సెల్లార్, స్టిల్ట్ ఫ్లోర్‌లోని అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించడం జరగదు' అని తాజాగా హైకోర్టు ఆదేశాలిచ్చింది.

నగరంలో షాపింగ్ మాల్స్, స్టోర్స్, వాణిజ్య సముదాయాలు: 40,000(సుమారు)
రద్దీ ప్రాంతంలో ఉన్నవి:10,000 (సుమారు)
నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లలో వ్యాపారాలు చేస్తున్నవి: 2,752
జీవీఎంసీ ఇచ్చిన నోటీసులు: 90 (సుమారు)

# అందం.. ఆరోగ్యం!

గురుద్వారా : అందమే కాదు... ఆరోగ్యమూ ముఖ్యమే అనే అవగాహన ఇటీవల బాగా పెరిగింది. అందుకే జిమ్‌లలో సాధనకు వెళ్తున్న మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. విశాఖ నగరంలో దాదాపు 250 జిమ్‌లు నిర్వహిస్తున్నారు. వీటిలో మహిళల కోసం ప్రత్యేక సమయాలు కేటాయిస్తున్నారు. కొన్నైతే మహిళలకే ఏర్పాటు చేశారు. దీంతో ఆయా వేళలు అనువుగా ఉన్న వారు సాధనకు వెళున్నారు. నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అదనపు సౌకర్యాలు, ప్రత్యేకంగా మహిళా శిక్షకులను అందుబాటులో ఉంచుతున్నారు. ఆరోగ్యంతో పాటు రోజంతా ఉల్లాసంగా ఉండటానికి పలు వ్యాయామాలు తోడ్పడుతున్నాయంటున్నారు.

**'జుంబా డ్యాన్స్'...** సంగీతానికి అనుగుణంగా నృత్యరూపంలో చేసే వ్యాయామం ఇది. మహిళలు సులువుగా సాధన చేసేదిగా ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది. ఇందులో చిన్న వయసు నుంచి 50 ఏళ్ల పైబడిన వారూ సాధన చేయొచ్చు. అధిక బరువు సమస్య నుంచి బయటపడటానికి, మంచి శరీరాకృతి కావాలనుకునే వారికి ఈ వ్యాయామం



ఉపయుక్తం.

**ఏరోబిక్స్..** బరువు తగ్గటానికి సత్తువ కోసం ఈ తరహా వ్యాయామాలు చేస్తుంటారు. ఇవి కాస్త కష్టతరమైనప్పటికీ తొందరగా ఫలితాలు కనిపిస్తాయని నగర మహిళలు ఎక్కువగా వీటిపై దృష్టి సారిస్తున్నారు.

**సరైన పద్ధతిలో సాధన చేస్తేనే:** రోజూ కనీస వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. అరగంట చేసినా అది ఆయుష్షు కాలాన్ని పెంచుతుంది. ప్రస్తుత రోజుల్లో ఆహారపు అలవాట్ల వల్ల, వ్యాయామం చేయకపోవడంతో ఊబకాయ సమస్య వస్తోంది. సరైన పద్ధతిలో వ్యాయామ సాధన చేస్తే మంచి ఫలితాలు ఇస్తుంది.
కిలానీ గణేశ్, జిమ్ ట్రైనర్

**శిక్షకుల పర్యవేక్షణలోనే..:** వ్యాయామం చేస్తే అనారోగ్య సమస్యలు తలెత్తవు. శీతాకాల ప్రభావంతో కీళ్లనొప్పులు, గుండె జబ్బులు, మధుమేహం ఉన్న వారికి కాస్త ఇబ్బందికరంగా ఉంటుంది. అదే పనిగా కాకుండా రోజులో అరగంట పాటు సాధన చేస్తే మేలు. ఏదైనా శిక్షకుల పర్యవేక్షణలో చేయడం ఉత్తమం. డాక్టర్ శ్రీనివాస్ శైలేస్, వైద్యుడు

# చంటోళ్ల వణుకు.. వైద్యం కునుకు




కర్నూలు : చలి వణికిస్తోంది.. నవజాత శిశువులు, చిన్నారులు ఇన్ఫెక్షన్ల బారిన పడుతున్నారు.. దగ్గు, జలుబు, ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తున్నారు. నిత్యం వెయ్యి వరకు చిన్నారుల ఓపీ ఉంటోంది. బనగానపల్లి, డోన్, ఆదోని, ఎమ్మిగనూరు వంటి పట్టణాల్లో వంద వరకు ఓపీ నమోదు అవుతోంది. 'ప్రాథమిక' వైద్యం చేసి నంద్యాల, కర్నూలు జిల్లా కేంద్రాల్లోని సర్వజన ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. అక్కడ పడకలు దొరక్క ప్రైవేటుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

**ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు**

నవజాత శిశువులను వార్మర్లు, ఇంక్యుబేటర్ల సేవలు అవసరం. కూర్చోగలిగిన చిన్నారులకు నెబ్యులైజర్లు అందుబాటులో ఉంచాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ఇవి కానరావడం లేదు. కొన్నిచోట్ల ఉన్నప్పటికీ అవసరమైన వైద్యులు, సిబ్బంది లేక నిరుపయోగంగా మారాయి. కొవిడ్‌కు ముందుకు సీహెచ్‌సీలకు విలువైన పరికరాలు అందజేశారు. వీటిని వినియోగించుకోకపోవడం.. చిన్నపాటి మరమ్మతులు చేయకపోవడంతో మూలన పడ్డాయి.

**ప్రైవేటులో భారం**

ప్రైవేటుగా నెబ్యులైజర్లు పెట్టించాలంటే రూ.200 పెట్టి ఓపీ తీసుకోవాలి. తర్వాత నెబ్యులైజరుకు రూ.20-50 వరకు ఖర్చవుతుంది. ఇక ఇంక్యుబేటర్లు, వార్మర్లు సేవలు అందాలంటే రోజుకు సరాసరిన రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు చెల్లించాల్సిందే.

కొవిడ్ సమయంలో ఆస్పత్రుల వద్ద ఎల్‌పీఎం ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వీటిని ఇష్టానుసారంగా ఏర్పాటు చేయడం.. నిపుణులను నియమించకపోవడం, నిర్వహణ కొరవడంతో మూలకు చేరాయి.

**సర్వజనం తరలివస్తోంది**

కర్నూలు సర్వజన వైద్యశాలలోని పీడియాట్రిక్ విభాగంలో ఈ ఏడాది అక్టోబరులో కేసులను పరిశీలిస్తే అప్పుడే పుట్టిన శిశువుల నుంచి నెలలోపు కేసులకు సంబంధించి 280 అడ్మిషన్లు జరిగాయి. ఇందులో 95 కేసులు ఆసుపత్రిలో జరిగిన ప్రసవాలు కాగా.. మరో 185.. బయట నుంచి వచ్చిన కేసులున్నాయి. నవంబరులో 292 న్యూబార్న్ అడ్మిషన్లు జరగ్గా.. అందులో 117 వరకు ఆసుపత్రిలో జరిగిన ప్రసవాలున్నాయి. 175 మంది బయటి నుంచి వచ్చిన కేసులే ఉన్నాయి.

నంద్యాల సర్వజన ఆస్పత్రిలో చిన్నపిల్లల ఓపీ 150 వరకు ఉంటోంది. ఐపీ 80 వరకు ఉంది. మాతాశిశు సంరక్షణ వైద్యశాలలో ఎన్‌సీయూకు సంబంధించి 20 పడకలు ఉండగా.. మరో 10 వరకు అవసరమని వైద్యులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..**

ఆదోని ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో ఆరు నెబ్యులైజర్లు ఉండగా.. మూడు పనిచేయడం లేదు. ఆక్సిజన్ ప్లాంట్ లేకపోవడంతో సిలిండర్ల ద్వారా ప్రాణవాయువు అందిస్తున్నారు.

ఎమ్మిగనూరులో 100 వరకు ఓపీ ఉంటోంది. అవసరమైన వార్మర్లు అందుబాటులో లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

పత్తికొండ: సీహెచ్‌సీలో నిత్యం 80 వరకు ఓపీ ఉంటుంది. ఇంక్యుబేటర్లు ఉన్నప్పటికీ అవసరమైన సిబ్బంది లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

ఆసుపత్రి సంఖ్య
ఏరియా 3
సామాజిక 18 ప్రాథమిక 87

# స్థలాలు ఉక్కువైనా.. అక్రమార్కులకు లోకువే!



గాజువాక: గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో ఉక్కు నిర్వాసితుల కోసం ఇచ్చిన స్థలాలకు రక్షణ కరవైంది. రాత్రికి రాత్రే షెడ్లు వేస్తూ, అనధికార నిర్మాణాలు సాగిస్తూ కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ఉక్కు భూసేకరణ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మాయగాళ్లు రంగంలోకి దిగి నకిలీ డాక్యుమెంట్లు, ప్రొసీడింగ్ ఆర్డర్లు తెరముందుకు తెచ్చి కబ్జాపర్వం కొనసాగిస్తున్నారు. దీంతో వీటి రక్షణ భారం మండల రెవెన్యూ అధికారుల మీద పడుతోంది.

1970 దశకంలో గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో 64 గ్రామాలను స్టీల్‌ప్లాంట్ కోసం తరలించి అప్పట్లో 22 వేల ఎకరాల భూములను సేకరించారు. ఆయా గ్రామాలకు అర్బన్ ప్రాంతాల్లో పునరావాసం కల్పించారు. ఈ భూములన్ని స్టీల్‌ప్లాంటు భూసేకరణ, పునరావాస విభాగం పరిధిలో ఉంటాయి. అయితే వీరు దృష్టిపెట్టకపోవడంతో క్రమంగా అన్యాక్రాంతమవుతున్నాయి.

**ఇదిగో ఇలా..**

1. ఇటీవల గాజువాక వికాస్ నగర్ ఐటీఐ రోడ్డు వద్ద సర్వేనెంబర్-153 భూముల్లో తమకు అన్ని హక్కులు ఉన్నాయంటూ రాత్రికి రాత్రే 18 షెడ్ల నిర్మాణాలకు ఆక్రమణదారులు తెగించారు. రెండు రోజుల తర్వాత ఎస్‌డీసీ కార్యాలయ సిబ్బంది ఆక్రమణలను తొలగించి హెచ్చరిక బోర్డులను పాతారు.
2. బీసీ రోడ్డు శివాలయం వద్ద 2.5 ఎకరాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉంటే ఆరేళ్లుగా ఉక్కు అధికారులు పట్టించుకోలేదు. చుట్టూ ఫెన్సింగ్ వేసినా పట్టనట్లున్నారు. ఆ తర్వాత ఇవి ఉక్కు భూములని తేలాక అక్కడ హెచ్చరిక బోర్డులను పాతారు.

**భూములు ఇక్కడ.. కార్యాలయం అక్కడ:** ఉక్కు భూసేకరణ విభాగం కార్యాలయం నగరంలో జడ్పీ కార్యాలయ సమీపంలో ఉంది. అక్కడ ఒక స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ), ఆర్‌ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు, దిగువస్థాయి సిబ్బంది ఉన్నారు. ఉక్కు నిర్వాసితకాలనీలు, భూములన్నీ ఇక్కడున్నాయి. అదే అక్రమార్కులకు అనుకూలంగా మారింది. ఆయా మండలాల్లో ఆక్రమణలు, స్థలాల చదును జరిగితే అనేకమంది మండల కార్యాలయాలకు ఫిర్యాదు చేస్తుంటారు. అవి ఉక్కు భూసేకరణ పరిధిలో ఉన్నాయని రెవెన్యూ సిబ్బంది చెబుతూ వాటికి కాపలా కాయాల్సి వస్తోంది. నగర కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసే వీల్లేక మండల కార్యాలయాలను ఆశ్రయిస్తున్నారు. **కార్యాలయం వచ్చేలా చర్యలు:** 'ఉక్కు భూసేకరణ కార్యాలయాన్ని గాజువాక రప్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటాం. రూ.కోట్లు విలువైన స్థలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉక్కు అధికారులదే. జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి ఆ శాఖ అధికారులు గాజువాకలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం' అని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# నమ్మకమే నడిపిస్తోంది

అచ్యుతాపురం : వైకల్యం కారణంగా కాలు కిందకు పెట్టి అడుగు ముందుకు వేయలేని వ్యక్తి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేశారు. తనలాంటి ఎంతోమంది జీవితాలకు వెలుగురేఖ చూపే బాధ్యతను భుజాలకెత్తుకున్నారు. ఆయన చేసిన ప్రయత్నం ఇప్పుడు ఎన్నో బతుకులను మార్చుతోంది. దివ్యాంగులైన పిల్లలను కుటుంబ పెద్దలా సాకుతున్నారు మోసయ్యపేటకు చెందిన పి.ఎస్.టి.పట్నాయక్. దివ్యాంగుడైన ఆయన ఎక్కడకు వెళ్లాలన్నా చక్రాల కుర్చీలోనే వెళుంటారు. అలాంటి ఆయన పాతికేళ్ల క్రితం దివ్యాంగుల కోసం పాఠశాలను ఏర్పాటు చేశారు. కేవలం పది మందితో తాటాకు పాకలో ప్రారంభమైన పాఠశాల నేడు పక్కా భవనాలతో రూపుదిద్దుకుంది. 14 మంది దివ్యాంగ బోధకులతో విద్యాబుద్ధులను నేర్పిస్తున్నారు. ఇప్పటికే 15 బ్యాచ్‌లను పదో తరగతి పరీక్షలకు పంపించారు. ఇటీవలే డీఎస్సీ ఫలితాల్లో ఇదే పాఠశాలలో చదివిన ఒకరు ఉద్యోగం సాధించారు.

**దాతలే ఆదరవు!:** పట్నాయక్ ఈ పాఠశాలను దాతల సహాయంతో నడుపుతున్నారు. దివ్యాంగుల విద్యార్థులను ఉన్నత వర్గాలకు చెందిన వారికి దత్తత ఇచ్చి వారు అందించే సహాయంతో విద్య, వసతి, భోజనం అందిస్తున్నారు. పలువురు పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి శుభకార్యాలు ఇక్కడే ఏర్పాటు చేసుకొని దివ్యాంగులతో కలిసి ఆనందంగా గడుపుతున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, వైజాక్‌ఫోపైల్, ఎన్టీపీసీ, కృష్ణా ప్యాన్స్, రోటరీక్లబ్, విశాఖడెయిరీ, ఎంపీ నిధులు, మహిళా సమితి సహాయంతో పాఠశాలను నిర్వహిస్తున్నారు. పట్నాయక్ సేవలను గుర్తించి ప్రభుత్వం ఇప్పటికే సత్కరించింది.

**పొందిన అవార్డులు...**

2006లో జాతీయస్థాయిలో ఉత్తమ సేవకునిగా అప్పటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాం అవార్డు
2016లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా సేవా పురస్కారం.
దివ్యాంగుల సమస్యలపై అధ్యయన కమిటీలో సభ్యత్వం

ఆత్మవిశ్వాసం నింపడమే లక్ష్యం: తాము ఎందుకు పనికిరామనే అభిప్రాయాన్ని దూరం చేసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే లక్ష్యం. ఈ దిశగానే ప్రతిరోజు ఆలోచన చేస్తుంటాను. ప్రభుత్వానికి అందించే నివేదికలో ఈ విషయాలనే ఉంచాలనుకుంటున్నాను. దివ్యాంగులపై జాలిచూపి సహాయం అందించి వదిలివేయకూడదు. ఆర్థికంగా నిలబడేవిధంగా వారిని తయారుచేయడానికి నిర్మాణాత్మకమైన చర్యలు అవసరం. మా పాఠశాలలో 200 మంది వరకు వసతి ఉండేవిధంగా ఏర్పాట్లు ఉన్నాయి. రక్షణగోడ లేక కొంత ఇబ్బంది పడుతున్నాం. బాలురుకు డార్మెటరీ లేదు. పీఎస్‌టీ పట్నాయక్, పాఠశాల నిర్వాహకుడు

# తప్పించుకోవద్దు.. తప్పకుండా రండి!

పాయకరావుపేట : ప్రతి పేదింటి కుసుమం జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవడానికి విద్యే ప్రధాన ఆయుధం. ఇటువంటి ఆయుధాన్ని కొందరు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరానికి చేరుకుంటుంటే.. మరికొందరు అవగాహన లేక, తల్లిదండ్రులు పట్టించుకోక పాఠశాల స్థాయిలోనే చదువులకు టాటా చెబుతుంటారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివే పిల్లలపై తల్లిదండ్రులు ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నారు. నిరంతరం పాఠశాలను సందర్శించడంతోపాటు వారి ప్రవర్త, విద్యపై ఉపాధ్యాయులతో చర్చిస్తూ మంచి ఫలితాలు పొందుతున్నారు. ఇటువంటి ప్రయత్నం ప్రభుత్వం పాఠశాలల్లోనూ జరగాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఒక వేదికపైకి తెచ్చి విద్యార్థి పురోభివృద్ధికి పాటుపడడానికి మెగా పేరెంట్స్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించనుంది. పిల్లల ఎదుగుదలను రూపొందించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే కీలకపాత్రని భావించి పండగ వాతావరణంలో ఈనెల 5న నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది. వీటిపై విద్యాశాఖాధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి.

**ఈ సవాళ్లు అధిగమించాలి:** ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభంలో జులై 10న మెగా పీటీఎం ఏర్పాటు చేసి ఈ కార్యక్రమ లక్ష్యాలు, ఉద్దేశ్యాలను తల్లిదండ్రులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఉన్నతాధికారులు వివరించారు. ఈ సమావేశానికి భారీగా హాజరైన తల్లిదండ్రులు తరువాత మాత్రం పాఠశాల ముఖాన్ని చూడలేదు.

**సమావేశం ఉద్దేశాలివీ...**

పిల్లలు తరగతి గదిలో ఎలా రాణిస్తున్నారు, సహ విద్యార్థులతో ఏవిధంగా ప్రవర్తిస్తున్నారు? ఇంటి వద్ద ఏ విషయాల్లో శ్రద్ధ తీసుకోవాలని వంటి అంశాల్లో పిల్లల పురోగతిపై ఉపాధ్యాయులతో చర్చించడానికి ఇది ప్రధాన వేదిక.

పిల్లల అలవాట్లు, సవాళ్లు, నైపుణ్యాల గురించి ఉపాధ్యాయులతో చర్చించడానికి అవకాశం ఉంటుంది.

విద్యార్థులకు మెరుగైన విద్యను అందివ్వడానికి ఉపాధ్యాయులతో కలిసి తల్లిదండ్రులు అడుగులు వేయడానికి ఇది మూలస్తంభంగా పనిచేస్తుంది. తల్లిదండ్రుల సహకారంతో పాఠశాల వాతావరణ మార్చడానికి ఉపాధ్యాయులకు అవకాశం ఉంటుంది. చెడు అలవాట్లు, పాఠశాలలకు తరచూ గైర్హాజరు అయ్యేవారు, క్రమశిక్షణ కొరవడిన విద్యార్థుల ప్రవర్తను తల్లిదండ్రులకు వివరించడంతోపాటు వారిని సరైన రీతిలో నడిపించడానికి ఉపాధ్యాయులకు వీలు కలుగుతుంది.

ప్రతినెల జరగాల్సిన సమావేశాలకు పాఠశాల కమిటీ ఛైర్మన్, ఒకరిద్దరు డైరెక్టర్లు తప్ప తల్లిదండ్రుల భాగస్వామ్యం తక్కువగానే ఉంది. కొందరు ఉపాధ్యాయులు సైతం దీనిని అంతగా పట్టించుకోకుండా కాగితాల్లో సమావేశాలను చూపించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో సింహభాగం పేద కుటుంబానికి చెందినవారే కావడంతో రోజు కూలీకి వెళ్తే తప్ప కడుపునిండని పరిస్థితులు వల్ల వారు ఈ సమావేశాలకు రావడంలేదు.

**అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం:** పీటీఎం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేశాం. పండగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాం.
జి.అప్పారావునాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు: 1,831
ప్రభుత్వ జూనియర్ కళాశాలలు: 22
విద్యార్థుల సంఖ్య: సుమారు రూ.2.50 లక్షలు

# జంక్షన్.. టెన్షన్..

ఎలమంచిలి : చంటిబిడ్డతో దీనంగా దిగువ చిత్రంలో కనిపిస్తున్న యువతి పేరు ఆవాల శివ. ఉద్దండపురం గ్రామం. ఈమె భర్త దుర్గారావు ఏడాది క్రితం ఉద్దండపురం కూడలిలో కారు ఢీకొని మృత్యువాత పడ్డాడు. అప్పటికే వీరికి మూడేళ్ల కొడుకు ఉండగా, మరో బిడ్డ పుట్టి 14 రోజులైంది. భర్త తాపీపనిచేస్తూ తెచ్చే సంపాదనతో కుటుంబం హాయిగా గడిచిపోయేది. ప్రస్తుతం పుట్టింటివారు, అత్తింటివారే శివను చూస్తున్నారు. భర్తలేని తనకు భవిష్యత్తు కానరాక బిడ్డలతో కలిసి గుండెలనిండా బాధతో రోజులు వెళ్లదీస్తోంది.

జాతీయ రహదారిపై కూడళ్లలో జరిగిన ప్రమాదాలతో అనేకమంది జీవితాలు రోడ్డున పడ్డాయి. వాహనాల అతివేగం, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల అవగాహన రాహిత్యం, కూడళ్లలో లైటింగ్ లేకపోవడం, బ్లింకర్లు పెట్టకపోవడం తదితర రక్షణ చర్యలు కొరవడటం ఇలా అనేక లోపాలు ప్రమాదాలకు హేతువులుగా మారుతున్నాయి. అయినా ప్రమాదాల నియంత్రణకు తీసుకున్న చర్యలు అంతంతమాత్రమే.

భర్త ఫొటోతో ఉన్న ఈ మహిళ పేరు పెంకె రాణి. భర్త వీరన్న వ్యవసాయ కూలీ. అయిదేళ్ల క్రితం పనికి వెళ్తోస్తుండగా ఉద్దండపురం కూడలిలో రోడ్డు దాటుతూ.. కారు ఢీకొనడంతో గాయపడి మరణించాడు. రాణికి తొమ్మిదేళ్ల లోపున్న బాబు, పాప ఉన్నారు. ప్రస్తుతం పుట్టింటిలో ఉంటూ కూలికి వెళుతూ పిల్లలతో జీవనం సాగిస్తోంది. బీమా ద్వారా వచ్చిన సొమ్ములు వైద్యం చేయించిన అప్పులకు సరిపోయాయి.

**గతంలోనే బ్లాక్‌స్పాట్ల గుర్తింపు**



గౌతమి శాలి అనకాపల్లి ఎస్పీగా ఉన్నప్పుడు జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్‌స్పాట్లను గుర్తించారు. అక్కడే ఎందుకు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నదీ రవాణా శాఖ అధికారులతో కలసి స్వయంగా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో సాంకేతిక లోపాలు గుర్తించి వీటిని సవరించాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులకు సూచించారు. కానీ ఒక్క సాంకేతిక లోపాన్నీ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సరిచేయలేదు.

23 కూడళ్లలో : జాతీయ రహదారిపై అటు లంకెలపాలెం మొదలు... ఇటు పాయకరావు పేట వరకు 23 కూడళ్లలో తరచూ మృత్యుఘోష వినిపిస్తూనే ఉంది.

**భద్రతా చర్యలు చేపడతాం..** జిల్లాలో జాతీయ రహదారి చాలాచోట్ల గ్రామాల మధ్యనుంచి వెళ్లింది. ఇలాంటి చోట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జనాభా, వాహనాలు పెరుగుతున్న విషయాన్ని గుర్తించి, ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి. ఎస్పీ ఆదేశాలతో ఇలాంటి చోట్ల లైటింగ్, బ్లింకర్లు అవసరాన్ని గుర్తించి వీటిని ఏర్పాటు చేయడానికి నివేదిస్తున్నాం. దీంతో పాటు కూడళ్లలో జరిగిన ప్రమాదాలు, మృతుల వివరాలతో హెచ్చరిక బోర్డులు పెట్టిస్తాం. వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు పెంచుతున్నాం. తద్వారా భద్రతా చర్యలు చేపడతాం. పి.శ్రీనివాసరావు, డీఎస్పీ, నర్సీపట్నం

# నీళ్లు రావు.. వెతలు తీరవు



అమలాపురం : నీటి వనరులు అందుబాటులో లేక ఎద్దడి ఎదుర్కొంటున్న పంట పొలాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన ఎత్తిపోతల పథకాలు అలక్ష్యానికి గురవుతున్నాయి. గత వైకాపా పాలనలో కనీస మరమ్మతులకు నోచుకోలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 29 పథకాలుంటే, అయిదు మాత్రమే సేవలందిస్తుండగా, రెండు శిథిలావస్థకు చేరాయి. మరమ్మతులు, నిర్వహణకు నిధులు మంజూరుచేస్తే వచ్చే ఖరీఫ్ నాటికైనా పూర్తి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిర్వహణకు నోచుకోక..:మోటార్ల పంపులు మరమ్మతుకు గురైతే సరి చేసే పరిస్థితి లేదు. పైపులైన్ల లీకులున్నా కట్టడిలేదు. అన్ని పథకాలపై ఆధారపడి 47 వేల ఎకరాలుంటే 30 నుంచి 50 శాతం ఆయకట్టుకే నీరందుతోంది. మోటార్లు, పంపుల మరమ్మతులు, పైపులైన్ల పనులకు రూ. 91.32 కోట్లు అవసరమని జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

**దాళ్వాకు సాగునీరందేనా..:** ఆత్రేయపురం మండలం పేరవరం ఎత్తిపోతల పథకం ఏకధాటిగా 24 గంటలు పనిచేస్తే ఏదో ఒక మరమ్మతులకు గురవుతుంది. మోటార్లు, పంపులు దెబ్బతింటున్నాయి. మరమ్మతులు చేయించేలోగా సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పథకం ద్వారా పేరవరం, రాజవరం, వెలిచేరు, వద్దిపర్రు, పులిదిండి ఆయకట్టు 3 వేల ఎకరాలు ఆధారపడి ఉంది. వసంతవాడ పథకం భూగర్భ పైపులైను దెబ్బతింది. లీకులతో సాగునీరు వృథా అవుతోంది. దీనికింద వసంతవాడ, తాడిపూడి, కట్టుంగ, నార్కెడుమిల్లి, అంకంపాలెం వరకు 3వేల పైబడి ఎకరాలకు సాగునీరు అందుతోంది.ఉచ్చిలి ఎత్తిపోతల పథకం పాడై ఏడేళ్లయింది. మోటార్లు, పంపులు, భవనం పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆయకట్టులోని పంట కాలువలు ఆక్రమణలకు గురై కుంచించుకుపోయి ఉన్నాయి.

# 'ఉత్తి'పోతలు..!

రాజమహేంద్రవరం: కొవ్వూరులోని కుమారదేవం ఎత్తిపోతల పథకం దుస్థితి ఇది. నాలుగు మోటార్లలో రెండే పని చేస్తున్నాయి. 4600 ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో నిర్మించారు. ప్రస్తుతం 1900 ఎకరాలకే నీటిని అందిస్తోంది. నీటి వనరులు అందుబాటులో లేక.. ఎద్దడి ఎదుర్కొంటున్న పంట పొలాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. గత వైకాపా పాలనలో కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో అవి మూలకు చేరే పరిస్థితికొచ్చాయి. ఉమ్మడి జిల్లాలో 29 పథకాలుంటే, అయిదు మాత్రమే పూర్తిస్థాయిలో సేవలందిస్తుండగా, రెండు శిథిలావస్థకు ఉన్నాయి. కొన్ని అంతమాత్రంగానే పని చేస్తున్నాయి. వీటి మరమ్మతులు, నిర్వహణకు నిధులు మంజూరుచేస్తే వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తి ఆయకట్టుకు సాగు నీరందే అవకాశం ఉంది.

**నిర్వహణకు నోచుకోక..**

మోటార్ల పంపులు మరమ్మతుకు గురైతే సరి చేసే పరిస్థితి లేదు. అనేక చోట్ల పైపులైన్‌లకు లీకులున్నా కట్టడిలేదు. దీంతో శివారు



ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత లెక్కల ప్రకారం వీటిపై ఆధారపడి సుమారు 47 వేల ఎకరాలుంటే 30 నుంచి 50 శాతం ఆయకట్టుకే నీరందుతోందని ప్రాథమిక అంచనా. అనపర్తిలో కాపవరం పథకం ఆధారంగా 690 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ పథకానికి ఉన్న రెండు మోటార్లు మరమ్మతుకు గురయ్యాయి. పైపులైన్ల లీకుల సమస్య వెంటాడుతోంది. ఆత్రేయపురం మండలంలోని వసంతవాడ పథకానికి మూడు మోటార్లు ప్రస్తుతం పని చేస్తున్నా నిర్వహణకు నిధులు అవసరం. పైపులైన్ల లీకేజీలున్నాయి. దీంతో నీరంతా వృథా అవుతోంది.

**రూ.91.32 కోట్లతో ప్రతిపాదనలు..**

దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఎత్తిపోతల పథకాల మోటార్లు, పంపుల మరమ్మతులు, పైపులైన్ల పనులకు రూ.91.32 కోట్లు అవసరమని జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

# బుల్లెట్ రైలు మార్గం



కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా బుల్లెట్ రైలు వెళ్లేందుకు 'మార్గం' సుగమం అవుతోంది. దేశవ్యాప్తంగా కొన్ని మార్గాల్లో బుల్లెట్ ట్రైన్లు నడపాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా హైదరాబాద్- బెంగళూరు మార్గాన్ని ఎంపిక చేశారు.. అందుకు అనువైన ట్రాక్ నిర్మాణానికి మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. అదేవిధంగా గుంతకల్లు-గుంటూరు, ముద్దేడ్-డోన్ డబ్లింగ్ పనులు వేగవంతమయ్యాయి. అమృత్ భారత్ కింద స్టేషన్ల ఆధునికీకరిస్తున్నారు.

**1.20 గంటలో బెంగళూరుకు**

కర్నూలు-బెంగళూరు మధ్య దూరం 427 కి.మీ. మేర ఉంది. ప్రస్తుతం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో 5.30 గంటలు పడుతోంది. దీని గరిష్ఠ వేగం 180 కి.మీ.లు అయినప్పటికీ 130 కి.మీ. వేగంతోనే నడుపుతున్నారు. బుల్లెట్ రైలు అందుబాటులోకొస్తే కర్నూలు నుంచి బెంగళూరు కంటోన్మెంట్ స్టేషన్‌కు 1.20 గంటలో చేరుకోవచ్చు. దీని గరిష్ఠ వేగం గంటకు 350 కి.మీ.. భద్రత కారణాల నేపథ్యంలో 320 కి.మీ. వేగంతోనే నడుపుతారు. ఈ వేగం తట్టుకునేలా అనువైన ట్రాక్ నిర్మించాల్సి ఉంటుంది.

**డబ్లింగ్.. వేగవంతం**

గుంటూరు- గుంతకల్లు రైలు మార్గంలో డబ్లింగ్ పనులు తుది దశకు చేరుకొన్నాయి. రూ.3,631 కోట్లు వెచ్చించి 401.47 కి.మీ. మార్గాన్ని బాగు చేస్తున్నారు. 57.738 కి.మీ. మేర పనులు చేయాల్సి ఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇవి పూర్తైతే నంద్యాల నుంచి గుంటూరు, విజయవాడ, గుంతకల్లు వైపు పలు నూతన సర్వీసులు నడిపేందుకు అవకాశం ఉంటుంది.

ఉత్తర-దక్షిణ భారతదేశ ప్రాంతాలను కలిపే ఉద్దేశంతో ముద్దేడ్-డోన్ రైల్వే లైనుకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మహారాష్ట్రలోని ముద్దేడ్ నుంచి ఏపీలోని డోన్ వరకు 417.88 కి.మీ. మేర రూ.4,686.09 కోట్లతో డబ్లింగ్ పనులు చేపడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న మహబూబ్‌నగర్- డోన్ మధ్య 197 కి.మీ. మేర పనులు 2029 నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. పూర్తైతే హైదరాబాద్ నుంచి బెంగళూరు, తిరుపతి, చెన్నై వైపు ఎక్కువ రైళ్లను నడిపే అవకాశముంటుంది.

# ఎప్పుడిస్తారో ఉపాధి వేతనాలు?

చిత్తూరు : ఉపాధి హామీ వేతనదారులు కూలి డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. ఆగస్టు 15 నుంచి చెల్లింపులు నిలిచిపోయాయి. జిల్లాలో వేతనాలు, మెటీరియల్ నిధి బకాయిలు రూ.70 కోట్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

**కూలీల సొమ్ము రూ.35 కోట్లు**

రోజుకు సగటున 35 నుంచి 50 వేల మంది వరకు జిల్లాలో ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఆగస్టు నుంచి 12 లక్షల పనిదినాలు నమోదవగా రూ.35 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి.

**భారీగానే మెటీరియల్ బకాయిలు..**



వేతన సొమ్ములో 40 శాతం కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కింద వస్తుసామగ్రి నిధులు విడుదల చేస్తుంది. వీటితో సీసీరోడ్లు, మురుగు కాలువలతో పాటు అభివృద్ధి పనులు చేస్తున్నారు. మినీ గోకులం షెడ్లు నిర్మించారు. వీటికి సంబంధించిన బకాయిలు మరో రూ.35 కోట్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నిధులు కేంద్రం విడుదల చేయాల్సి ఉందని డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు.

**జిల్లాలో వివరాలు..**

జాబ్‌కార్డులు: 2,67,000

వేతనదారులు: 4,79,000 మంది

హాజరు: 2 నుంచి 3 లక్షలు

సగటున పనికి వచ్చేవారు: 35 వేలు

# చలికి వణుకుతోంది 'రొయ్య'

కోట: రొయ్య రైతులు వరుసగా నష్టపోతున్నారు. ప్రస్తుతం దిత్వా తుపాను ధాటికి నాలుగురోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో ఉష్ణోగ్రతలు 18 డిగ్రీల కంటే పడిపోయాయి. ఈ నేపథ్యంలోనే రొయ్య చలితో గజగజలాడుతోంది. మేత తినకుండా స్తబ్దుగా ఉంటోంది. వైరస్ బారిన పడుతూ చివరికి మృత్యువాత పడుతోంది. దీంతో కొందరు రైతులు తక్కువ కౌంట్‌తోనే వాటిని పట్టి విక్రయిస్తున్నారు. పెట్టుబడులు రాకపోగా ఎకరాకు రూ.2 లక్షల వరకు నష్టపోతున్నట్లు అన్నదాతలు వాపోతున్నారు.

**మత్స్యశాఖ ఎఫ్‌డీవో రెడ్యానాయక్ సూచనలు**

చెరువులో కనీసం 5 అడుగుల మేర నీరు నిధంగా ఉండేలా చూసుకోవాలి. పక్క చెరువు నుంచి వైరస్ వ్యాపించకుండా బయో



సెక్యూరిటీ విధానాలు పాటించాలి.

రోజులో ఉష్ణోగ్రత అధిక ఉన్న సమయంలో మేత ఎక్కువగా వేయాలి.

రోగనిరోధకశక్తిని పెంచే సీ విటమిన్, పొటాషియం, మెగ్నీషియం ఖనిజాలు తగు మోతాదులో అందించాలి.

తగినన్ని ఏరియేటర్లు అమర్చి ఆక్సిజన్ సక్రమంగా అందేటట్లు చూస్తే నాణ్యత కలిగిన రొయ్య పెరుగుతుంది.

సాగు విస్తీర్ణం : 9,000 ఎకరాలు

60 రోజులకు 10 12 గ్రాములు ఉండాల్సి ఉండాలి. ప్రస్తుతం అందులో సగం కూడా లేనట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రకృతిలో ఆరోగ్య పాఠాలు!

అనంతపురం: ప్రస్తుతం దేహ దారుఢ్యం, ఆరోగ్యంపై అన్ని వయసుల వాళ్లు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. యోగాతోపాటు వ్యాయామశాలల్లో చేరి కసరత్తులు చేస్తున్నారు. ఆసనాలతోపాటు బరువులెత్తడం, ట్రెడ్‌మిల్‌పై పరుగు, సిక్స్‌ప్యాక్ కోసం కసరత్తు చేస్తూ శరీర దృఢత్వాన్ని పెంచుకుంటున్నారు. జిమ్‌లో చేసే ఈ ప్రక్రియలు యాంత్రికంగా మారిపోయాయనే భావన యువతలో మొదలైంది. ఈనేపథ్యంలో ప్రకృతిని ఆస్వాదిస్తూనే ఫిట్‌నెస్ పొందవచ్చని చెబుతున్నారు నగరానికి చెందిన తాజుమ్ముల్.. అతని మిత్ర బృందం. 'ట్రెక్కర్స్ ఆఫ్ అనంతపురం' పేరుతో వారు నిర్వహిస్తున్న ఆరోగ్య పాఠాలు ఆసక్తిగా మారాయి.



**బరువును బట్టి..**

శరీర బరువునే ఆసరాగా చేసుకుని వ్యాయామం చేస్తూ ఫిట్‌నెస్ పొందే ప్రక్రియను కలిస్తానిక్ అంటారు. ఈ విధానంలో డిప్‌బార్‌లు, పుల్-అప్ బార్‌లు, స్ట్రెచింగ్ తదితరాలు ఉంటాయి. నిర్వాహకులు వ్యాయామంతోపాటు వారాంతాల్లో సమీపంలోని కొండల్లో ట్రెక్కింగ్ చేపడుతున్నారు. నడవడం, వాగులు, వంకలు దాటడం, ఒక రాయి నుంచి ఇంకో రాయికి దూకడం తదితర ప్రక్రియలతో శరీరంలోని కొవ్వు సహజసిద్ధంగా కరిగిపోతుందని చెబుతున్నారు.

**ప్రతి వారాంతంలో..**

తాజుమ్ముల్, దినేష్, వసీం, సిద్ధార్థ్ మిత్ర బృందం అనంత చుట్టుపక్కల కొండల్లో ప్రతి ఆదివారం ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 20 మంది సభ్యులు ఉన్నారు. ఆసక్తి ఉన్నవారిని ట్రెక్కింగ్‌లో పాల్గొనేలా చేస్తున్నారు. ట్రెక్కింగ్‌లో జాగ్రత్తలు, నియమాలపై ముందుగా వివరిస్తారు. అనుమతి పత్రంపై సంతకం తీసుకున్న తర్వాతే తీసుకెళ్తున్నారు. బయట నుంచి వచ్చేవారి కోసం మెడికల్ కిట్ అందిస్తున్నారు. గంపమల్లయ్యకొండ, దేవరకొండ, గోనిమడుగుల ఆలయం, గుత్తి కోట వంటి ప్రాంతాల్లో ట్రెక్కింగ్ చేపట్టారు. ఇప్పటివరకు 30 ప్రాంతాల్లో నిర్వహించారు.

# సహకార సంఘాలు.. దోచేశారు



తిరుపతి : ఐదేళ్ల జగన్ పాలనలో సహకార సంఘాలు భ్రష్టుపట్టాయి. రైతులకు అండగా నిలవాల్సిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సింగిల్‌విండో), జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) వైకాపా నాయకులకు దాసోహమయ్యాయి. ఎక్కడ చూసినా నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అర్హతలేని వ్యక్తులకు ఇవ్వడం పరిపాటిగా మారింది. ఒక్కమాటలో చెప్పాలంటే సహకార సంఘాలను నిర్వీర్యం చేశారు. గృహనిర్మాణం, ఇతర రుణ విభాగాల్లో రూ.12 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు తేలింది.

2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, పలమనేరు, మదనపల్లె నియోజకవర్గాల్లో నిబంధనలకు విరుద్ధంగా రూ.20 కోట్ల మేర రుణాలు మంజూరు చేశారు. భూములు తాకట్టు పెట్టి అంతా సక్రమంగా ఉందని నిర్ధారించుకున్న తర్వాతే అప్పు ఇవ్వాల్సి ఉండగా ఇవేవీ లేకుండానే డబ్బులు ఖాతాల్లో జమచేశారు. లబ్ధి పొందిన వారిలో 90 శాతం మంది వైకాపా నాయకులే కావడం గమనార్హం.

**అధికారులూ కుమ్మక్కు**

వైకాపా హయాంలో 76 సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేశారు. పాలకవర్గాలతో అప్పటి అధికారులూ కుమ్మక్కయ్యారు. దాంతో అటు సభ్యులైన ఫ్యాను పార్టీ నాయకులు, అధికారులు, ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అందరూ ఎడాపెడా రుణాలు తీసుకున్నారు. ఈ మొత్తాలను తిరిగి డీసీసీబీకి చెల్లించలేదు. చాలాచోట్లా ఇదే పరిస్థితి. పనులు చేయాల్సిన అధికారులు తమ పని కాదన్నట్టుగా వ్యవహరించారు.

**సభాసంఘం సిఫార్సులే తరువాయి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీఆర్వో మోహన్‌కుమార్ అక్రమాలపై విచారణ జరిపారు. ఈ క్రమంలోనే 11 మంది ఉద్యోగులపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ అక్రమాలపై రాష్ట్రస్థాయిలో ప్రత్యేక సభాసంఘాన్ని నియమించారు. చైర్మన్‌గా జిల్లాకు చెందిన పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఉన్నారు. ఆయన ఆధ్వర్యంలోని కమిటీ అక్రమాలపై ఎలాంటి చర్యలకు సిఫార్సు చేస్తుందన్నది చూడాలి.

పక్కదారి పట్టిన నిధులు

బైరెడ్డిపల్లె రూ.2 కోట్లు

పలమనేరు రూ.80 లక్షలు


శ్రీకాళహస్తి రూ.60 లక్షలు

సత్యవేడు రూ.60 లక్షలు

# ఇక్కడ.. సాగరంతో జాగ్రత్త..!

పెదవాల్తేరు: సహజ సిద్ధమైన విశాఖ తీరం ఎంతో అందమైనదిగా గుర్తింపు పొందింది. దేశవిదేశాల నుంచి నిత్యం పర్యాటకులు తీర అందాలు చూడటానికి వస్తుంటారు. అలల మాటున ప్రమాదం దాగి ఉందనే విషయం చాలా మంది గుర్తించడం లేదు. సరదాగా ఈత కొట్టడానికి వెళ్లి రాకాసి కెరటాల్లో చిక్కుకుపోయి మృత్యువాత పడుతున్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి నగర పోలీసు కమిషనర్ ప్రమాదకర తీర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పోలీసు యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది.

**ఇదిగో ఇక్కడ:** మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు తీర ప్రాంతాల్లో ఇప్పటికే జీవీఎంసీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు ఉన్నాయి. ఇటీవల మరికొన్ని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించామని, అక్కడ ఆరు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని సీఐ పైడయ్య తెలిపారు. ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయం ఎదురుగా, పాండురంగాపురం డౌన్లో, వై.ఎం.సి.ఎ., పార్కు హోటల్ వెనుక, లైట్ హౌస్ వద్ద, పెదజాలరిపేట ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా షిఫ్ట్‌కు కుగురు చొప్పున 12మంది గజ ఈతగాళ్లు,




మెరైన్ పోలీసులు, బీచ్ పర్యవేక్షణ సిబ్బంది నిత్యం పహారా కాస్తుంటారని చెప్పారు.**కాటేస్తున్న 'కరెంట్'**

విశాఖ తీరం తూర్పు కనుమల్లో భాగం కావడంతో ఇక్కడ సముద్రంలో కొండలు, గుట్టలు, రాళ్లు అధికంగా ఉన్నాయి. అదే విధంగా హఠాత్తుగా అలల మధ్య 'కరెంట్' జలాలు పుట్టుకొస్తుంటాయి. వాటిల్లో చిక్కుకుంటే బయటపడటం అంత సులువు కాదు. దీంతో స్నానాలు చేయడానికి అనువైన తీరం కాదని సముద్ర అధ్యయన శాస్త్రవేత్తలు ఇప్పటికే హెచ్చరించారు. సంవత్సరాలుగా యంత్రాంగం సరైన చర్యలు తీసుకోకపోవడంతో తీరంలో తరచూ పలువురు మృత్యువాత పడుతున్నారు. ఎట్టకేలకు ఇప్పుడు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

# పంట తెగుళ్ల భరతం పట్టారు!

అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లా అత్యంత కరవు నేల. ఇక్కడ ఏ పంట వేసినా వాతావరణం అనుకూలించకపోవడం, అన్నీ బాగున్నా వివిధ రకాల తెగుళ్ల బెడదతో పంట నాశనమవడం చూస్తూనే ఉన్నాం. తెగుళ్ల భరతం పట్టేందుకు అనంతపురంలోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలోని జీవ నియంత్రణ ప్రయోగశాల నడుం బిగించింది. ఎన్నో ప్రయోగాలు చేపట్టి ట్రైకోడెర్మా విరిడి, సుడోమోనాస్‌ను తయారు చేసింది. వీటిని ఉమ్మడి జిల్లా పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని చేయడం విశేషం. వేరుకుళ్లు, కాండం కుళ్లు, మాగుడు ఎండు తెగుళ్ల నివారణ, బ్యాక్టీరియా జాతికి చెందిన జీవన క్రిమినాశిగా పని చేస్తున్నాయి. విత్తన శుద్ధిలోనూ కీలకపాత్ర పోషిస్తున్నాయి. చెట్టు కాండానికి రక్షణ కవచంలా ఉంటూ అధిక దిగుబడులకు ఊతమిస్తాయి. ఆయా మండలాలను వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న పథకాలకు 50 శాతం రాయితీ,



రైతులకు పూర్తి ధరతో విక్రయిస్తున్నామని జీవ నియంత్రణ ప్రయోగశాల బాధ్యుడు సుంకరకు తెలిపారు.

# ఇంటి వద్దకే కార్గో సేవలు

నంద్యాల : రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) కార్గో సేవల ద్వారా పార్సిళ్లు, సరకులను తక్కువ ధరకు రవాణా చేస్తోంది. ప్రైవేటు కొరియర్ సేవలతో పోలిస్తే ఈ సేవలు చౌకగా ఉంటాయి. ఇంటి వద్దకే డెలివరీ, బీమా సౌకర్యం వంటి అదనపు సౌకర్యాలు అందిస్తుంది. బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తూ ఆదాయం ఆర్జిస్తున్న ఆర్టీసీ.. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల పెంపుపై దృష్టి సారించింది. నష్టాలను పూడ్చుకోవడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా కార్గో సేవలను విస్తరిస్తోంది.

**2017లో ప్రారంభం**

ఆర్టీసీ సంస్థ 2017లో సరకు రవాణాకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లోని నంద్యాల, డోన్, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు డిపోల్లో డోర్ డెలివరీ సేవలు అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే మిగతా డిపోలకూ ఈ సేవలు విస్తరించనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. కార్గో సేవలపై ప్రజలు ఆసక్తి కనబరుస్తుండడంతో ఆర్టీసీకి ఆదాయం సమకూరుతోంది. ఈ సేవలకు ప్రభుత్వరంగ సంస్థలు, విభాగాలు సహకరిస్తుండడంతో పార్సిల్ సర్వీసు విజయవంతమవుతోంది.




**ఇతర రాష్ట్రాలకు సైతం**

ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సరకులను డోర్ డెలివరీ చేస్తున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, బళ్లారి, రాయచూరు వంటి ఇతర రాష్ట్రాలకు విత్తనాలు, విడిభాగాలు, ఔషధాలు, పూలు, పండ్లు, కూరగాయలు, టైర్లు, అరటి ఆకులు వంటి సరకులను వేగవంతంగా సరఫరా చేస్తూ కార్గో ప్రత్యేకత సంతరించుకుంది. మనం పంపిన పార్సిల్‌ను ట్రాకింగ్ చేసుకునే అవకాశం ఉంది. పార్సిల్ ఎక్కడ ఉందో, ఎప్పుడు డెలివరీ అవుతుందో ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రజలు కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.

# గుట్టల్లో 'భూ'చోళ్లు

కదిరి : పట్టణ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. స్థలాలకు విలువ పెరుగుతోంది. దీంతో అక్రమార్కులు ప్రభుత్వ భూములపై కన్నేస్తున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు వాలిపోతున్నారు. గుట్టలు, శ్మశానవాటికలను సైతం వదలట్లేదు. రాత్రికి రాత్రి చదును చేస్తున్నారు. తెల్లారేసరికి తమ అధీనంలోకి తీసుకుంటున్నారు. ఎవరైనా ప్రశ్నించినా.. అడ్డుకున్నా దాడులకు తెగబడుతున్నారు. వాటికి పట్టాలు సృష్టించి అమ్ముకుంటున్నారు. ఈ దందా జిల్లాలో నిత్యం ఎక్కడో ఒకచోట జరుగుతున్నా.. సంబంధిత అధికారులు కేవలం నోటీసులు, హెచ్చరికలతో సరిపెడుతుండటంపై విమర్శలు వెల్లువెత్తాయి.

**ఆక్రమణలు ఎక్కడెక్కడంటే..**

నల్లచెరువు మండలం అల్లుగుండు పంచాయతీ సర్వేనంబరు 01లో కదిరికి చెందిన ఓ వ్యక్తి పందికోన వద్ద వాగును చదును చేసి రెండెకరాల్లో మామిడి మొక్కలు నాటారు. అధికారులు నోటీసు ఇచ్చి సరిపెట్టేశారు. కదిరి మండలం సున్నపుగుట్టతండా వద్ద అదే గ్రామానికి



చెందిన ఓ వ్యక్తి సర్వేనంబరు 148లో ఎకరా భూమిని ఆక్రమించుకుని పండ్ల మొక్కలు, ఉలవ పంట సాగు చేశాడు. ఆయన్ను కార్యాలయానికి పిలిపించి హెచ్చరించి పంపేశారు. ఆ తరువాత అధికారులు అటువైపు తొంగి చూడకపోవడంతో మళ్లీ పంటలు సాగు చేస్తున్నాడు. తాజాగా సర్వేనంబరు 148-2లో దాదాపు మూడెకరాలు ఉన్న గుట్టను ఆదివారం రాత్రి చదును చేసి ప్లాట్లు వేసేందుకు ఓ వ్యక్తి సిద్ధమయ్యాడు. స్థానికులు అడ్డుకోవడంతో పరారయ్యారు. ఈ ప్రాంతంలో ఎకరా భూమి కోటి రూపాయలకుపైనే పలుకుతోంది.

**అన్యాక్రాంతం కాకుండా చర్యలు**

ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత గ్రామరెవెన్యూ అధికారులు, తహసీల్దార్లపై ఉంది. సర్కార్ భూములను గుర్తించి, అవి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలి. కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల వివరాలు, వాటిని అడ్డుకోవడానికి తీసుకున్న చర్యలపై నివేదిక పంపాలని తహసీల్దార్లను ఆదేశిస్తాం. ఆక్రమణలను అడ్డుకోవడానికి తీసుకుంటున్న చర్యలను తెలియజేయాలని సూచిస్తాం.
సూర్యనారాయణరెడ్డి, డీఆర్ఓ, పుట్టపర్తి

# ఆస్తులతో సెల్‌గాటం



చిత్తూరు : సదుం మండలం జోగివారిపల్లిలో 470 ఆస్తులు గుర్తించారు. అందులో 360 ఆస్తులకు ఒకే సెల్ నంబరు నమోదు చేయడంతో ఆ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. - చౌడేపల్లి మండలం పెరికిదొనలో 447లో 306 ఆస్తులకు ఒకే చరవాణి నమోదు చేశారు. గుడిపాల మండలం పానాటూరులో 418, యాదమరి మండలం 12 కమ్మపల్లిలో 252, పూతలపట్టులో 562 ఆస్తులకు ఒకే నంబరు నమోదు చేయడంతో కార్యదర్శులకు నోటీసులిచ్చారు. గ్రామీణ ప్రజల ఆస్తులతో కొందరు పంచాయతీ కార్యదర్శులు చెలగాటమాడుతున్నారు. స్వర్ణ పంచాయతీ యాప్‌లో ఒకరి ఆస్తులకు మరొకరి ఫోన్ నంబర్లు జోడించారు. కార్యదర్శులు తప్పుడు నంబర్లు నమోదు చేసిన విషయం వాస్తవమేనని, తప్పులు సరి చేస్తున్నట్లు డీపీవో సుధాకర్‌రావు తెలిపారు. కార్యదర్శులు ఆస్తి యజమానితో మాట్లాడి ఫోన్ నంబరు, ఆధార్ తీసుకోవాలి. అయితే కొందరు కార్యదర్శులు ఒకే చోట కూర్చుని ఇష్టం వచ్చినట్లు మ్యాపింగ్ చేయడంతో పరిస్థితి తలెత్తింది.

# శునకాలు.. ఇక షెల్టర్లకే



పుత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, తిరుపతి నగర పాలికలు, పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు, నగరి, కుప్పం, పుంగనూరు, పలమనేరు మున్సిపాలిటీల్లో 27,350 కుక్కలు ఉన్నాయి. ఏటా నగరపాలక, పురపాలికల అధికారులు వాటి సంతతి పెరగకుండా వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేపడుతున్నట్లు లెక్కలు చూపుతున్నారు. అయితే నగరాలు, పట్టణాల్లో వీటి సంతతి మాత్రం తగ్గకపోగా పెరుగుతోంది.

తిరుపతి జిల్లా పుత్తూరు పట్టణంలో గతేడాది డిసెంబరు 19న విష్ణుమహల్ థియేటర్ నుంచి కార్వేటినగరం రోడ్డు వరకు 27మందిని పిచ్చికుక్క కరిచింది. కుక్కకాటుకు గురైన వారంతా ఆస్పత్రికి వచ్చి ఏఆర్‌వీ, హిమినోగ్లోబిన్ ఇంజెక్షన్లు వేయించుకున్నారు. కొందరికి గాట్లు పెద్దవి కావడంతో రెండు, మూడు కుట్లు వేశారు.

తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని బాలాయపల్లి మండలం కయ్యూరు ఎస్టీ కాలనీకి చెందిన రెండేళ్ల బాలుడు సుమన్ ఇంటి వద్ద ఆడుకుంటుండగా వీధికుక్కలు దాడి చేశాయి. ముఖంపై గాట్లు పడటంతో ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం.

చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణంలో రోజుకు నాలుగైదు కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. దీంతో ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్నారు.

దేశ అత్యున్నత న్యాయస్థానం విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్సు, రైల్వేస్టేషన్‌లోకి శునకాలు రాకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఆయా సంస్థల ప్రాంగణంలోకి అవి చొరబడకుండా కంచెలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. నోడల్ అధికారులు క్రమం తప్పక తనిఖీలు నిర్వహించి సమస్య తలెత్తకుండా చూడాలని ఉత్తర్వులు ఇచ్చింది. నోడల్ అధికారుల వివరాలు ఆయా ప్రాంగణాల్లో ప్రవేశ ద్వారం వద్ద ప్రదర్శించాలని సూచించింది. అదే సమయంలో జన సమర్థ, బహిరంగ ప్రదేశాల్లో సంచరించకుండా చూడాలని ఆదేశాలిచ్చింది.

**మందులు పర్వాలేదు..**

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు ఉన్నాయి. ఒక్కో సమయంలో కుక్క కాటు అధికంగా జరిగిన సందర్భంలో పక్కనున్న ఆసుపత్రుల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి.

నగరాలు, పురపాలికల్లో కుక్కల వివరాలు
చిత్తూరు జిల్లా: 9,250
తిరుపతి జిల్లా: 18,100

**విధిగా పాటించాల్సిందే..**

వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి అన్ని నగర, పురపాలికలు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాల్సిందే. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని నగర, మున్సిపాలిటీల్లో పునరుత్పత్తి జరగకుండా స్టెరిలైజేషన్ ప్రక్రియ కోసం కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చాం. త్వరలోనే అన్ని కేంద్రాల్లో వీటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.
నాగరాజు, ఆర్డీ, అనంతపురం

# అక్షరం.. ఆకట్టుకునే అందం



శ్రీకాళహస్తి: ఉపాధ్యాయులకు చేతిరాత శిక్షణ అని వినగానే కాస్తంత ఆశ్చర్యం వేస్తోంది కదూ. నిజమే ఓ విద్యార్థి తన చేతిరాత మెరుగుపరుచుకుంటే అతనొక్కడే లబ్ధి పొందుతాడు. అదే ఓ ఉపాధ్యాయుడు నేర్చుకుంటే వందమంది విద్యార్థుల చేతిరాతలో మార్పు తీసుకువచ్చే అవకాశముంది. దీన్ని గమనించిన బాబుఅగ్రహారం పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి ఆమె నేర్చుకోవడంతో పాటు పురపాలక సంఘం పరిధిలోని సహచర ఉపాధ్యాయులకు రెండురోజుల శిక్షణకు సంకల్పించారు. ఇందుకు 70 మంది హాజరవడం విశేషం.

**చేతిరాత బాగలేక సిగ్గుపడ్డా**

మాది గుంటూరు. గణితశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నా. 2016 జాతీయ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందా. అయినా నా చేతిరాత పిల్లలకు అంతగా అర్థమయ్యేది కాదు. దీంతో సిగ్గుపడ్డా. దీనిపై పలు దఫాలుగా పరిశోధనలు చేయడం, చేతిరాత మెరుగు పరుచుకునేందుకు ఎంతో శ్రమించడంతోపాటు ఆ కష్టాన్ని పుస్తకరూపంలోకి తీసుకువచ్చా. పలు జిల్లాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి మార్పు తీసుకువచ్చా. ఇప్పటి వరకు 77 వేల మందికి శిక్షణ ఇచ్చా.
వి.రామ్మోహన్‌రావు, చేతిరాత శిక్షకులు, గుంటూరు

**నా వంతు బాధ్యత**

దసరా సెలవుల్లో గుంటూరులో రెండ్రోజుల శిక్షణ తీసుకున్నా. ఎంతో మార్పు వచ్చింది. ఇదే శిక్షణ పిల్లలకు ఇస్తున్నా. శిక్షణ ఉపాధ్యాయులకు ఇస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందని గుర్తించా. ఉపాధ్యాయుల సహకారం, కుటుంబీకుల ప్రోత్సాహంతో దాదాపు రూ.80 వేల వ్యయంతో శిక్షణకు సిద్ధపడ్డా. గుంటూరు నుంచి శిక్షకులను పిలిపించడంతో పాటు వసతులు కల్పించా.
శ్రీదేవి, హెచ్‌ఎం, పురపాలక పాఠశాల

**అక్షరాలు అందంగా ఉండాలి**

అక్షరాలు అందంగా ఉంటే ఆ గుర్తింపు వేరే విధంగా ఉంటుంది. నా అక్షరాలు బాగుంటాయని భావిస్తూ వచ్చా. శిక్షణ తీసుకున్నాక నేనే నమ్మలేని విధంగా మార్పు వచ్చింది. ఉపాధ్యాయుల అనుమతితో ఈ శిక్షణలో పాల్గొన్నా.
శాంతి, ఏవో, ఆర్డీవో కార్యాలయం

# నిబంధనలకు పాతరేసి.. ప్రమాదాలకు తెరతీసి!



అనంతపురం: ధనార్జనే ధ్యేయంగా జిల్లాలోని పలు క్వారీల నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. పేలుడు పదార్థమైన అమ్మోనియం నైట్రేట్‌ను అత్యంత ప్రమాదకర రీతిలో అక్రమ రవాణా చేస్తున్నారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా రసాయనాన్ని ఎక్కడికెక్కడ నిల్వ ఉంచుతున్నారు. చౌకగా క్వారీల్లో పేలుళ్లు చేపట్టడానికి నిర్వాహకులు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. కనీస భద్రత ప్రమాణాలు పాటించకుండా హైదరాబాద్ నుంచి జాతీయ రహదారిపై టన్నుల కొద్దీ అమ్మోనియం నైట్రేట్‌ను బొలెరో వాహనాల్లో తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో ఏమాత్రం ప్రమాదం జరిగినా ప్రాణనష్టం సంభవిస్తుంది. పామిడి మండలంలోని ఓ కంకర క్రషర్‌లో నిల్వ ఉంచిన 5 టన్నుల అమ్మోనియం నైట్రేట్‌ను పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. బాధ్యులను అదుపులోకి తీసుకుని విచారించగా జిల్లాలోని చాలా క్వారీలకు అక్కడి నుంచే పేలుడు పదార్థాన్ని సరఫరా చేస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.

**తమిళనాడు కంపెనీ పేరుతో..**

అమ్మోనియం నైట్రేట్‌ను వినియోగించాలంటే ముందుగా పేలుడు పదార్థాల భద్రతా సంస్థ నుంచి అనుమతులు తీసుకోవాలి. లైసెన్సు ఉన్న వాళ్లు మాత్రమే విక్రయించాలి. అనుమతులు ఉన్న తమిళనాడు కంపెనీ పేరుతో అమ్మోనియం నైట్రేట్‌ను కొనుగోలు చేసి జిల్లాలో నిల్వ చేస్తున్నారు. ఇందుకుగాను సదరు కంపెనీకి పెద్దమొత్తంలో కమీషన్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. తాడిపత్రికి చెందిన ఓ క్వారీ నిర్వాహకుడు తెలంగాణ నుంచి అమ్మోనియం నైట్రేట్‌ను తీసుకొస్తున్నారు. పామిడిలో నిల్వ చేసి రాత్రి వేళల్లో ఇతర క్వారీలకు సరఫరా చేస్తున్నారు.

లైసెన్సు ఉండి అనుభవం ఉన్న వ్యక్తుల ఆధ్వర్యంలో కంట్రోల్ బ్లాస్టింగ్ చేయాల్సి ఉంటుంది. కొందరు క్వారీల నిర్వాహకులు వంద అడుగుల వరకు రంధ్రాలు చేయించి.. అందులో అమ్మోనియం నైట్రేట్‌ను నింపి పేలుళ్లకు పాల్పడుతున్నారు. దీనివల్ల చుట్టుపక్కల భూమి కంపించడంతో పాటు వాయుకాలుష్యానికి దారి తీస్తోందని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఆంక్షలు ఉన్నా..**

సాధారణంగా అమ్మోనియం నైట్రేట్‌ను ఎరువుల తయారీలో ఉపయోగిస్తారు. అలాగే మైనింగ్, భవన నిర్మాణ రంగాల్లో పేలుళ్ల కోసం వాడతారు. కొనుగోలు, రవాణా, వినియోగంపై కఠిన ఆంక్షలున్నాయి. తయారీకి పలు అనుమతులు కావాలి. జనావాసాల్లో నిల్వ చేయకూడదు. ఇతర రసాయనాలతో కలిస్తే చాలా ప్రమాదకరం. జిల్లాలోని పామిడి, వజ్రకరూరు, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లోని పలు కంకర క్వారీల్లో పేలుళ్ల కోసం భారీగా ఉపయోగిస్తున్నారు.

# వారు రమ్మంటారు.. వీరు రామంటారు!

ఉంగుటూరు : ఉపాధి పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి.. పారదర్శకతకు పెద్దపీట వేసేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. శ్రామికులు తప్పనిసరిగా ఈకేవైసీ చేపట్టాలని ఆదేశించాయి. జిల్లాలో కొన్నాళ్ల కిందట ప్రక్రియ ప్రారంభం కాగా, నేటికీ మందకొడిగా సాగుతోంది. ఉంగుటూరులో అత్యధికంగా 89.01 శాతం, నూజివీడులో అత్యల్పంగా 72.28 శాతం పూర్తయింది.

**దొంగ మస్తర్లకు చెక్**

ఇప్పటి వరకు పని ప్రదేశంలో శ్రామికులను గ్రూపుగా ఫొటో తీసి హాజరు నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియలోనూ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ ఆధారిత హాజరు(ఫేషియల్ రికగ్నైజ్డ్ అటెండెన్స్) వేయాలని నిర్ణయించింది. తద్వారా జాబ్ కార్డులన్నింటికీ ఈకేవైసీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలో ఈకేవైసీ పూర్తయితేనే పని కల్పిస్తారు. ఆపై దొంగ మస్తర్లకు అవకాశం ఉండదు.



**వేధిస్తున్న సహాయకుల కొరత**

ఉపాధి హామీ పథకంలో కీలకంగా వ్యవహరించే క్షేత్ర సహాయకుల (ఫీల్డ్ అసిస్టెంట్లు) కొరత వేధిస్తోంది. పలువురు అవకతవకలకు పాల్పడి సస్పెండ్ కాగా.. మరికొందరు నిర్దేశిత లక్ష్యాలు పూర్తి చేయలేక విధులకు దూరమయ్యారు. ఇంకొందరు వ్యక్తిగత కారణాలతో మానేశారు. దీంతో చాలా చోట్ల ఖాళీలు ఏర్పడ్డాయి. ఆయా ఖాళీలను మేట్లతో భర్తీ చేశారు. దీంతో ఈకేవైసీ ప్రక్రియ నెమ్మదించింది. జాబ్‌కార్డు ఉండి పనులకు రానివారు ఈకేవైసీకి ఆసక్తి చూపడం లేదు. అలాగని జాబ్‌కార్డు అవసరం లేదని అంగీకార పత్రమివ్వడానికీ ముందుకు రావడం లేదు. జాబ్‌కార్డున్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని డ్వామా పీడీ సుబ్బారావు స్పష్టం చేశారు.

**జిల్లా వివరాలిలా..**

మొత్తం శ్రామికులు: 6,49,871
ఈకేవైసీ పూర్తి: 4,91,063
క్రియాశీలకం: 5,34,144
పూర్తి: 4,40,675

# ఆసుపత్రులు.. కొన్ని గంటలే సేవలు!

అనంతపురం : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (యూపీహెచ్‌సీ) కొందరు వైద్యులు కొన్ని గంటల మాత్రమే విధులు నిర్వహించి వెళ్తున్నారు. కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పని చేయాల్సి ఉంది. కొన్నిచోట్ల ఉదయం 10, 11 గంటలైనా రావటం లేదు. మరికొందరు 9 గంటలకు వచ్చినా రెండు లేదా మూడు గంటలు ఉండి ఓపీకి వచ్చిన రోగులను చూసి వెళ్లిపోతున్నారు. ఇదే తీరుగా సిబ్బంది సైతం వెళ్తున్నారని రోగులు వాపోయారు అనంత నగరంలోని కొన్ని కేంద్రాలను పరిశీలించగా ఈ పరిస్థితి నెలకొంది. ఆయా కేంద్రాల్లో వివిధ పరీక్షలు నిర్వహించే కిట్లు, వారికి అందజేసే మందులు అందుబాటులో లేకపోవటం గమనార్హం.

అనంతపురంలోని నాయక్‌నగర్ యూపీహెచ్‌సీలో వైద్యురాలు ఉదయం 10.30 గంటలైనా రాలేదు. హమాలీకాలనీలోని కేంద్రంలో ఉదయం 10.40 గంటలకు వచ్చారు. అక్కడి సిబ్బంది రోగులతో మాట్లాడి వారి సమస్యలను బట్టి ఔషధాలు ఇవ్వడం కనిపించింది.

కొన్ని కేంద్రాల్లో వైద్యులు రాలేదని ఆరా తీస్తే డీఎంహెచ్‌వో కార్యాలయానికి, క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారని సిబ్బంది చెప్పడం గమనార్హం. చాలా కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉంది.

దివ్యాంగులు, వృద్ధులకు చక్రాల కుర్చీలు అందుబాటులో లేవు. కొన్నిచోట్ల కొత్తవి వచ్చినా మూలకు ఉంచారు.

నగరంలో కేంద్రాల సంఖ్య : 10
రోజు వారీగా ఓపీకి వస్తున్నవారు: 40 నుంచి 80



**ఇవి అందుబాటులో ఉండాలి**

కేంద్రాల్లో 63 రకాల పరీక్షలు చేయాలి. రోగులకు అవసరమయ్యే 174 రకాల ఔషధాలు అందుబాటులో ఉంచాలి.

కొన్ని చోట్ల రక్తపోటు నియంత్రణ మందులు అందుబాటులో లేవు. కామెర్ల పరీక్ష చేసేందుకు అవసరమైన కిట్లు ఉండకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.


**విచారించి.. చర్యలు తీసుకుంటాం**

డాక్టర్ ఈ.బి.దేవి, డీఎంహెచ్‌వో
వైద్యులు, సిబ్బంది విధిగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉండాలి. సమాచారం లేకుండా కేంద్రాల్లో లేకపోతే చర్యలు తప్పవు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుటాం.

## స్మార్ట్ కార్డు తీసుకున్నారా?

పాయకరావుపేట: రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా కొత్తగా స్మార్ట్ కార్డులను మూడు నెలల కిందట అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి పంపిణీ బాధ్యతను గ్రామ సచివాలయాల సిబ్బందికి, రేషన్ డీలర్లకు అప్పగించారు. మూడు నెలలు దాటుతున్నా.. ఇప్పటికీ వేల సంఖ్యలో కార్డులు ఉండిపోయాయి. వీటిని తీసుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రాలేదు. వలస వెళ్లిన వారు కార్డులు తీసుకోవడం ఇబ్బందిగా మారుతోంది.


అనకాపల్లి మండల పరిధిలో అత్యధికంగా 4,220 మంది లబ్ధిదారులు కార్డులు తీసుకోలేదు. అచ్యుతాపురంలో 2,168, ఎలమంచిలిలో 1,740, చోడవరంలో 1,632, నర్సీపట్నంలో 1,466, పాయకరావుపేటలో 1,302, మాడుగులలో 1,228, రావికమతంలో 1,117, బుచ్చెయ్యపేటలో 1,112, పరవాడలో 1,092, రాంబిల్లిలో




1,073, కోటవురట్లలో 1,053, గొలుగొండలో 1,015, కశింకోటలో 1,004, నాతవరంలో 996, నక్కపల్లిలో 935, కె.కోటపాడులో 883, ఎస్.రాయవరంలో 813, రోలుగుంటలో 701, చీడికాడలో 655, దేవరాపల్లిలో 544, మునగపాకలో 443 మంది నేటికీ కార్డులు తీసుకోలేదు. కార్డుదారులు ఉన్నారా.. లేరా అని అధికారులు ఆరా తీస్తున్నారు. కార్డులు తీసుకోవాలంటే లబ్ధిదారుల్లో ఎవరైనా ఒకరు వచ్చి బయోమెట్రిక్ వేసి ఓటీపీ చెప్పాలి. తద్వారా బోగస్ కార్డులుంటే బయటపడుతుంది. పంపిణీ కాకుండా ఉండిపోయిన కార్డులను తహసీల్దారు కార్యాలయాల్లో అందజేయాలన్న ఆదేశాలు వచ్చాయి. నెలాఖరులోగా తీసుకోకుంటే వెనక్కు పంపేస్తామని పౌరసరఫరాల జిల్లా అధికారి మూర్తి చెప్పారు.

# వద్దన్నా వినరే

పాయకరావుపేట: తాండవ నది ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. పోలవరం కాలువ తవ్వకాల్లో వచ్చిన గ్రావెల్ తీసుకొచ్చి నది ఒడ్డున గుట్టలుగా వేస్తున్నారు. అయిదేళ్ల క్రితం ఎడమ కాలువ తవ్వకంలో భాగంగా గ్రావెల్‌ను తీసుకొచ్చి పట్టణంలోని తాండవ చక్కెర కర్మాగారం సమీపంలోని భూమి ఆనకట్టకు కొద్దిదూరంలోని నదిలో గ్రావెల్‌ను గుట్టలుగా వేశారు. దీంతో ఆనకట్ట ముందు భాగంలో నీటి నిల్వ సామర్థ్యం బాగా తగ్గింది. భూమి కాలువలకు నీరు సకాలంలో చేరడం లేదు. నది వెడల్పు బాగా తగ్గిపోయింది. కొన్నేళ్ల నుంచి ఇదే సమస్య రైతులను వేధిస్తోంది. ఇటీవలే హోంమంత్రి వంగలపూడి అనిత దృష్టికి రైతులు, జల వనరుల శాఖ అధికారులు తీసుకెళ్లారు. దీనిపై ఆమె భూమి ఆనకట్ట వద్ద గ్రావెల్ తొలగించాలని, భవిష్యత్తులో ఇక్కడ గ్రావెల్ వేయవద్దని పోలవరం గుత్తేదారులకు ఆదేశాలు ఇచ్చారు. అయినప్పటికీ ఏమాత్రం మార్పు రాలేదు. తాజాగా కొన్ని రోజుల నుంచి కొండలు తవ్వగా వచ్చిన గ్రావెల్‌ను లారీలపై తీసుకొచ్చి ఇక్కడే వేస్తున్నారు. దీంతో నదిలో మరింత పూడిక పెరిగే అవకాశముందని అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. భూమి ఆనకట్ట ఎగువభాగం పూర్తిగా పూడికతో నిండిపోయే ప్రమాదం పొంచి ఉంది. దీనిపై జల వనరుల శాఖ డీఈ ఎంవీ సురేష్‌కుమార్‌ను వివరణ



కోరగా గ్రావెల్ నది ఒడ్డున వేయకుండా చూస్తామని పేర్కొన్నారు.

**మారేడిపూడిలో ఆగని దందా**

మారేడిపూడిలో గ్రావెల్ దందాకు అడ్డుకట్ట పడలేదు. సర్వే నంబరు 353లోని గెడ్డ పోరంబోకు స్థలంలో ఉన్న గ్రావెల్‌ను కొద్దిరోజులుగా రాత్రివేళ్లల్లో ఇష్టానుసారంగా యంత్రాలతో తవ్వేస్తున్నారు. కొంతమంది ముఠాగా ఏర్పడి చీకటిపడగానే యంత్రాలు, వాహనాలతో వాలిపోతున్నారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు గ్రావెల్ తవ్వేసి తరలించేస్తున్నారు. గ్రామస్థులు పలుమార్లు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. వీఆర్వోకు సమాచారం ఇస్తే చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో రాత్రి గస్తీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# దశ తిరగనున్న పర్యాటకం

విశాఖపట్నం: గూగుల్ సిటీగా, ఏఐ నగరంగా విశాఖ రూపుమారనుంది. ఇదే తరుణంలో పర్యాటకంగానూ ఎన్నో సౌకర్యాలు పెరగనున్నాయి. విశాఖలో ఈ నెల 14, 15న ‘సీఐఐ భాగస్వామ్య సదస్సు’లో ఆతిథ్య, పర్యాటక రంగంలో భారీ పెట్టుబడుల వస్తాయని అంచనా. విశాఖ కేంద్రంగా రూ.పది వేల కోట్ల ప్రాజెక్టులు ఆరంభించాలన్నది లక్ష్యం. జిల్లాలో పెట్టుబడులకు అనువైన అంశాలపై పర్యాటకశాఖ ప్రధాన కార్యాలయంలో పెట్టుబడిదారులు సంప్రదిస్తున్నారు. ఎక్కువగా భీమిలి నియోజకవర్గం, ఆర్‌కే బీచ్ ప్రాంతాలపై దృష్టిసారించారు.

గమ్య నగరం విశాఖ సహజసిద్ధ వనరులకు పెట్టింది పేరు. చుట్టూ కొండలు, అనువైన సముద్ర తీరం పర్యాటకానికి ఊతమిస్తుంది. నగరీకరణ పోకడల నేపథ్యంలో ఆ తరహా ప్రాజెక్టుల ఏర్పాటుకు పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారు. పర్యాటకశాఖ అధికారులు అందుకు అనువైన స్థలాలు ఎంపిక చేసి నివేదికలను కలెక్టరుకు అందించారు. ప్రస్తుతం 300 ఎకరాలుడగా.. మరో 300 ఎకరాలు అదనంగా అవసరమంటున్నారు. భీమిలి మండలం అన్నవరంలో రూ.వందల కోట్లతో ఇప్పటికే ఒబెరాయ్, మేఫెయిర్ ప్రాజెక్టులు సాగుతున్నాయి. వీటితో పాటు మరికొన్ని రిసార్టులు రానున్నాయి. భీమిలి మండలం కొత్తవలస కొండపై రూ.1000 కోట్ల పెట్టుబడితో భారీ పర్యాటక ప్రాజెక్టు రానుంది. దీనికి సీఐఐ సదస్సులో ఒప్పందం జరగనుంది.

ఉజ్వల భవిష్యత్తు: విశాఖ కేంద్రంగా గూగుల్ డేటా సెంటర్, ఏఐ సెంటర్లు, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థల కార్యకలాపాలు విస్తరిస్తే పర్యాటక రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. పర్యాటక, ఆతిథ్యరంగంలో భారీ పెట్టుబడులను ఆశించొచ్చు. ఆ దిశగానే ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తుంది. అందుకు తగ్గ వనరులు విశాఖలో ఉన్నాయి.

# పొగాకు కొనుగోళ్లలో దళారులు



ఒంగోలు : రైతులు, వ్యాపారులకు మధ్య వారధిగా ఉంటూ పొగాకు పంట ఉత్పత్తికి గిట్టుబాటు ధర వచ్చేవిధంగా బోర్డు క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. తద్వారా బోర్డుకు కూడా వారిద్దరి నుంచి సర్వీసు ఛార్జీ వస్తోంది. సాగు చేసిన పంటను పూర్తిగా వేలం కేంద్రాల ద్వారానే అమ్మేవిధంగా ఒప్పందం ఉంటుంది. పొగాకు పంటను వ్యాపారి కొనాలన్నా..రైతు అమ్మాలన్నా అంతా బోర్డు ద్వారానే జరగాలి. ఇలాంటి నిబంధన ఇతర ఏ పంటలకు ఉండదు. ఏటా రైతు చేతికి పంట ఉత్పత్తి వచ్చే సమయం నుంచే బయట కొనుగోలు జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు బోర్డు విజిలెన్స్ బృందాలు నియమిస్తోంది. ఎలాంటి అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న పొగాకు పంటను పట్టుకోవడమే వారి విధి. ఈ ఏడాది ఆరంభం నుంచే దళారులు రైతుల ఇళ్లకెళ్లి అనాధికార కొనుగోళ్లు జరిపారు. ఫిర్యాదులున్నా విజిలెన్స్ అధికారులు అక్రమ కొనుగోళ్లను కట్టడి చేయడంలో విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం జిల్లాలో అమ్మకాలు తుది దశకు చేరుకున్నాయి. గత వారం రోజులుగా దళారులే నేరుగా వేలం కేంద్రాల్లోకి ప్రవేశించారు. రైతుల నుంచి బహిరంగంగా తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఈ వ్యవహారమంతా బోర్డు అధికారులకు తెలిసే జరుగుతున్నా వారు మాత్రం కట్టడి చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమెరాలున్నాయి. పైగా ప్రైవేటు కొనుగోళ్ల నిమిత్తం వ్యాపారులను కేంద్రాల్లోకి అనుమతించకూడదు. అయినప్పటికీ అక్రమ కొనుగోళు మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతున్నాయి

**పట్టించుకోని బోర్డు అధికారులు**

ప్రస్తుతం జిల్లాలోని అన్ని కేంద్రాల్లో కిలో కనిష్ఠ ధర రూ.50 నుంచి రూ.60 వరకు వేలం జరుగుతోంది. వేలం చివరి దశకు చేరుకోవడంతో రైతులు కూడా అన్ని రకాల గ్రేడ్లను వేలానికి తీసుకొస్తున్నారు. లోగ్రేడ్‌కు డిమాండు లేదన్న కారణంతో వ్యాపారులు అనాసక్తి చూపుతున్నారు. తద్వారా ప్రతి రోజూ 20 శాతానికిపైగా బేళ్లు నోబిడ్లు అవుతున్నాయి. రైతులు రవాణా ఛార్జీల భారంతో తిరిగి ఇళ్లకు తీసుకెళ్లలేక స్థానికంగా ఉండే బయట వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. నాణ్యత ఆధారంగా కిలో రూ.15 నుంచి రూ.40 వరకు అమ్మేస్తున్నారు. బయట కొనుగోళ్లను ప్రోత్సహించడం ద్వారా మార్కెట్‌లోనూ లోగ్రేడ్ ధరలు మరింత తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం అధిక పంట ఉత్పత్తి అమ్మకాలు జరుగుతుండడంతో వాటి ద్వారా వచ్చే అదనపు రుసుం, సర్వీసు ఛార్జీ రూపంలో బోర్డు ఆదాయానికి గండి పడనుంది. టంగుటూరు, ఒంగోలు-1, 2బీ వెల్లంపల్లి, కొండపి కేంద్రాలుగా కొందరు దళారులు అక్రమ కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా బోర్డు, విజిలెన్స్ అధికారులు కేంద్రాల వద్ద జరిగే బయట అమ్మకాలను కట్టడి చేయాలని రైతులు కోరుతున్నారు.

# ధీమా ఇవ్వని వాతావరణ బీమా



పుట్టపర్తి: వాతావరణంలో మార్పుల కారణంగా సంభవించే నష్టాల నుంచి ఊరట లభించేందుకు రైతులు ఆధునికీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (రీస్ట్రక్చర్డ్ వెదర్ బేస్డ్ క్రాప్ ఇన్సూరెన్స్ సిస్టమ్) కింద తమ వంతు వాటా చెల్లించారు. జిల్లాలో 2024-25 సంవత్సరానికిగాను రబీలో 2,013 హెక్టార్లలో రైతులు మామిడి సాగు చేశారు. బీమా పథకం కింద హెక్టారుకు రూ.4,500, కేంద్రం వాటా రూ.4,000 చొప్పున అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (ఏఐసీ)కి చెల్లించారు. 142 మంది రైతులు రూ.5.82 లక్షలను ఇఫ్‌కో కంపెనీకి చెల్లించారు. రబీ ముగిసి ఆరునెలలు దాటుతున్నా సదరు కంపెనీల నుంచి పరిహారం ఊసేలేదు. దీంతో రైతులు ఉద్యాన కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

**మార్పుల ఆధారంగా..:** వాతావరణ ఆధారిత అంశాల ప్రకారం అనగా ఉష్ణోగ్రత, వర్షపాతం, గాలిలో తేమ శాతం, గాలుల వేగం ఆధారంగా వీటిలో వచ్చే వ్యత్యాసాలకు అనుగుణంగా ఒక్కోదానికి హెక్టారుకు గరిష్ఠంగా రూ.22.50 వేలు చొప్పున పరిహారం ఇవ్వాల్సి ఉంది. మొత్తం హెక్టారుకు గరిష్ఠంగా రూ.90 వేలు ఇవ్వాలన్నది నిబంధన.

**లేఖలు రాసినా స్పందన కరవు:** జిల్లాలో మామిడి పంట స్థితిగతులను పరిశీలించి రైతులకు పరిహారం చెల్లించాలని ఉద్యాన అధికారి చంద్రశేఖర్ ఏఐసీకి ఏప్రిల్‌లో లేఖ రాశారు. ఇదే విషయంపై పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి కూడా లేఖ రాశారు. నేటికీ స్పందన లేదు.

**గణాంకాలు రాలేదన్న కారణంతో..**

వాతావరణ బీమాను మామిడి రైతులకు మండలం యూనిట్‌గా తీసుకున్నారు. ఆయా మండలాల్లో పైనాలుగు అంశాల్లో వాతావరణం నమోదైన గణాంకాల ఆధారంగా రైతుకు ఎంత నష్టం వాటిల్లింది.. ఎంత చెల్లించాలి అన్న విషయాలు నిర్ధారిస్తారు. ఈ గణాంకాలు రాష్ట్రవ్యాప్తంగా బీమా కంపెనీ తీసుకుంటుంది. కొంత డేటా తమకు అందకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా హెక్టారుకు రూ.4,000 చొప్పున జిల్లాకు రూ.87.54 లక్షలు చెల్లించకపోవడంతో బీమా ఇవ్వడంలో ఆలస్యమవుతోందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

జిల్లా: శ్రీసత్యసాయి
మామిడి రైతులు: 2,353
చెల్లించిన మొత్తం: రూ.89.60 లక్షలు
కేంద్రం చెల్లించిన వాటా: రూ.87.54 లక్షలు

**గణాంకాలు అందాల్సి ఉంది**దాస్, ఏఐసీ జిల్లా కోఆర్డినేటర్

వాతావరణానికి సంబంధించి కొంత డేటా రావాల్సి ఉంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ వాటా కూడా చెల్లించాల్సి ఉంది. ఇందుకోసం ఉన్నతాధికారులు రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడుతున్నారు. ప్రభుత్వం డేటా, వాటా సొమ్ము అందించిన వెంటనే రైతులకు పరిహారం చెల్లిస్తాం.

# చెత్త గుట్టలిక మాయం!



నర్సీపట్నం : పురపాలక సంఘాల్లో కొన్నేళ్లుగా టన్నుల కొద్దీ పేరుకుపోయిన వ్యర్థాల గుట్టలు కనుమరుగు కానున్నాయి. నర్సీపట్నంలో దశాబ్ద కాలంలో నిల్వ ఉన్న 6,300 మెట్రిక్ టన్నుల చెత్తను సాంకేతిక విధానాలను అనుసరిస్తూ కరిగిస్తున్నారు. ప్రభుత్వం నియమించిన ఓ ప్రైవేట్ కంపెనీ ఈ పనులు చేస్తోంది. ప్రజారోగ్య శాఖ విభాగం ఈఈ దక్షిణామూర్తి, డీఈఈ మహేష్ పర్యవేక్షిస్తున్నారు. పునర్వినియోగానికి పనికొచ్చే వస్తువులను యంత్రాల ద్వారా వేరు చేస్తున్నారు.పనికిరాని వ్యర్థాలను పొడిగా మార్చేసి లోతట్టు ప్రాంతాలను కప్పి పైన మట్టి వేసి చదును చేయనున్నారు. రెండు నెలల్లో చెత్త గుట్టను కరిగించేసి ఆ స్థలాన్ని పురపాలక సంఘానికి అప్పగించనున్నారు.

ఎలమంచిలిలో కొద్ది నెలల కిందట డంపింగ్ యార్డులో సుమారు 8,700 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తరుణ్ అసోసియేట్ కంపెనీ శాస్త్రీయ విధానంలో పూర్తిగా తొలగించింది. మరో యార్డులోని వేల టన్నుల వ్యర్థాలను తొలగించాల్సి ఉంది. ఎంత నిల్వ ఉందో అంచనా వేశాక తొలగించేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టనున్నారు. నర్సీపట్నంలో పనులు పూర్తి కాగానే ఎలమంచిలిలో శ్రీకారం చుడతామని అక్కడి కమిషనర్ పేర్కొన్నారు.

జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణ సంపూర్ణంగా జరగాలి. పోగయ్యే చెత్తను ఏ రోజుకారోజే తడి, పొడిగా వేరుచేసి సేంద్రియ ఎరువు తయారీ, పునర్వినియోగానికి పనికి వచ్చే వస్తువులను వేరు చేయాలి. 75 వేల జనాభా ఉన్న నర్సీపట్నంలో రోజుకు 16 మెట్రిక్ టన్నుల తడి, 14 మెట్రిక్ టన్నుల పొడిచెత్త పోగవుతోంది.

క్యూ-బయో ఎనర్జీ కంపెనీ ప్రతినిధులు రోజూ ఎనిమిది మెట్రిక్ టన్నుల తడి చెత్తను సేంద్రియ ఎరువుగా మారుస్తున్నారు. 14 మెట్రిక్ టన్నుల నుంచి ప్లాస్టిక్, గాజు, తోలు తదితర వస్తువులను వేరు చేస్తున్నారు. రెండో రోజులకోసారి పది మెట్రిక్ టన్నుల వ్యర్థాలను విశాఖలోని విద్యుదుత్పత్తి కేంద్రానికి కాంపాక్టర్ ద్వారా మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగం సిబ్బంది తరలిస్తున్నారు.

మరో కాంపాక్టర్‌కు ప్రతిపాదన... నర్సీపట్నం నుంచి రోజూ కాంపాక్టర్ ద్వారా కాపులుప్పాడలోని విద్యుదుత్పత్తి కేంద్రానికి పొడి చెత్త పంపాలన్నదే లక్ష్యం. బ్యాటరీలతో నడిచే కొత్త కాంపాక్టర్ కావాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ను కోరుతున్నాం. ప్రస్తుతం రెండు రోజులకోసారి తరలిస్తున్నాం. వరాహ నది ఒడ్డున డంపింగ్ యార్డు రక్షణ గోడ ఎత్తు పెంచేందుకు రూ.16 లక్షలు ఖర్చు చేయనున్నాం. టెండరు ఖరారైంది. త్వరలోనే పనులు చేపడతాం.- సురేంద్ర, మున్సిపల్ కమిషనర్, నర్సీపట్నం

# ఐటీకి ‘కూటమి’దన్ను

విశాఖపట్నం: ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగానికి సంబంధించి కొన్నేళ్లుగా వివిధ రకాల రాయితీలు, ప్రోత్సాహకాలు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం స్పందించి బకాయిల్లో రూ.125 కోట్లు తాజాగా విడుదల చేసింది. రాయితీలు, ప్రోత్సాహకాలను గత వైకాపా ప్రభుత్వంలో సీఎఫ్‌ఎంఎస్‌లో పెండింగ్ పెట్టారు. ఈ పెండింగ్‌లో ఉన్న వాటిలో 50 శాతం బకాయిలను ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇచ్చింది.ఐటీకే రూ.60 కోట్లకుపైగా: కూటమి ప్రభుత్వం విడుదల చేసిన ప్రోత్సాహకాల్లో ఐటీ కంపెనీలకు సంబంధించినవే రూ.60 కోట్లకుపైగా ఉన్నాయి. విశాఖ ఐటీ హిల్స్‌పై చిన్నపెద్దా కంపెనీలు 150 వరకు ఉన్నాయి. గతంలో తెదేపా హయాంలో డిజిగ్నేటెడ్ టెక్నాలజీ పార్కు (డీటీపీ) పాలసీని ప్రవేశపెట్టింది. వైకాపా అధికారంలోకి రాగానే రద్దు చేసింది.

**కట్టు కథలతో నెట్టుకొచ్చిన వైకాపా**

విశాఖ ఐటీ పార్కులో దరఖాస్తు చేసుకునే కంపెనీలకు సగం అద్దెకే భవనాలు ఇవ్వడంతోపాటు, ఇంటర్నెట్, నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించేవారు. ఏడాది పాటు ఒకరి ఉద్యోగం కల్పిస్తే రూ.లక్ష ఆ కంపెనీలకు ప్రోత్సాహకంగా ఇచ్చేవారు. కొవిడ్ సమయంలో కంపెనీలకు విద్యుత్ ఎండీ ఛార్జీలు (హెచ్‌పీకి రూ.450), ప్రాపర్టీ ఛార్జీలు రద్దు చేస్తామని స్వయాన అప్పట్లో జగన్ హామీ ఇచ్చి



వదిలేశారు. ఇప్పుడు ఈ వర్గాల వారందరికీ కూటమి ప్రభుత్వం నిర్ణయంతో ఊరట కలుగుతోంది.

వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రుషికొండ ఐటీ పార్కును నిర్లక్ష్యం చేసింది. ఐటీ హిల్స్‌పై ఉన్న 86 కంపెనీలకు సంబంధించి రూ.22కోట్లు బకాయిలు పెట్టింది. ‘ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల విడుదల చేయలేకపోతున్నాం, ఎన్నికలవగానే చెల్లిస్తాం’ అంటూ అప్పట్లో మంత్రిగా ఉన్న అమర్‌నాథ్ వాగ్దానాలు చేసి చేతులెత్తేశారు. ఏటా సీఎఫ్‌ఎంఎస్ నెంబరు మార్చడమే తప్ప రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా కట్టు కథలతో నెట్టుకొచ్చారు. ఐటీ కంపెనీల్లో పనిచేసే పరోక్ష సిబ్బందికి ఒక బస్సు ఏర్పాటు చేయమని కోరినా నాడు వైకాపా ప్రభుత్వం దృష్టిసారించలేదు.

చొరవకు కృతజ్ఞతలు: దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ముందుకు రావడం, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాల బకాయిలు చెల్లించడం ఐటీ పరిశ్రమల్లో విశ్వాసాన్ని పెంచుతుంది. ఇలాంటి నిర్ణయాలు విశాఖను భారత సిలికాన్ కోస్ట్‌గా నిలబెట్టడానికి ఉపయోగపడతాయి. రాయితీలు, ప్రోత్సాహకాల విడుదలకు చొరవ చూపిన మంత్రి నారా లోకేశ్, ప్రభుత్వ కార్యదర్శి కాటంనేని భాస్కర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు.- కొసరాజు శ్రీధర్, ఏపీడీటీఐ నెట్‌వర్క్ ఛైర్మన్

# విదేశీ కొలువు పలుకు

కర్నూలు : నర్సింగ్, డిప్లొమా అభ్యర్థులను జర్మనీ రారమ్మని పిలుస్తోంది. నెలకు రూ.లక్షల వేతనాలతో వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఊరిస్తున్నాయి. ఈ అవకాశాలను యువతకు చేరువ చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అభ్యర్థులకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెలకువలు నేర్పిస్తోంది. కోర్సు పూర్తయ్యాక సర్టిఫికెట్‌తోపాటు ప్రభుత్వమే జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది. నర్సింగ్ పూర్తి చేసిన వారికి జర్మనీలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినులకు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రస్తుతం తొలి బ్యాచ్ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి.

మొత్తం వంద మంది విద్యార్థులను బ్యాచ్‌లుగా విభజించి.. రోజుకు 2 గంటలకు పైగా జర్మన్‌భాష నేర్పిస్తున్నారు. జర్మనీలో ఉద్యోగం చేసేందుకు అవసరమైన నైపుణ్యాలపై ఆరు నెలల పాటు శిక్షణ ఇస్తారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షలకు వరకు వేతనం లభించే అవకాశం ఉంది.

ఐటీఐ చదివిన వారికి

రెండేళ్ల ఐటీఐ, మూడేళ్ల ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లలో ఉత్తీర్ణులైన, 30 ఏళ్లలోపు వయసు, కనీసం రెండేళ్ల అనుభవం కలిగి జర్మనీలో ఉద్యోగం చేసే ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి జర్మన్ భాషలో 12 నుంచి 14 వారాల పాటు శిక్షణ ఇప్పిస్తారు.

జర్మనీలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.2600 నుంచి రూ.2,700 యూరోలు (రూ.2.60 లక్షలు నుంచి రూ.2.70 లక్షలు) వేతనం లభిస్తుంది. డిప్లొమా, ఎలక్ట్రీషియన్ కోర్సులు చేసిన వారికి రాజమహేంద్రవరం, గుంటూరు జిల్లాల్లో మూడు, నాలుగు నెలల పాటు శిక్షణ ఇస్తున్నారు.

ఖతార్‌లో ఉద్యోగాలకు..

ఖతార్ దేశంలో ఆయిల్, గ్యాస్ పరిశ్రమల్లో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగాలు, స్ట్రక్చరల్ వెల్డింగ్, పైప్ ఫిట్టర్, ప్లంబర్, పెయింటింగ్, స్ట్రక్చరల్ ఫిట్టర్, సూపర్‌వైజర్ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. అభ్యర్థులకు సంబంధిత ట్రేడ్‌లలో డిప్లొమా, టెక్నికల్ సర్టిఫికెట్ విద్యార్హతలు అవసరం. ఆంగ్లంలో మాట్లాడగలిగే నైపుణ్యం ఉండాలి. 45 ఏళ్లలోపు వయసుండి, పదేళ్ల అనుభవం కలిగిన పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చు.

శిక్షణ తర్వాత ఖతార్‌లో ఉద్యోగ అవకాశాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఎంపికైన వారికి భారత కరెన్సీ ప్రకారం రూ.1,94,000-రూ.2,38,000 వేతనం లభిస్తుంది.

దరఖాస్తు ఎలా..“ జర్మనీ, ఖతార్‌లో ఉద్యోగాలు చేసేందుకు ఆసక్తిగల అభ్యర్థులు %naipunyam.ap.gov.in% వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు %skillinternational@ap ssdc.in% మెయిల్ ఐడీ, 9640606555, 9988853335, 8909117279 నంబర్లకు సంప్రదించొచ్చని” నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ తెలిపారు.

చురకలు



## హీట్ పెంచిన రష్మిక.. అదిరిపోయే లుక్స్ లో..

ప్రముఖ హీరోయిన్ రష్మిక మందన్న గత కొంతకాలంగా వరుస సినిమాలతో మంచి విజయాలను అందుకుంటున్న విషయం తెలిసిందే. అలా స్టార్ హీరోయిన్ గా భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. అయితే కొంతమంది ఆకతాయిలు మాత్రం చాలా అసభ్య కరంగా సోషల్ మీడియాలో ఈమె ఫోటోలను తీర్చిదిద్ది.. ఆ ఫోటోలు షేర్ చేయడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది రష్మిక. ముఖ్యంగా అధునాతన టెక్నాలజీ అయిన ఏఐ ను తప్పుదోవ పట్టిస్తూ రష్మిక బికినీ వేసుకున్నట్టు ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి.. ఆమెను మరింత ఇబ్బందులకు గురి చేశారు. ఇకపోతే దీనిపై ఇటీవల స్పందించిన రష్మిక మందన్న కూడా ఏఐ వాడకంపై మండిపడింది. మనుషుల్లాగా ప్రవర్తించండి అంటూ ఆకతాయిలను హెచ్చరించింది. ఇకపోతే ఇప్పుడు తన ఉనికిని చాటుకుంటూ ఒక మ్యాగజైన్ కోసం ఇచ్చిన ఫోజులకి ఆడియన్స్ ఫిదా అవుతున్నారు. విషయంలోకి వెళ్తే.. హాలీవుడ్ రిపోర్టర్ అనే మ్యాగజైన్ కవర్ పేజీ కోసం చాలా హుందాగా ట్రెండీ లుక్ లో ఫోటోలకు ఫోజులిచ్చి అందరి దృష్టిని ఆకట్టుకుంది రష్మిక. వైట్ షర్టు, బ్లాక్ కోట్ ధరించిన ఈమె.. దీనికి కాంబినేషన్లో బ్లాక్ కలర్ షాట్ ధరించింది. గం బూట్స్ తో తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసుకుంది రష్మిక. తర్వాత మరికొన్ని ఫోటోలను షేర్ చేసింది. మొత్తానికైతే ఈ మ్యాగజైన్ కోసం రష్మిక ఇచ్చిన లుక్స్ కి అభిమానులు



కూడా హీటెక్కిపోతున్నారు. ప్రస్తుతం రష్మికకు సంబంధించిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. రష్మిక పర్సనల్ విషయానికి వస్తే.. ప్రముఖ హీరో విజయ్ దేవరకొండతో గీతాగోవిందం సినిమా సమయంలోనే పరిచయం ఏర్పడగా.. అప్పటి నుంచే ఇద్దరు ప్రేమలో ఉన్నారనే వార్తలు వినిపించాయి. దీనికి తోడు వీరిద్దరి కాంబినేషన్లో డియర్ కామ్రేడ్ సినిమా కూడా వచ్చింది. ఇక ఇప్పటినుంచి ఇద్దరు చట్టాపట్టాలేసుకొని తిరుగుతూ ఎన్నోసార్లు కెమెరా కంటపడ్డారు. అంతేకాదు పలు ఈవెంట్లకి కలిసి హాజరవుతూ అందరిని ఆశ్చర్యపరిచారు. పైగా పెళ్లి చేసుకోబోతున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ క్లారిటీ ఇవ్వలేదు. దీనికి తోడు ఇటీవల రహస్యంగా నిశ్చితార్థం కూడా చేసుకున్నారు. ఇకపోతే తమ నిశ్చితార్థం పై రష్మిక ఓపెన్ అయ్యింది కానీ విజయ్ దేవరకొండ మాత్రం స్పందించకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా ఫిబ్రవరిలో వివాహం చేసుకోబోతున్నారు అంటూ వార్తలు రాగా.. దీనిపై కూడా రష్మిక స్పందించింది. దీనిపై రష్మిక మాట్లాడుతూ.." నేను వివాహాన్ని తిరస్కరించడానికి లేదా ధ్రువీకరించడానికి ఇష్టపడడం లేదు. ఎందుకంటే దాని గురించి ఎప్పుడు మాట్లాడాలో అప్పుడే మాట్లాడుతాను. ప్రతిదానికి సమయం వస్తుంది. ఆ సమయం వచ్చినప్పుడు ఆ విషయాలపై స్పందిస్తాను. అప్పటివరకు నేనేం చెప్పను " అంటూ పెళ్లి వార్తలపై తనదైన శైలిలో కామెంట్ చేసింది రష్మిక. దీంతో వీరిద్దరి పెళ్లి వార్తలపై ఎటువంటి స్పష్టత రాకపోవడంతో అభిమానులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు .మరొకవైపు వీరిద్దరి పెళ్లి పనులు అప్పుడే మొదలయ్యాయి అనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి.

## మమితా మరో సాయి పల్లవి అవ్వాలంటే..?

కొంతమంది హీరోయిన్స్ కి స్టార్ రేంజ్ వచ్చినా అది వాళ్ల గ్లామర్ తోనే అని తెలుస్తుంది. గ్లామర్ షోతో అలరించే భామలు కొందరైతే కేవలం తమ అభినయంతో మెప్పించే వారు ఇంకొంతమంది ఉంటారు. అలాంటి వారిలో మలయాళ భామ మమితా బైజు కూడా వస్తుంది. మమితా బైజు మలయాళ పరిశ్రమలో ఏడేళ్ల నుంచి సినిమాలు చేస్తుంది. ఐతే ప్రతి సినిమాలో మమితా తన టాలెంట్ తో అలరిస్తూ వస్తుంది. ప్రేమలు సినిమాతో ఆమె సౌత్ ఆడియన్స్ అందరికీ బాగా దగ్గరైంది. ప్రేమలు సినిమా తెలుగు ఆడియన్స్ కు కూడా బాగా నచ్చేసింది. అందుకే ఆమెను తెలుగు ప్రేక్షకులు కూడా ఇష్టపడుతున్నారు.

**ప్రదీప్ రంగనాథన్ తో డ్యూడ్..** ఐతే తెలుగులోనే కాదు తమిళంలో కూడా మమితాకు మంచి క్రేజ్ ఏర్పడింది. ఆల్రెడీ అమ్మడు అక్కడ సినిమాలు చేస్తుంది. దళపతి విజయ్ జన నాయగన్ తో సినిమా చేస్తున్న మమితా లేటెస్ట్ గా ప్రదీప్ రంగనాథన్ తో డ్యూడ్ లో ఆకట్టుకుంది. డ్యూడ్ సినిమాలో ఆమె రోల్ చూసిన ఆడియన్స్ మరోసారి మమితా ప్రేమలో పడిపోతున్నారు. ప్రతి పాత్ర కథ




విన్నప్పుడు ఎలా ఉన్నా తన అభినయంతో మెస్మరైజ్ చేస్తుంది మమితా బైజు. అందుకే ఆమెను సహజ నటిగా పొగిడేస్తున్నారు ఆడియన్స్. ఇక కొందరైతే మమితాను సాయి పల్లవితో పోల్చేస్తున్నారు. సాయి పల్లవి కూడా అంతే కేవలం పాత్ర ప్రాధాన్యత ఉంది అనిపిస్తే చాలు అది ఎలాంటి సినిమా అయినా చేస్తుంది. ఐతే సాయి పల్లవి తన కెరీర్ లో చాలా ప్రయోగాలు చేసింది. కానీ మమితా ఇప్పుడే కెరీర్ మొదలు పెట్టింది కాబట్టి ఆమెకు ఇంకా అలాంటి ఛాన్స్ లు రాలేదు. కచ్చితంగా సౌత్ ఆడియన్స్ మమితా మీద చూపిస్తున్న ప్రేమ చూస్తుంటే సాయి పల్లవి తర్వాత ఆమె అనిపించేలా క్రేజ్ తెచ్చుకుంటుంది.

**అభినయంతో ఆడియన్స్ ని మెప్పిస్తూ..** మమితా కూడా ఆడియన్స్ లో తనపై ఉన్న నమ్మకాన్ని తగ్గించకూడదని ఫిక్స్ అయ్యింది. గ్లామర్ షో చేయడం వల్ల సినిమా ఛాన్స్ లు వస్తాయేమో కానీ ఒక ఐదారు సినిమాల తర్వాత బోర్ కొట్టేస్తారు. కానీ అభినయంతో ఆడియన్స్ ని మెప్పిస్తూ.. సినిమా సినిమాకు.. ప్రతి పాత్రలో కొత్తగా కనిపిస్తే మాత్రం వాళ్లకి ఎక్కువ కెరీర్ ఉంటుంది. సో మమితాకు కచ్చితంగా మలయాళం మాత్రమే కాదు మిగతా సౌత్ భాషల్లో కూడా మంచి ప్రేక్షకాదరణ లభిస్తుందని చెపడంలో సందేహం లేదు.

తెలుగులో వెంకీ అట్లూరి సూర్య సినిమాలో మమితా హీరోయిన్ గా సెలెక్ట్ అయ్యింది. ఆ సినిమాతో మరోసారి తెలుగు, తమిళ ప్రేక్షకులను అలరించనుంది అమ్మడు.




## సైక్ సిద్దార్థ్ స్టఫ్ ఓకే.. కానీ..?




దాదాపు రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతూ హీరోగా ప్రయ్వత్నించి ఫ్రెండ్ రోల్స్ చేస్తూ విలన్ గా కూడా ట్రై చేసి సిల్వర్ స్క్రీన్ కాదు స్మాల్ స్క్రీన్ బెటర్ అని అక్కడ తన టాలెంట్ చూపించి.. రియాలిటీ షో హోస్ట్ గా.. క్రికెట్ కామెంట్రీ హోస్ట్ గా ఇలా తనలో ఉన్న టాలెంట్ అంతా చూపిస్తూ వస్తున్నాడు నందు. కానీ ఎంత కష్టపడినా అతనికి రావాల్సిన గుర్తింపు మాత్రం రావట్లేదని చెప్పొచ్చు. ఎప్పుడో శివ నాగేశ్వర రావు డైరెక్షన్ లో తెరకెక్కిన ఫోటో సినిమాతో పరిచయమయ్యాడు నందు .

**ట్రైలర్ లో నందు యాక్టింగ్..** 2006 నుంచి 2025 వరకు అతని చేయని ప్రయత్నం లేదు. ఐతే ఈమధ్య స్మాల్ స్క్రీన్ హోస్ట్ గా ప్రేక్షకులను మెప్పిస్తున్న నందు లేటెస్ట్ గా తన సొంత నిర్మాణంలో సైక్ సిద్ధార్థ్ అనే సినిమా చేశాడు. లీడ్ యాక్టర్ గా తనే నటిస్తూ నిర్మించిన సైక్ సిద్ధార్థ్ సినిమాను వరుణ్ రెడ్డి డైరెక్ట్ చేశాడు. ఈ సినిమా డిసెంబర్ 12న రిలీజ్ లాక్ చేశారు. సినిమా ట్రైలర్ రీసెంట్ గా రిలీజై ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. సైక్ సిద్ధార్థ్ ప్రేమతో పాటు తన జీవితంలో ఒక ఉన్నంత లక్ష్యం పెట్టుకుని కలలు కంటున్న అతని జీవితం ఎలా మారింది అన్నదే సినిమా పాయింట్. సినిమా ట్రైలర్ లో నందు యాక్టింగ్ చూస్తే నెక్స్ట్ లెవెల్ అనిపిస్తుంది. సైక్ సిద్ధార్థ్ క్యారెక్టరైజేషన్ డిఫరెంట్ గా ఉంది. సినిమాలో కావాల్సినంత బోల్డ్ స్టఫ్ ఉందని తెలుస్తుంది. యూత్ ఆడియన్స్ కి కావాల్సిన కంటెంట్ అంతా ఉంది కాబట్టి ఈ సైక్ సిద్ధార్థ్ ని వాళ్లు ఎలా రిసీవ్ చేసుకుంటారో చూడాలి.

**ఈ సినిమాతో ప్రూవ్ చేసుకోవాలని..** స్వతహాగా తన కెరీర్ తాను ప్లాన్ చేసుకుంటూ ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చాడు నందు. ఇప్పటివరకు సరైన బ్రేక్ అయితే రాలేదు. సైక్ సిద్ధార్థ్ మీద అతని టైం ని మాత్రమే కాదు నిర్మాతగా తన డబ్బు కూడా పెట్టాడు.

సో ఈ సినిమాతో నందు తనేంటో ప్రూవ్ చేసుకోవాలని గట్టిగా ఫిక్స్ అయ్యాడు. ఐతే సైక్ సిద్ధార్థ్ ట్రైలర్ ఇంప్రెసివ్ గా ఉన్నా కొన్ని సీన్స్ అర్జున్ రెడ్డి ఇంకా రీసెంట్ గా వచ్చిన కొన్ని సినిమాలను గుర్తు చేస్తున్నాయి. మరి ఈ సైక్ ఆ సినిమాల కన్నా డిఫరెంట్.. ఇది వేరే లెవెల్ అని ప్రూవ్ చేస్తే మాత్రం నందు సక్సెస్ అయినట్టే లెక్క. డిసెంబర్ 12న రిలీజ్ అవుతున్న ఈ సినిమాపై నందు మాత్రం చాలా హోప్స్ పెట్టుకున్నాడు. ఎలాగు ట్రైలర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది కాబట్టి సినిమాని గట్టిగా ప్రమోట్ చేసే ప్లాన్ లో ఉన్నాడు నందు. సో యూత్ ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేయగలిగితే మాత్రం సైక్ సిద్ధార్థ్ గట్టేక్కే ఛాన్స్ ఉంటుంది.

## మాస్ ఫ్యాన్స్ కి ఫీస్ట్.. కరుప్పు నుంచీ సాంగ్ రిలీజ్!



తమిళ నటుడు సూర్య రెట్రో మూవీ తర్వాత ఆర్జే బాలాజీ డైరెక్షన్లో కరుప్పు అనే మూవీతో మన ముందుకు రాబోతున్నారు. సూర్య నటించిన 45వ సినిమాగా తెరకెక్కుతున్న కరుప్పు మూవీ విడుదల తేదీ గురించి నిర్మాతలు ఇప్పటివరకు అఫీషియల్ గా వెల్లడించకపోయినప్పటికీ తాజాగా దీపావళి పండుగ సందర్భంగా కరుప్పు మూవీ నుండి మొదటి పాటను రిలీజ్ చేశారు.. తాజాగా "గాడ్ మోడ్" అనే పాటను రిలీజ్ చేశారు.నాలుగు నిమిషాల నిడివి గల ఈ ట్రాక్ సూర్య రోల్ ని పూర్తిగా గాడ్ మోడ్ లో చూపిస్తుంది. తమిళ జానపద మతంలో ఎక్కువగా పూజించబడే పవర్ ఫుల్ దేవుడు అయినటువంటి కరుప్పు స్వామి మానవ స్వరూపంగా ఈ పాటను ప్రదర్శించారు. తప్పు చేసిన వారికి ఈ దేవుడి పర్యవేక్షణలో స్థానం లేదు అని ఈ పాట చెబుతుంది.. ఇక ఈ పాట కోరస్ లో హీరో సూర్యను కరుప్పు స్వామి అని పిలుస్తారు.. అతని రాక ఎంతోమందికి చిరునవ్వులు తెప్పిస్తుందని, ఎంతోమంది ప్రజల హృదయాలను ప్రశాంత పరుస్తుందని ఈ పాట ద్వారా తెలిపారు.. తాజాగా విడుదలైన సూర్య కరుప్పు మూవీలోని పాట ఎంతోమంది అభిమానులను ఉత్సాహపరుస్తుంది..అలా తాజాగా విడుదలైన కరుప్పు సినిమాలోని గాడ్ మోడ్ పాటకి ఆయన అభిమానులు సోషల్ మీడియాలో ఆసక్తికరమైన పోస్టులు పెడుతున్నారు. ఆర్జె బాలాజీ డైరెక్షన్లో తెరకెక్కుతున్న కరుప్పు మూవీకి సంబంధించిన టీజర్ ని జూన్ ప్రారంభంలో నిర్మాతలు రిలీజ్ చేశారు. ఈ టీజర్ లో సూర్య బ్లాక్ కలర్ షర్ట్ , వైట్ కలర్ ధోతి ధరించి పవర్ ప్యాక్డ్ అవతారంలో కనిపించారు. అలాగే ఈ టీజర్ లో సూర్య న్యాయవాదిగా కోట్ ధరించినట్లు కూడా చూపించారు. ఇప్పటికే రెండు సినిమాలలో న్యాయవాది పాత్రలో మెరిసిన సూర్య ముచ్చటగా మూడోసారి కూడా కరుప్పు మూవీలో న్యాయవాది పాత్రలో కనిపించబోతున్నట్టు టీజర్ ద్వారా అర్థమైంది. ఈ సినిమాని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్ పై ఎస్.ఆర్. ప్రభు, ఎస్.ఆర్.ప్రకాష్ బాబు లు నిర్మిస్తున్నారు.ఇక ఈ మూవీలో సూర్య సరసన త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే యోగి బాబు, స్వతిక, శివదా,ఇంద్రన్స్, సుప్రీత్ రెడ్డిలు కీ రోల్స్ పోషిస్తున్నారు.ఈ సినిమాకి సాయి అభ్యాంకర్ సంగీతం అందిస్తున్నారు. అలా రెట్రో మూవీ ఫ్లాప్ తర్వాత సూర్య కరుప్పు మూవీతో మనల్ని అలరించబోతున్నారు. ఈ సినిమానే కాకుండా సూర్య , వెంకీ అట్లూరి డైరెక్షన్లో ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న సూర్య 46 అనే వర్కింగ్ టైటిల్ తో వస్తున్న మూవీలో కూడా నటిస్తున్నారు.

ఈ సినిమాలో హీరోయిన్ గా మమితా బైజు నటించగా.. రవీనా టాండన్, రాధిక శరత్ కుమార్ లు కీ రోల్స్ పోషిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ కూడా శరవేగంగా జరుగుతుంది.

## ఇతరుల జీవితాలతో ఆడుకోవడం అలవాటు - రకుల్

ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తెలుగులో వెంకటాద్రి ఎక్స్ప్రెస్ అనే సినిమాతో మంచి ప్రేక్షకాదరణ పొందిన ఈయన.. ఆ తర్వాత పలువురు స్టార్ హీరోలకు జోడిగా నటించి, తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఆ తర్వాత కాలంలో ఈమె నటించిన చిత్రాలు డిజాస్టర్ గా నిలవడంతో అవకాశాలు తగ్గుముఖం పడ్డాయి. దీనికి తోడు మన్మధుడు 2 చిత్రంలో తండ్రి వయసున్న హీరో పక్కన హీరోయిన్ గా నటించడమే కాకుండా బోల్డ్ సన్నివేశాలలో నటించి అందరి చేత విమర్శలు కూడా ఎదుర్కొంది. దాంతో సౌత్ లో అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్ కు వెళ్ళిపోయింది. అక్కడే అడపాదడపా సినిమాలలో చేస్తూనే.. ప్రముఖ నటుడు, బాలీవుడ్ నిర్మాత అయిన జాకీ భగ్నానీనీ ప్రేమించి మరీ పెళ్లి చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. వివాహం అనంతరం తన భర్త గురించి వచ్చిన రూమర్స్ పై స్పందించింది. ముఖ్యంగా సోషల్ మీడియాలో తప్పుడు కథనాలను సృష్టిస్తూ ఇతరుల జీవితాలతో ఆడుకోవడం అలవాటైపోయింది అంటూ ట్రోలర్స్ పై రూమర్స్ క్రియేట్ చేసే వారిపై మండిపడింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ ప్రీత్ సింగ్ సోషల్ మీడియాలో



వస్తున్న రూమర్స్ పై స్పందిస్తూ.. ఇండస్ట్రీలో ఒడిదుడుకులు సహజమని చెప్పిన రకుల్ ప్రీత్ సింగ్.. దివాలా తీసారని, కంపెనీ మూసేశారనే వార్తలపై స్పందించింది. ఆమె మాట్లాడుతూ.. "క్లిక్స్ కోసం ఏమైనా రాసే సంస్కృతికి ప్రజలు అలవాటు పడ్డారు. వాస్తవానికి తప్పుడు వార్తలకు చాలా వ్యత్యాసం ఉంది. నిజానిజాలు నాకు అన్నీ తెలుసు కాబట్టి నేను వాటిని పట్టించుకోలేదు. ముఖ్యంగా చిత్ర పరిశ్రమలో భాగమైనప్పుడు కొన్ని విషయాల గురించి మౌనంగా ఉండటమే మంచిది. సమయం వచ్చినప్పుడు అసలు నిజం ఏమిటి అన్నది ప్రజలకే తెలుస్తుంది. జాకీ భగ్నానీ పై వార్తలు వచ్చినప్పుడు అతడు ఎన్ని సవాళ్లు ఎదుర్కొన్నాడో నాకు మాత్రమే తెలుసు. కంపెనీ మూసేసారని రాశారు. అయితే ఆయన నిర్మాతగా వ్యవహరించిన మూడు సినిమాలు విజయం వరించలేదు అన్నమాట వాస్తవమే. కానీ కంపెనీ మూసివేయలేదు. ఆర్థికంగా నష్టపోయాం. ఇండస్ట్రీలో ప్రతి నిర్మాతకి కూడా నష్టం జరుగుతుంది. ఒకానొక సమయంలో అమితాబ్ బచ్చన్ కూడా ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొన్నాడు. ఎదుగుతున్న సమయంలో ఇది ఒక దశ. అన్నింటిని అధిగమించినప్పుడే మనం సక్సెస్ సాధిస్తాము. ముఖ్యంగా ఇతరుల జీవితాలతో ఆడుకోవడం కొంతమందికి అలవాటైపోయింది. అందుకే నిజానిజాలు తెలుసుకోకుండా ఎదుటివారి మనోభావాలను అర్థం చేసుకోకుండా తప్పుడు కథనాలను ప్రచురితం చేస్తున్నారు" అంటూ మండిపడింది రకుల్ ప్రీత్ సింగ్. ఇకపోతే అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రలో నటించిన 'బడే మియా చోటే మియా' సినిమా డిజాస్టర్ గా మిగిలినప్పుడు ఈ వార్తలు వెలువడ్డాయి. ఏది ఏమైనా భారీ తారాగణంతో వచ్చిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో విజయాన్ని అందుకోకపోవడం వల్లే రకుల్ భర్త పై ఈ రూమర్స్ వినిపించాయి.

## నేను మహిళగా మారిన రోజు అది: ప్రియాంక చోప్రా

గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా ఏం చేసినా అది ప్రత్యేకంగా ఉంటుంది. భర్త, పిల్లలు, కుటుంబంతో విదేశీ బీచ్ లలో చిలౌట్ చేస్తున్నా లేదా రెడ్ కార్పెట్ ఈవెంట్లలో క్యాట్ వాక్ లు చేసినా, న్యూయార్క్ వీధుల్లో అప్రయత్నంగా షికార్లు చేసినా.. ప్రతిసారీ సందర్భానికి తగ్గట్టుగా తన లుక్‌తో మైమరిపిస్తుంది. అంతర్జాతీయ రెడ్ కార్పెట్ ఈవెంట్లలో పీసీ ఫ్యాషన్ సెన్స్ పరంగా విఫలం కాలేదు. పీసీ లుక్ సెన్స్, ధరించిన ఆభరణాల గురించి విస్తృతంగా చర్చ సాగుతుంది. ముఖ్యంగా ప్రియాంక చోప్రా ఆభరణాల ఎంపికలు అందరి దృష్టిని ఆకర్షిస్తుంటాయి. లగ్జరీ జ్యువెలరీ బ్రాండ్ బల్గారి గ్లోబల్ అంబాసిడర్‌గా ఉన్న ప్రియాంక చోప్రా ఆభరణాలతో వ్యక్తిగత సంబంధం గురించి తాజాగా మాట్లాడింది. తాజా ఇంటర్వ్యూలో పీసీ తనను తాను మహిళగా ఆవిష్కరించుకున్న సందర్భం గురించి మాట్లాడింది. ప్రియాంక చోప్రా తన పారితోషికం అందుకున్న తర్వాత,



మొదటగా రెండు క్యారెట్ల వజ్రాన్ని కొనుగోలు చేసానని తెలిపింది. అది కూడా తన మొదటి సినిమాకి అందిన పారితోషికాన్ని దాచుకుని ఖర్చు చేసిందట. నా వజ్రాలను నేను కొనుగోలు చేయడం అంటే నేను ఒక మహిళగా మారినట్టేనని నా తల్లి (మధు చోప్రా) చెప్పారని ప్రియాంక చోప్రా తెలిపింది. నేను కొనుగోలు చేసిన మొదటి ముఖ్యమైన ఆభరణం రెండు క్యారెట్ల వజ్రం. ఇది నా కెరీర్ ఆరంభంలో .. నా మొదటి సంతకం నుంచి దాచుకున్న డబ్బు.. అని వెల్లడించింది.రెడ్ కార్పెట్ ఈవెంట్స్, సినిమా ప్రీమియర్ల కోసం ఆభరణాల ఎంపికకు వేరే ఏదైనా విధానం ఉందా? అని ప్రశ్నిస్తే... ధరించాలనుకున్న ఆభరణం ఎలాంటిదో ఎంపిక చేసుకున్న దుస్తులు నిర్ణయిస్తాయని వెల్లడించింది. 2019 కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లో తెల్లటి టల్లే గౌనుతో అద్భుతమైన చోపార్డ్ డైమండ్ నెక్లెస్, చెవిపోగులను ధరించింది.

అది ఆ సంవత్సరం అత్యంత చర్చనీయాంశమైన లుక్స్‌లో ఒకటిగా మారింది. 2017 మెట్ గాలా ఈవెంట్ కోసం రాల్ఫ్ లారెన్ ట్రెంచ్ గౌను ధరించింది. 2023 మెట్ గాలాలో అరుదైన 11.16-క్యారెట్ పియర్-ఆకారపు నీలిరంగు వజ్రం, లగున బ్లూను కలిగి ఉన్న అద్భుతమైన బల్గారి నెక్లెస్ లను ధరించింది. ప్రియాంక ఫ్యాషన్ అండ్ ట్రెండ్స్ ని అనుకరించడంలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఫ్యాషనిస్టా. అందాల రాణిగా యువతరం మనసుల్లో నిలిచి ఉండటానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536